

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 137

సోమవారం 7-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విడిగానే ఫ్యామిలీ హెల్త్!

వృద్ధాప్య తల్లిదండ్రులను చేరిస్తే అధిక ప్రీమియం.. కవరేజీ పరిమితమే –బిజినెస్‌లో



సిరీస్ భారత్ కైవసం

రెండో టెస్ట్‌లో శ్రీలంకపై ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో గెలుపు –6లో

అంతా సెట్ చేశారు

- 3 కోట్ల సెట్ టాప్ బాక్సుల ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్‌తో రానున్న బాక్సులు
- అధికార పార్టీ నేతలిద్దరికి కాంట్రాక్టులు
- మామూలు సెట్‌టాప్ బాక్స్ ధర రూ.1500
- కానీ రూ.4 వేలుగా ధర నిర్ణయించిన ప్రభుత్వం
- డబ్బుకు డబ్బు.. కేబుల్ ప్రసారాలపై అదుపు
- ఇక సర్కారు చూపించే వార్తలు, సినిమాలే చూడాలి..
- రూ.4,500 కోట్ల కమీషన్లకు సర్కారు స్కెచ్



సర్కారు వారి సెట్ టాప్ బాక్సుల వ్యవహారం చూస్తుంటే 'పావలా కోడికి ముప్పావలా మసాలా' అన్న సామెత గుర్తొస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం టీవీలున్న వారి ఇళ్లలో 90 శాతం సెట్ టాప్ బాక్సులు ఉన్నాయి. ఇప్పటికే రూ.1500 వెచ్చించి ఆ బాక్సును కొనుగోలు చేశారు. ఈ స్థితిలో ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్ అంటూ.. టీవీ, టెలిఫోన్, ఇంటర్‌నెట్‌లను ఒకే కనెక్షన్ ద్వారా ఇస్తామని ఊదరగొడుతూ ముందుకొచ్చింది. ఇందుకోసం ఏర్పాటు చేసే సెట్ టాప్ బాక్స్ కోసం రూ.4 వేలు చెల్లించాలంటోంది. ఇంత సొమ్మును పేద వర్గాల వారు చెల్లించడం ఇప్పటికిప్పుడు అసాధ్యం. ఈ సాకుతో వారిపై ఎక్కడ లేని ప్రేమ ఒలకబోస్తూ.. రుణ సదుపాయం కల్పిస్తామంటోంది. దీని వెనుక ఉన్న మర్మం.. కిటుకు అంతా ఇక్కడే ఉంది. జనాలకందరికీ బ్యాంకుల ద్వారా అప్పులిప్పించాలి.. ఆ సొమ్ములో వేలకోట్లు దండుకోవాలి.. జనం మాత్రం వడ్డీ సహా బ్యాంకులకు అప్పులు చెల్లించాలి.. ఇదే అసలు పథకం!! దీంతోపాటు ప్రసారాలను నియంత్రించే 'కీ'ని ప్రభుత్వం తమ చేతిలో పెట్టుకుంటుంది. తాను తలచిందే నిజమని జనానికి చూపించనుంది. ఆందోళన కలిగించే కొత్తతరహా బాదుడు కథాకమామిషూ ఇది..

- వివరాలు 2లో



చిరుత లాంటి పరుగుతో ప్రపంచం మొత్తాన్ని మైమరపించిన ఉస్సేన్ బోల్ట్.. ఫైనల్ రేసులో తన చిరకాల ప్రత్యర్థినీ ఫిదా చేసుకున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల రేసులో స్వర్ణం గెలిచి తన కెరీర్‌కు ఘనంగా వీడ్కోలు పలకాలని ఆశించిన జమైకా దిగ్గజానికి నిరాశ ఎదురైంది. అమెరికా వెటరన్ స్టార్ జస్టిన్ గాట్లిన్ (9.92 సెకన్లు), రైజింగ్ స్టార్ కోల్మన్ (అమెరికా–9.94 సెకన్లు) ధాటికి బోల్ట్ (9.95 సెకన్లు) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గతంలో రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడి పునరాగమనం చేసిన గాట్లిన్ తన అనుభవాన్నంతా రంగరించి ఫైనల్ రేసులో బోల్ట్‌కు షాక్ ఇచ్చాడు. రేసు ముగిసిన వెంటనే బోల్ట్ వద్దకు వచ్చిన గాట్లిన్ తన చిరకాల ప్రత్యర్థి ముందు మోకాళ్లపై కూర్చొని వందనం చేశాడు.

- స్పోర్ట్స్‌లో

బస్సు 'బేరం' కుదిరింది

'అరుణాచల్' బస్సులకు రైట్‌రైట్!

- 'ముఖ్య'నేతతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల మంతనాలు
- మంత్రి మధ్యవర్తిత్వం.. కుదిరిన బేరసారాలు
- సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని 'ముఖ్య'నేత హామీ
- ఇతర రాష్ట్రాల్లో రిజిస్టరైన బస్సులకు మళ్లీ అనుమతులు?
- త్రైమాసిక పన్ను కట్టించుకోవాలని రవాణా శాఖపై ఆపరేటర్ల ఒత్తిళ్లు



సాక్షి, అమరావతి

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ప్రైవేట్ బస్సులను మళ్లీ రోడ్డెక్కించేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. కీలక మంత్రితో జరిపిన మంతనాలు సఫలం కావడం, బేరసారాలు కుదరడంతో త్వరలో తమ బస్సులు స్టేజీ క్యారియర్లుగా తిరుగుతాయంటూ ప్రైవేట్ ఆపరేటర్లు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఉన్నతస్థాయిలో డీల్ కుదిరిందని, బస్సులకు త్రైమాసిక పన్ను(క్వార్టర్లీ ట్యాక్స్) కట్టించుకోవాలని రవాణా శాఖపై ఒత్తిడి పెంచుతున్నారు. అయితే, తమకు

మిగతా 2వ పేజీలో ▶



'ఆలిండియా జ్యుడీషియల్' వద్దు..!

- దిగువకోర్టుల్లో జడ్జీల నియామకాలకు ఉద్దేశించిన ఏఐజేఎస్‌పై మెజారిటీ హైకోర్టుల వ్యతిరేకత
- కేంద్ర ప్రతిపాదనలకు లభించని ఆమోదం

- వివరాలు 6లో

90 ఏళ్లనాటి మసీదు కూల్చివేత!

- అర్ధరాత్రి నేలమట్టం చేసిన అధికారులు
- కృష్ణా జిల్లాలో ఘటన

- వివరాలు 5లో

స్వయంగా వచ్చే దాతలకే కాటేజీలు: టీటీడీ

సాక్షి, తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. ఆ రోజుల్లో స్వయంగా వచ్చే దాతలకు మాత్రమే కాటేజీలు కేటాయించనున్నారు. వారి సిఫారసులకు గదులు కేటాయించరు. సెప్టెంబరు 27న గరుడసేవ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబరు 26, 27 తేదీల్లో మాత్రం కాటేజీ దాతలకు ఎలాంటి గదుల కేటాయింపూ ఉండదని టీటీడీ ప్రకటించింది. గదులు కావాల్సిన కాటేజీ దాతలు 4 రోజుల ముందుగా cdmr.ttdrevoanli ne.com వెబ్‌సైట్‌లో రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

'హోదా కోసం ప్రధానికి రాఖీ నిరసన తెలపండి'

సాక్షి, అమరావతి: రాఖీ పండుగ రోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు మహిళలంతా ఇంటి నుంచే ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల ద్వారా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రధానిని డిమాండ్ చేయాలని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 'ఏపీకి ప్రత్యేక హోదా కోసం రాఖీ నిరసన' పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు.



కర్నూలు జిల్లా నంద్యాలలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి తనయుడు గంగా చరణ్‌రెడ్డి, దీప్తి నిఖిల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి తదితరులు



హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు హబీబ్ ఉల్లా. చిత్రంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, కర్నూలు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త హఫీజ్‌ఖాన్

అంతా సెట్ చేశారు..

- 3 కోట్ల బాక్సుల ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్‌తో సెట్‌టాప్ బాక్సులు
- అధికార పార్టీ నేతలిద్దరికి కాంట్రాక్టులు
- రూ.4,500 కోట్ల కమీషన్లకు సర్కారు స్కెచ్

సాక్షి, అమరావతి: హెచ్‌డీ క్వాలిటీతో సెట్ టాప్‌బాక్స్ పెట్టించుకోవాలంటే ఏ ప్రముఖ కంపెనీ చూసినా రూ. 1,500 మించి లేదు. అలాంటిది రాష్ట్రప్రభుత్వం రూ. 4 వేలతో ఇంటింటికీ ఓ సెట్‌టాప్ బాక్స్ అంటగట్టాలనుకుంటోంది. టీవీ, టెలిఫోన్, ఇంటర్నెట్ మూడూ ఇస్తామని, అందు కోసం రూ.4 వేలు పోసి ఈ సెట్ టాప్ బాక్స్ కొనాలని చెబుతోంది. అవసరం అనుకున్న వాళ్లకు ఈ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా లోన్‌గా కూడా ఇప్పిస్తామంటోంది. ప్రస్తుత సెల్ యుగంలో ల్యాండ్ లైన్ ఫోన్ అవసరమే లేకుండాపోయింది. అలాంటపుడు ఈ మూడూ ఉన్న సెట్‌టాప్ బాక్స్ ఎంతమందికి అవసరం? ఇప్పటికే దేశవ్యాప్తంగా కేబుల్ టీవీ డిజిటైజేషన్ పూర్తయింది. అందరూ సెట్‌టాప్ బాక్స్‌లు కొనుక్కుని టీవీలకు అమర్చుకున్నారు. అలాంటపుడు కొత్తగా రూ. 4 వేలు పోసి సెట్‌టాప్ బాక్స్ ఎందుకు కొనాలి? ఇప్పటికే అమర్చుకున్న బాక్స్‌లను ఏం చేస్తారు? అసలు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఈ ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చింది? ఏ ప్రయోజనాలను ఆశించి కొత్త సెట్ టాప్ బాక్సులను అందించబోతున్నారు? ఇందులో రెండు ప్రధానమైన అంశాలున్నాయని.. ఒకటి కమీషన్ల కక్కుర్తి.. రెండోది కేబుల్ ప్రసారాలను అదుపులోకి తెచ్చుకోవాలన్న దుగ్ధ అని విమర్శకులంటున్నారు. అవేమిటో చూద్దాం..



అయినవారికే కాంట్రాక్టులు: వాస్తవానికి సెట్ టాప్ బాక్సుల కుంభకోణం ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుతోనే మొదలైంది. ముఖ్యమంత్రి సమీప బంధువుకు చెందిన ముఖ్యమంత్రి సమీప బంధువుకు చెందిన టెరా సాఫ్ట్‌వేర్ సంస్థకు ఈ ప్రాజెక్టు కట్టబెట్టారు. ఇందులోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. కరెంట్ స్తంభాలను ఉపయోగించుకుని 23,500 కి.మీ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేశారు. సెట్ టాప్ బాక్స్‌లను ఉపయోగించి టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ అందించే పేరుతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ బాక్సులను చైనా తయారు చేస్తోంది. సెట్‌టాప్ బాక్సులను అందించేందుకు చైనా కంపెనీల ప్రతిపాదనలపై చర్చలు జరుగుతుండగానే ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమర్ రాజా, యాగా టెక్నాలజీ ప్రతినిధులు కలిశారు. అమర్ రాజా సంస్థ చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ నేతది. యాగా టెక్నాలజీ సంస్థ కూడా కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన అధికార పార్టీ నేతది. ఈ రెండు సంస్థలకే సెట్ టాప్ బాక్సుల కాంట్రాక్టు అప్పగించేందుకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ రెండు సంస్థలు సెట్‌టాప్ బాక్సులను తయారుచేయవు. చైనా నుంచి విడి భాగాలు తెప్పించి వాటిని అసెంబుల్ (విడిభాగాల కూర్పు) చేస్తాయి. విడి భాగాలపై ఎలాంటి పన్నులూ ఉండవు. అలాంటపుడు బాక్సు ధర రూ. 2వేలను మించే అవకాశమే లేదు. కానీ రూ. 4వేలకు అంటగట్టడానికి ప్రభుత్వం సిద్ధపడడం వెనుక దాదాపు రూ. వెయ్యి కోట్లు చేతులు మారినట్లు వినిపిస్తోంది. ఇంత పెద్ద ప్రాజెక్టుకు సాధారణంగా టెండర్లు పిలిచి తక్కువ కోట్ చేసే సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడం సహజం. కానీ, సెట్‌టాప్ బాక్సుల సరఫరా కాంట్రాక్టు విషయంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అలాంటి నిబంధనలను పట్టించుకోలేదు. పైగా అమర్‌రాజా, యాగా టెక్నాలజీలకు సెట్ టాప్ బాక్సుల తయారీపై అవగాహన లేదు. సాంకేతిక సమస్యలు తలెత్తితే పరిష్కరించే నిపుణులూ లేరు. అయినా, అయినవారు కాబట్టి వారికే రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా సెట్ టాప్ బాక్సులకు ఇప్పటికిపుడు రూ.4 వేలు చెల్లించడానికి వినియోగదారులు సిద్ధంగా లేరు.

ఇది రూ. 4,500 కోట్ల కుంభకోణం..

ఇంట్లో కేబుల్ టీవీకి సెట్‌టాప్ బాక్స్ పెట్టాలంటే రూ.1500 ఖర్చవుతుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని రూ.4 వేలకు కొనాలంటోంది. ఇంత ఖర్చు దేనికంటే.. హెచ్‌డీ క్వాలిటీతో టీవీ, టెలిఫోన్, ఇంటర్నెట్ వస్తాయంటోంది. ఇవి రావడానికి బాక్సులో ర్యామ్‌తోపాటు కొన్ని ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మారిస్తే సరిపోతుందని నిపుణులు అంటున్నారు. దీనికి అదనంగా మహా అయితే ఇంకో రూ.వెయ్యి ఖర్చువుతుందని చెబుతున్నారు. అంటే, రూ.2,500 ఖర్చవుతుందన్నమాట. అయితే, ఒక్కో సెట్‌టాప్ బాక్సును ప్రభుత్వం వినియోగదారులకు రూ.4 వేలకు అంటగట్టాలనుకుంటోంది. అంటే.. ఒక్కో వినియోగదారుడు అదనంగా రూ.1,500 చెల్లిస్తాడన్నమాట. రాష్ట్రంలో 3కోట్ల కేబుల్ కనెక్షన్లున్నాయి. వీటన్నిటికీ బాక్సులను అంటగడితే రూ.12వేల కోట్లు వస్తాయి. అందులో వాస్తవంగా ఖర్చులు పోగా వినియోగదారుల నుంచి అదనంగా రాబట్టే రూ.4,500 కోట్లు కమీషన్ల రూపంలో చేతులు మారబోతున్నాయి. ఈ ప్రాజెక్టును అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతల కంపెనీలకు అప్పగించారు. అంటే జనం నుంచి రాబట్టే అదనపు సొమ్మంతా ఈ రెండు కంపెనీలకు.. అక్కడి నుంచి సర్కారు పెద్దలకు చేరబోతోంది.

ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలోనూ ఫైబర్ కనెక్షన్లు...

ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ స్కూల్స్‌తోపాటు సీబీఎస్‌ఈ స్కూల్స్‌కు ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా సీసీటీవీ సర్వీలెన్స్ వ్యవస్థ, వర్చువల్ క్లాస్‌రూమ్ వ్యవస్థ, ప్రభుత్వ డ్రోన్స్ వ్యవస్థ, ఏపీ టవర్స్ లిమిటెడ్, ఏపీ స్టేట్ డేటా సెంటర్, పబ్లిక్ వైఫై వ్యవస్థ పనిచేయనున్నాయి. ప్రభుత్వ సర్వీసులను, ప్రభుత్వం చెబుతున్న విషయాలను ఈ వ్యవస్థల ద్వారా ప్రతి ఇంటికి చేరవేయడమే లక్ష్యంగా పనిచేయనున్నారు. అన్ని యూనివర్సిటీలు, స్వయం ప్రతిపత్తిగల కాలేజీల ప్రాంగణాలకు కూడా వైఫై సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు జిల్లాకో నోడల్ అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుత్ స్తంభాల ద్వారా ఏర్పాటుచేసిన ఫైబర్ నెట్ వర్క్ దెబ్బతినకుండా పోలీసు, విద్యా శాఖ, రోడ్లు–భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

ఇకపై ప్రభుత్వం గుప్పిట్లో ప్రసారాలు

విద్య, వైద్యం వంటి ముఖ్యమైన రంగాలను ప్రైవేటుకు అప్పగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కేబుల్ ఆపరేటర్లు చేయాల్సిన పనిని నెత్తికెత్తుకోవడం పట్ల అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 79% జనాభాకు టెలిఫోన్ సౌకర్యం, 87% మందికి సెల్‌ఫోన్, 27% మందికి ఇంటర్నెట్ సౌకర్యం ఉంది. అలాగే రాష్ట్రంలో 80% ఇళ్లలో టీవీలకు సెట్ టాప్ బాక్సులతో కేబుల్ నెట్ వర్క్ కనెక్షన్లు ఉన్నాయి. అయినా కొత్తగా రాష్ట్రంలోని ఇళ్లకు ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్‌తో సెట్‌టాప్ బాక్సులను అమర్చాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఫైబర్ నెట్ వర్క్ కనెక్షన్‌తోపాటు సెట్‌టాప్ బాక్సులను అమర్చుకుంటే ప్రజలు ఇక సర్కారు చూపించే సినిమాలు, వార్తలే చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానిస్తోంది. వాస్తవాలు ప్రజలకు తెలియకుండా నియంత్రించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫైబర్ నెట్ వర్క్, సెట్‌టాప్ బాక్సుల ఏర్పాటుకు పూనుకుందని అంటున్నారు. తొలి దశలో పది లక్షల సెట్‌టాప్ బాక్సులను మల్టీ సిస్టమ్ ఆపరేటర్ల (ఎంఎస్‌ఓల) ద్వారా ఇళ్లకు పంపిణీ చేయించాలని సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం రూ. 400 కోట్లు సమీకరించి సెట్ టాప్ బాక్సుల కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థలకు అందించింది. రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ. 200 కోట్లను, అలాగే బ్యాంకు నుంచి మరో రూ. 200 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి సమీకరించింది. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సెట్‌టాప్ బాక్సులను వినియోగదారులకు పంపిణీ చేయడానికి ఎంఎస్‌ఓలు విముఖత చూపుతున్నారు. మొత్తం కేబుల్ వ్యవస్థను ప్రభుత్వం నియంత్రణలోకి తీసుకోవడానికే ఈ సెట్‌టాప్ బాక్సులను తెరపైకి తెచ్చిందని ఎంఎస్‌ఓలు ఆందోళన చెందుతున్నారు. ఈ సెట్‌టాప్ బాక్సులు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రసారం చేసే నిమిత్తం ఫైబర్ నెట్ వర్క్ లిమిటెడ్.. 5,000 దక్షిణాది, 1,600 హిందీ, 500 ఇంగ్లీషు సినిమాలపై 3 ఒప్పందాలను చేసుకుంది. 4,000 స్కూల్స్, 6,896 పంచాయతీ కార్యాలయాలకు ఫైబర్‌నెట్ వర్క్ కనెక్షన్లను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది.




వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న జస్టిస్ వెంకటాచలయ్య, దొరైస్వామి, మురళీధర్‌రావు తదితరులు

కర్ణాటకే రాజకీయ పునర్జన్మనిచ్చింది

వెంకయ్యనాయుడు • బెంగళూరులో ఘనంగా సన్మానం

శివాజీనగర్ (బెంగళూరు): ఏపీలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తనకు రాజకీయ పునర్జన్మను ఇచ్చింది కర్ణాటకేనని ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. అందుకే ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తక్షణమే కర్ణాటకను జ్ఞాపకం చేసుకొని తొలి పర్యటనగా ఇక్కడకు వచ్చానని చెప్పారు. ఆదివారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో సుప్రీంకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎన్.వెంకటాచలయ్య ఆధ్వర్యంలో వెంకయ్యనాయుడును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకయ్య కన్నడలో మాట్లాడుతూ.. కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనకు జాతీయ రాజకీయాల్లో బీజేపీ నేతలు అటల్ బిహారి వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ అవకాశం కల్పించారన్నారు. మూడుసార్లు రాజ్యసభ సభ్యునిగా కర్ణాటక నుంచి అవకాశం దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ పీసీ మోహన్, కేంద్ర మంత్రి అనంతకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప, ఎం.ఆర్.దొరైస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా వెంకయ్యనాయుడు ఆదివారం కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చారు. ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు తదితరులు స్వాగతం పలికారు.

వెంకయ్యకు రజనీ శుభాకాంక్షలు



తమిళ సినిమా (చెన్నై): ఉపరాష్ట్రపతిగా ఘనవిజయం సాధించిన ఎం.వెంకయ్యనాయుడికి సినీనటుడు రజనీకాంత్ ఆదివారం ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. 'అత్యంత గౌరవప్రదమైన ఈ పదవికి మీరు అర్హులు. ఆ భగవంతుడి ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలని ఆశిస్తున్నాను' అని రజనీ ట్వీట్ చేశారు.

నేటితో ముగియనున్న మెడికల్ వెబ్ ఆప్షన్లు

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): రాష్ట్రంలో మెడికల్/బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి రెండో విడత వెబ్ ఆప్షన్లకు గడువు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ముగుస్తుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎస్.అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. మొదటి విడతలో సీట్లు పొందిన అభ్యర్థులు రెండో విడత వెబ్ ఆప్షన్లు పెట్టుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఏ కళాశాలలో సీటు కావాలో ముందుగా ఎంచుకొని దానికే ఆప్షన్ పెట్టుకోవాలన్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో సీటు అలాటైతే.. మొదట విడత పొందిన సీటు ఆటోమేటిక్‌గా రద్దవుతుందని చెప్పారు. గడవులోగా ఎన్నిసార్లైనా ఆప్షన్లు పెట్టుకోవచ్చని, చిట్టచివరిగా పెట్టుకున్న ఆప్షన్‌ను మాత్రమే సర్వర్ పరిగణనలోకి తీసుకుంటుందని వివరించారు.

11, 12 తేదీల్లో రెండో విడత కౌన్సెలింగ్

ఈ నెల 11, 12 తేదీల్లో ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల్లోని బీ–కేటగిరీ, సీ(ఎన్‌ఆర్‌ఐ) కేటగిరీ సీట్లకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ అప్పలనాయుడు తెలిపారు. బీ–కేటగిరీ సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్ సర్టిఫికెట్‌తో వస్తే సీ–కేటగిరీ సీట్ల కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తామని చెప్పారు.

సాహితీవేత్త పోతుకూచి కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ సాహితీ వేత్త రచయిత, న్యాయవాది, ప్రకృతి వైద్యుడు బహుముఖ ప్రజ్ఞాశాలి డా. పోతుకూచి సాంబశివరావు (92) ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కన్ను మూశారు. 1961లో రాష్ట్ర తెలుగు మహాసభలు, 1975లో ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహించి సాహితీ లోకంలో తనదైన ముద్రవేసుకున్నారు. పోతుకూచి అప్పట్లో రైతుల ఆత్మహత్యలపై ప్రదర్శించిన 'ఆత్మార్పణం' నాటకం లో రైతుగా నటించి గాంధీజీ ప్రశంసలందుకున్నారు. ఆయన రచించిన డిటెక్టివ్ నవల 'అన్వేషణ' సాహితీ లోకంలో ఓ సంచలనం.

వరద ప్రాంతాల్లో నిర్మాణాలొద్దు

- సహజ పట్టణాల రూపకర్త ప్రొఫెసర్ విక్రమ్ సోని
- అలాగైతే ఎన్నో అనర్థాలు తప్పవు
- ఇసుక తరలింపును నియంత్రించాలి

సాక్షి, అమరావతి బ్యూరో: ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువ వైపున ఉన్న సారవంతమైన కృష్ణా నది వరద ప్రాంతాలను నాశనం చేసి, తద్వారా లాభార్జనకు ప్రకృతితో పోటీ పడితే రాజధాని ఆర్థిక వ్యవస్థ నాశనం అవుతుందని సహజ పట్టణాల రూపకర్త ప్రొఫెసర్ విక్రమ్ సోని హెచ్చరించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా సారవంతమైన భూములు తీసుకోవడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. పాలకులు ప్రజల అవసరాలను తీర్చాలి కానీ, వారి పొట్టకొట్టే యత్నాలు చేయరాదని హితవు పలికారు. తక్షణమే నదిలో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. స్థానిక అవసరాలకు ఇసుకను వాడుకోవచ్చని, కానీ లాభార్జన కోసం ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించడం సబబు కాదన్నారు. ఇసుక తవ్వకాల వల్ల ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి నీరు సరిగా చేరదని, అందు వల్ల సముద్రం నీరు ముందుకు చొచ్చుకు వస్తుందన్నారు. దీని ప్రభావం వల్ల బ్యారేజీకి ఇరువైపులా భూముల్లో పైభాగంలో ఉప్పు నీరు ఉంటుందని, 100 మీటర్ల వరకు బోర్లు వేస్తే తప్ప మంచి నీరు లభించని పరిస్థితి ఉందన్నారు. నదీ వరద ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల వల్ల ఇటీవల కాలంలో అనేక అనర్థాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. చెన్నైలో అడయార్, కూవం నదులు.. ముంబయిలోని వితి నది ఒడ్డున పెద్ద ఎత్తున నిర్మాణాల వల్ల వరద నీరు ప్రవహించడానికి అవకాశం లేక ఇటీవల అపార నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు.



ప్రొఫెసర్ విక్రమ్ సోని

భూసేకరణలో అనేక తప్పిదాలు

చంద్రబాబు సర్కారు రాజధాని నిర్మాణం కోసం ఇక్కడి సారవంతమైన భూములు తీసుకోవడం వల్ల సుమారు 2 లక్షల మంది ఉపాధి కోల్పోనున్నారని ఏక్తా పరిషత్ చైర్మన్ పీవీ రాజగోపాల్ పేర్కొన్నారు. భూసేకరణ అంశంలో సర్కారు అనేక తప్పిదాలు చేసిందని, సామాజిక ప్రభావ అంచనా సర్వే నిర్వహించలేదని, గ్రామంలో 70 శాతం మంది ప్రజల అనుమతి తీసుకోలేదని, మూడు పంటలు పండే భూములను సైతం తీసుకుంటున్నారని తెలిపారు. రాజధాని కోసం ఇన్ని వేల ఎకరాలు ఎందుకు తీసుకున్నారో.. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపడుతున్నారో తెలుపుతూ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్రీయ స్వాభిమాన్ ఆందోళన్ కార్య నిర్వాహక కార్యదర్శి బసవరాజ్‌పాటిల్, జాతీయ మత్స్యకారుల సంఘం చైర్మన్ రేవు బాబురావు, పర్యావరణ నిపుణులు బొలిశెట్టి సత్య, రాజధాని ప్రాంత రైతు హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్ అనుమోలు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఇస్తున్న ప్రాధాన్యమే మొక్కలకూ ఇవ్వాలి

మొక్కలు నాటిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌కుమార్ కైత్

ఫిరంగిపురం (తాడికొండ): కుటుంబ సభ్యులకు ఇస్తున్న తరహాలోనే మొక్కలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌కుమార్ కైత్ చెప్పారు. మనం–వనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో హైకోర్టు ఏజీపీ తూము వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావి తరాలకు కూడా మనం స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి హరిహరనాధశర్మ, జిల్లాలోని వివిధ కోర్టులకు చెందిన న్యాయమూర్తులు, జేసీ–2 ఎం. వెంకటేశ్వరరావు, డీఎఫ్‌ఓ ఎల్.భీమయ్య, ఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జస్టిస్ సురేష్‌కుమార్ కైత్

బస్సు 'బేరం' కుదిరింది

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే పన్ను కట్టించుకుంటామని ఆయా జిల్లాల్లో రవాణాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

655 ప్రైవేట్ బస్సులు సీజ్

అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న ప్రైవేట్ బస్సులను నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల్లో తిప్పుతున్నారని అక్కడి ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజిస్ట్రేషన్లను ఈ ఏడాది జూన్ మొదటి వారంలో రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇతర రాష్ట్రాల్లో రిజిస్టరై ఏపీలో తిరుగుతున్న బస్సులను రాష్ట్ర ప్రభుత్వం సీజ్ చేసింది. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించిన 655 బస్సులను సీజ్ చేయడంతో ఆర్టీసీకి కొంత మేర ఆదాయం సమకూరింది. రాష్ట్రంలో దాదాపు 2 నెలలుగా 655కు పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిచిపోయాయి.

మంత్రికి ముట్టిన తొలి విడత ముడుపులు

రాష్ట్రంలో సీజ్ చేసిన 655 ప్రైవేట్ బస్సులు అధికార పార్టీకి చెందిన వారివేనని, దీనివల్ల వారు నెలకు రూ.80 కోట్లకు పైగా ఆదాయం కోల్పోతున్నారని కీలక మంత్రి ఒకరు 'ముఖ్య'నేత దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. 655 బస్సులకుగాను ప్రతి మూడు నెలలకోసారి క్వార్టర్లీ ట్యాక్స్ కింద రూ.9.50 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేవారని, ఆ బస్సులను సీజ్ చేయడంతో పన్నులు రాక ఖజానాకు నష్టం వాటిల్లుతోందని వివరించినట్లు తెలిసింది. సదరు కీలక మంత్రి ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియా తరపున వకాల్తా పుచ్చుకుని వ్యవహారం చక్కబెట్టినట్లు సమాచారం. ఆ మంత్రితో ముందుగానే బేరసారాలు కుదుర్చుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియా తర్వాత నేరుగా 'ముఖ్య'నేతను కలిసింది. ప్రభుత్వం సీజ్ చేసిన తమ బస్సులను రాష్ట్రంలో యథావిధిగా తిప్పుకునేందుకు అనుమతించాలని వేడుకోవడంతో సానుకూలంగా నిర్ణయం తీసుకుంటానని 'ముఖ్య'నేత అభయమిచ్చినట్లు సమాచారం. తొలి విడతగా మంత్రికి ట్రావెల్స్ మాఫియా భారీగా ముడుపులు చెల్లించినట్లు ప్రస్తుతం రవాణా శాఖలో జోరుగా ప్రచారం సాగుతోంది.

రవాణా శాఖపై ఒత్తిడి

కీలక మంత్రి రాయబారం సఫలం కావడం, ప్రభుత్వాధినేత హామీ ఇవ్వడంతో ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియా రవాణా శాఖపై ఒత్తిడి పెంచుతోంది. రాష్ట్రంలో తమ బస్సులను ఎప్పటిలాగే తిప్పుతామని తేల్చిచెబుతుండడం గమనార్హం. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల జోరు చూస్తుంటే ప్రభుత్వం నుంచి త్వరలోనే అన్ని అనుమతులు రానున్నాయని ప్రచారం జరుగుతోంది.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

గుడ్లవల్లేరు (గుడివాడ): అప్పుల బాధతో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో కాగిత మురళి (50) అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మురళికి సొంత భూమి లేదు. పది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వివిధ పంటలు సాగు చేసేవాడు. వర్షాభావం వల్ల ఆశించిన దిగుబడి రాలేదు. అరకొరగా చేతి కందిన పంటకూ ధరలు లేకపోవడం వల్ల రెండేళ్లుగా నష్టపోతూ వచ్చాడు. ఈ ఏడాది అప్పు చేసి వరి పంట సాగు చేశాడు. కౌలు రైతుగా రుణ అర్హత కార్డుకు కూడా నోచుకోక పోవడంతో బ్యాంకులు అప్పు ఇవ్వలేదు. దీంతో పంట పెట్టుబడి, ఇల్లు గడవడం కోసం బయటి వ్యక్తుల వద్ద రూ.3 వడ్డీతో రూ.5 లక్షలు అప్పు చేశాడు. రుణ దాతల నుంచి ఒత్తిడి పెరగడం, పంట ఆశాజనకంగా లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని సతమతమయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. బంధువులు చికిత్స నిమిత్తం గుడ్లవల్లేరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఊర్మిళ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులు తీర్చలేననే మనస్థాపంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి సోదరుడు కాగిత ఏడుకొండలు తెలిపారు. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు కనుమూరి రామిరెడ్డి, సర్పంచి జోగి వెంకటేశ్వరరావు పరామర్శించారు.



మృతుడు మురళి

ఇది ప్రజాస్వామ్యమా? నియంతృత్వమా?

- కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మండిపాటు
- మరోసారి పాదయాత్రకు బ్రేక్
- ప్రభుత్వ వైఖరిపై కాపు నేతల నిరసన

కిర్లంపూడి: మాజీ ఎంపీ, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం నిర్వహించ తలపెట్టిన పాదయాత్రకు పోలీసులు మరోసారి బ్రేక్ వేశారు. జేఏసీ, కాపు నాయకులతో కలసి ముద్రగడ ఆదివారం ఉదయం కిర్లంపూడిలోని తమ ఇంటి నుంచి పాదయాత్రకు బయలుదేరారు. వారు గేటు దాటిన వెంటనే పోలీసులు అడ్డుకుని పాదయాత్రకు అనుమతులు లేవని తెలిపారు. దీనిపై ముద్రగడ స్పందిస్తూ 'ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఉన్నామా? నియంతృత్వ పాలనలో ఉన్నామా?' అని పోలీసులను ప్రశ్నించారు. పాదయాత్రకు 2 నెలల ముందే సీఎంకు సమాచారం ఇచ్చామన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తుచేయడం కోసం శాంతియుతంగా గాంధేయ మార్గంలో పాదయాత్ర చేస్తానంటే పోలీసులను అడ్డుపెట్టుకుని పాదయాత్రను అడ్డుకోవడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ హోం శాఖ మంత్రి చినరాజప్ప పదవీకాంక్షతో జాతి మీద విమర్శలు చేస్తే కాపులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం ముద్రగడతో పాటు జేఏసీ, కాపు నాయకులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, నల్ల విష్ణు, ఆలేటి ప్రకాశ్‌తో పాటు తూ.గో. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నానాజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పాదయాత్రను అడ్డుకోవడంతో నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ముద్రగడ, కాపు నాయకులు.

ఇదం జగత్



... ఇటువైపు వచ్చావో నీ అంతు చూస్తాం! ఖబడ్దార్!!

పది అడుగుల 'బంధం'



అమలాపురం టౌన్: తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన దేవీశ్రీ టైలర్స్ యజమాని కొమానపల్లి శ్రీనివాసరావు రక్షా బంధన్‌ను పురస్కరించుకొని భారీ రాఖీని తయారుచేశారు. పది అడుగుల పొడవు, రెండున్నర అడుగుల వెడల్పుతో తయారుచేసిన ఈ రాఖీ కోసం మగ్గం వర్క్, మోడల్ బ్లౌజ్‌లకు వాడే మెటీరియల్‌ను వినియోగించారు. అలాగే శ్రీదేవి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ రాఖీపై అమ్మవారి చిత్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం స్థానిక శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ప్రదర్శనకు ఉంచనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

దుర్గమ్మ దేవాలయానికి ముప్పు!

- భారీ యంత్రాలతో కోనేరు తవ్వకం
- గుడిలోకి వస్తున్న ప్రకంపనలు
- అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం: ఈఈ భాస్కర్

సాక్షి, విజయవాడ: అభివృద్ధి పేరుతో ఇంద్రకీలాద్రిపై అధికారులు చేస్తున్న హడావుడి.. అమ్మవారి దేవాలయానికి, విగ్రహానికి ముప్పుగా మారింది. ఇప్పటికే ఇంద్రకీలాద్రిపై పలు నిర్మాణాలను అధికారులు తొలగించారు. అలాగే కొత్త నిర్మాణాల కోసం పర్వతాన్ని భారీ యంత్ర పరికరాలతో తవ్వుతున్నారు. కొత్త అందాలకు ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప ఎప్పుడో నిర్మించిన దేవాలయాల గురించి అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇంద్రకీలాద్రిపై కోనేరు ఉండేది. తరువాత దీన్ని మూసివేసి ఇక్కడే భవానీ మండపాన్ని నిర్మించారు. ఇప్పుడు మళ్లీ ఆ ప్రదేశంలోనే జలపాతం, కోనేరు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 21 మీటర్ల పొడవు, 8 మీటర్ల వెడల్పు, 1.5 మీటర్ల లోతులో కోనేరును నిర్మిస్తున్నారు. ఈ కోనేరులోకి నీరు పడే విధంగా జలపాతం ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం అమ్మవారి నిధులు రూ. 3 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కోనేరు తవ్వకానికి భారీ యంత్రాలు వాడుతుండటంతో కొండంతా ప్రకంపనలు వస్తున్నాయి. పొక్లెయినర్లు, డ్రిల్లింగ్ మిషన్లతో తవ్వినప్పుడు ఆలయంలోనే భారీగా ప్రకంపనలు వస్తున్నాయని, అమ్మవారి విగ్రహం కూడా అదిరే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.



దుర్గగుడిలో కోనేరు కోసం భారీ యంత్రంతో ఇంద్రకీలాద్రిని తవ్వుతున్న దృశ్యం

గతంలో ఘాట్‌రోడ్డు విస్తరణలో భాగంగా ఇంద్రకీలాద్రిని భారీ యంత్రాలతో పగలగొడుతున్నప్పుడు ఇలాంటి సమస్యే వచ్చింది. దీనిపై అర్చకులు, అధికారులు అభ్యంతరం తెలపడంతో తవ్వకాలను ఆపేశారు. ఇప్పుడు ఆలయానికి అత్యంత సమీపంలోనే కోనేరు, జలపాతం కోసం కొండను పగల గొడుతుంటే మాత్రం దేవస్థానం అధికారులు మాట్లాడటం లేదు. కేవలం అమ్మవారి దేవాలయానికే కాదు.. పక్కనే ఉన్న ఉపాలయాల భద్రతకు ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలాఉండగా దసరాలోగా కోనేరు, జల పాతాన్ని సిద్ధం చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

దేవాలయానికి ఇబ్బంది లేదు: ఈఈ భాస్కర్

కోనేరు కోసం భారీ యంత్రాలతో తవ్వడం వల్ల దేవాలయం భద్రతకు ఇబ్బంది ఉండబోదు. అన్ని జాగ్రత్తలు తీసుకునే కోనేరు నిర్మాణం చేపడుతున్నాం. కోనేరుతో భక్తులకు ఎంతో ఆహ్లాదం కలుగుతుంది. గ్రీనరీతో జలపాతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం.

శ్రీవారిని దర్శించుకున్న సీఎస్ దినేశ్‌కుమార్

సాక్షి, తిరుమల: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన ఆలయానికి వచ్చారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో సీఎస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు శ్రీవారి లడ్డూ, తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.



సీఎస్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ ఈవో

గిరిజన గూడేల్లో తాగునీటికి రూ. 105 కోట్లు

గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా పనులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన గూడేల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు గిరిజన సంక్షేమ శాఖ రూ.104.99 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా చేయించాలని నిర్ణయించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు తాగునీటి సౌకర్యం మెరుగుపరిచేందుకు ఈ నిధులు ఖర్చుచేస్తారు. 2017 ఏప్రిల్ నాటికి ఈ ఎనిమిది జిల్లాల్లో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న 4,726 గిరిజన గూడేలను అధికారులు గుర్తించారు. ప్రధానంగా విశాఖపట్నం జిల్లాలో 2,634 గూడేల్లో తాగునీటి సమస్య ఉంది. ఆ తరువాత స్థానంలో శ్రీకాకుళం జిల్లాలో 866, తూర్పుగోదావరి జిల్లాలో 513, విజయనగరం జిల్లాలో 416 గిరిజన గూడేల్లో సమస్య తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ తాగునీటి కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళుతున్నారు.

అల్పపీడనం కాదు ఆవర్తనమే

- జార్ఖండ్ వైపు మళ్లిపోయింది
- కోస్తాంధ్రలో అధికం కానున్న ఉక్కపోత

సాక్షి, విశాఖపట్నం: వర్షాలపై ఆశ కల్పించిన అల్పపీడనం చివరకు నిరాశనే మిగిల్చింది. వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తనం బలపడి ఆదివారం నాటికి అల్పపీడనంగా మారుతుందని కొద్దిరోజులుగా వాతావరణ శాఖ చెబుతూ వచ్చింది. అయితే అది అల్పపీడనం కాకుండా ఆవర్తనంగానే ఉండి పోయి మన రాష్ట్రానికి దూరంగా జార్ఖండ్ వైపు మళ్లింది. వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే దాని ప్రభావం ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలపైనే ఎక్కువగా ఉంటుంది. దీని ప్రభావం ఒకింత కోస్తాంధ్రపై కూడా ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆ ఆశలు కూడా అడుగంటి పోయాయి. రాష్ట్రంలో వర్షాలు కురిపించే పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడానికి మరికొన్నాళ్ల సమయం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఆగస్టు 15 వరకైనా వేచి ఉండాల్సి ఉంటుందని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ ఆదివారం 'సాక్షి'కి చెప్పారు. అప్పటివరకు అడపాదడపా వానలు కురిసినా క్యుములో నింబస్ మేఘాలు, ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కొనసాగుతున్న అల్పపీడనద్రోణి వల్లేనని స్పష్టం చేశారు. మరోవైపు ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

కొనసాగనున్న ఉక్కపోత: కోస్తాంధ్రలో ఉక్కపోత రోజు రోజుకూ అధికమవుతోంది. గాలిలో తేమ అధికంగా ఉండడం, పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం ఇందుకు కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి కొన్నాళ్లపాటు ఉంటుందని తెలిపారు.

సమ్మెకు సిద్ధమైన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

- 16న సమ్మె నోటీసు ఇవ్వడానికి నిర్ణయం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం

సాక్షి, అమరావతి: సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేయాలని నిర్ణయించారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 16న ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వాలని నిర్ణయించారు. తెలంగాణలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ సర్వీసుల్లో విలీనం చేశారని, పంజాబ్, ఢిల్లీ ప్రభుత్వాలు సైతం అదే పని చేశాయని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు ససేమిరా అంటోందని వక్తలు ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులందర్నీ క్రమబద్ధీకరిస్తామని టీడీపీ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. మూడేళ్ల కాలయాపన అనంతరం కోర్టు తీర్పులు అడ్డంకులుగా ఉన్నాయని ప్రభుత్వం పేర్కొనడాన్ని సమావేశం నిరసించింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు గత అక్టోబర్‌లో తీర్పు ఇచ్చినప్పటికీ విద్యుత్ బోర్డు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎం.బాలకాశి, కెవిఎన్వీ సీతారాం, సుబ్బిరెడ్డి, ఎం.శ్రీనివాస్, ఏసోబు, దుగ్గిరాల సూరిబాబు, ఏవీ నాగేశ్వరరావు, కాశీ మధుబాబు, వాసు, సాంబిరెడ్డి, బీవీ సురేష్, శివారెడ్డి పాల్గొన్నారు.

కర్నూలులో నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్

ముఠా నాయకుడిగా ప్రధానోపాధ్యాయుడు

కర్నూలు: కర్నూలు జిల్లా పోలీసులు ఆదివారం నకిలీ సర్టిఫికెట్ల ముఠాను అరెస్ట్ చేశారు. ఈ ముఠా నాయకుడిగా ఓ ప్రధానోపాధ్యాయుడు వ్యవహరించడం కలకలం రేపింది. జిల్లా ఎస్పీ గోపీనాథ్‌జెట్టి తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మండలం పర్వతాపురం మున్సిపల్ పాఠశాల హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న ఎన్. శ్రీనివాసులు తన అనుచరుడు, కంప్యూటర్ ఆపరేటరైన ఆంజనేయులుతో కలసి వివిధ పాఠశాలల స్టడీ సర్టిఫికెట్లు, టీసీలు, మార్కుల జాబితాలు, యూనివర్సిటీల మార్క్స్ మెమోలు తయారు చేసేవారు. జిల్లావ్యాప్తంగా 20 మంది కమీషన్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని నకిలీ సర్టిఫికెట్లు విక్రయించి సొమ్ము చేసుకునే వారు. ఈ నేపథ్యంలో తన భార్యకు రావాల్సిన ఉద్యోగాన్ని నకిలీ సర్టిఫికెట్‌తో మరొకరు పొందారంటూ కౌతాళానికి చెందిన వాల్మీకి రామన్న అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టయింది. ముఠా నాయకుడు శ్రీనివాసులుతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న ఏజెంట్లను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న నకిలీ రబ్బర్ స్టాంపులు, సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో కేడీసీసీ (కర్నూలు జిల్లా సహకార కేంద్ర) బ్యాంకు, మణప్పురం గోల్డ్ సంస్థలను మోసం చేసిన కేసుల్లోనూ శ్రీనివాసులు ముద్దాయిగా ఉండి జైలు శిక్ష అనుభవించారు. రెండుసార్లు ఉద్యోగం నుంచి కూడా సస్పెండ్ అయ్యారు.

రిజర్వేషన్లకు అర్హతలు మినహా ఆప్షన్లు లేవు

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి: సాంఘిక వెనుకబాటుతనం అర్హత లేని.. కాపులు లేదా మరెవరినైనా బీసీల్లో చేర్చటం రాజ్యాంగవిరుద్ధమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. కాపుల శక్తిని, బలాన్ని చూసి ఓట్ల కోసమే బీసీల్లో చేరుస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. రాజకీయ స్వార్థం కోసం హామీనివ్వటం, అందుకోసం ఏ చర్యకైనా పాల్పడటాన్ని బీసీలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించరన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం శంకరరావు విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్లకు ఆప్షన్లు, బేరసారాలు ఉండవన్నారు. తమకు రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదని, కేవలం విద్య, ఉద్యోగ రంగాల్లో మాత్రమే కోరుకుంటున్నట్టు అధికార పార్టీ నేతల ప్రచారం, బీసీలను తప్పుదోవ పట్టించటానికేనని అభిప్రాయపడ్డారు. సాంఘిక వెనుకబాటుతనం అర్హత ఉందా? లేదా? అనే అంశాన్ని పక్కనబెట్టి, బేరసారాల పద్ధతిలో మభ్యపెట్టటాన్ని కుట్రపూరిత వైఖరిగానే బీసీలు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ నేతలు జొన్నాదుల వెంకటేశ్వరరావు, మేడిబోయిన గంగాయాదవ్, కుర్రా శ్రీను, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, సుధాకర్, పాములు తదితరులు పాల్గొన్నారు.

వంశధార నిర్వాసిత గ్రామాల్లో

భారీగా పోలీసుల మోహరింపు

- గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నం
- పూర్తి నష్ట పరిహారం ఇచ్చే వరకు ఖాళీ చేయబోమన్న గ్రామస్తులు

హిరమండలం: శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని వంశధార నిర్వాసిత గ్రామాల్లో భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. ఈ గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఆదివారం ఆయా గ్రామాల్లో పోలీసులను దింపింది. దాదాపు వెయ్యి మంది పోలీసులు హిరమండలం చేరుకుని అక్కడి నుంచి గ్రామాలకు వెళ్లారు. గ్రామస్తులను కదలనీయకుండా బందోబస్తు పెట్టడంతో వారు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. తమకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించకుండా, పునరావాసం కల్పించకుండా గ్రామాలను ఖాళీ చేయబోమని నిర్వాసిత గ్రామాల ప్రజలు తెగేసి చెబుతున్నారు. చర్చల కోసం ఓ వైపు పిలుస్తూనే మరోవైపు బలప్రయోగంపై నిర్వాసిత గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఎస్పీ త్రివిక్రమవర్మ హిరమండలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని నిర్వాసిత గ్రామాల్లో పరిస్థితిని అంచనా వేశారు. అధికారులకు సూచనలిచ్చారు.



పోలీసుల పహారాలో నిర్వాసిత గ్రామాలు

రెండో రోజు కొనసాగిన బీసీ సంఘాల ధర్నా

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఆదివారం రెండో రోజుకూడా కొనసాగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టిన నాలుగు రోజుల ధర్నాకు తెలుగు రాష్ట్రాల సంఘాలతోపాటు రాజస్థాన్, యూపీ, హరియాణ రాష్ట్ర సంఘాలు కూడా మద్దతు పలికాయి. వేల సంఖ్యలో నేతలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలకు ఉద్యోగాలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని 12 లక్షల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో కేంద్రం బిల్లు పెట్టేంత వరకు తమ పోరాటాన్ని విరమించబోమని కృష్ణయ్య స్పష్టం చేశారు. కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం నేతలు గుజ్జ కృష్ణ, చంద్రశేఖర్‌యాదవ్, ఎ.వరప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.



ఢిల్లీలో బీసీ సంఘాల ధర్నా

నైపుణ్యం గల కాంట్రాక్టర్లు అవసరం

విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు

విశాఖసిటీ: విద్యుత్ శాఖలో భద్రతకు పెద్దపీట వేస్తున్నందున అర్హత, నైపుణ్యం గల కాంట్రాక్టర్లు ఎంతో అవసరమని విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు అన్నారు. విశాఖలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఏ-క్లాస్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆవిర్భావ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

పన్నీర్ సెల్వంపై హత్యాయత్నం!

తిరుచ్చి విమానాశ్రయంలో కత్తితో దూసుకొచ్చిన వ్యక్తి

సాక్షి, చెన్నై: తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం వద్దకు కత్తితో ఓ వ్యక్తి రావడం తమిళనాడులో కలకలం రేపింది. ఆ వ్యక్తిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అన్నాడీఎంకే పురచ్చి తలైవి శిబిరం నేత, మాజీ సీఎం పన్నీర్ సెల్వం మద్దతు కూడగట్టుకునే దిశగా రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఆయన తిరుచ్చి విమానాశ్రయం నుంచి బయటకు రాగానే, తిరుచ్చి టీవీఎస్ గేట్ విల్వనగర్‌కు చెందిన చోళరాజన్(45) పన్నీర్‌తో ఫోటో దిగాలని ముందుకు దూసుకొచ్చాడు. అతడిని విమానాశ్రయం సీఐఎస్ఎఫ్ వర్గాలు అడ్డుకునే ప్రయత్నం చేసినా తప్పించుకుని ముందుకెళ్లడానికి ప్రయత్నించాడు. తోపులాటలతో అతడి పంచె ఊడి నడుం భాగంలో ఉన్న కత్తి బయటపడింది. ఇది గమనించిన పన్నీర్ అభిమానులు దాడి చేయడానికి వచ్చాడని భావించి చోళరాజన్‌ను పట్టుకుని చితక్కొట్టారు. తమ నేతను హతమార్చే కుట్రేనని పన్నీర్ అభిమానులు ఆరోపిస్తున్నారు. పన్నీర్‌కు భద్రత పెంచాలని అభిమానులు, పురచ్చితలైవి వర్గాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

చంద్రబాబుది రక్తచరిత్ర

- వైఎస్ జగన్ మాటలను వక్రీకరించారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాకాణి

నెల్లూరు(సెంట్రల్): మేకతోలు కప్పుకున్న తోడేలు లాంటి చంద్రబాబు పాలన మొత్తం రక్తచరిత్రలా మారిందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరాచక పాలన, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం తదితర విషయాలపై తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ నంద్యాల సభలో మాట్లాడారని చెప్పారు. ఎవరైనా సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే 'ఈ మనిషిని ఏం చేసినా పాపం లేదు..' అనడం సహజమన్నారు. నంద్యాల సభ విజయవంతం కావడంతో దిక్కుతోచని టీడీపీ నాయకులు.. చివరకు జగన్ వ్యాఖ్యలను వక్రీకరించారని మండిపడ్డారు. టీడీపీ నేతల దివాలాకోరు రాజకీయాలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.



నీచ రాజకీయం ఎవరిదో ప్రజలకు తెలుసు..

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాతే శిల్పా చక్రపాణిరెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి చేర్చుకున్న విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్న చంద్రబాబు తీరు చూస్తుంటే నీతివంతమైన రాజకీయం ఎవరిదో.. నీచ రాజకీయం ఎవరిదో ప్రజలకు అర్థమవుతోందన్నారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే టీడీపీ నేతలు.. ముందు ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు.

డబ్బు పెట్టేవారుంటే సినిమా తీస్తా

ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి విశ్వనాథ్


నెల్లూరు(బృందావనం): తల్లిదండ్రులు, గురువులపై ఉన్న భయభక్తులు, వృత్తిపై ఉన్న అంకితభావమే తన ఎదుగుదలకు కారణమని ప్రముఖ దర్శకుడు, కళా తపస్వి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత కె.విశ్వనాథ్ చెప్పారు. ఆదివారం నెల్లూరులో జరిగిన ఓ అభినందన సభలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డబ్బు పెట్టేవారుంటే ఇప్పుడైనా సినిమా తీస్తానని చెప్పారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ అలజడిపై తానేమీ మాట్లాడబోనని చెప్పారు. 'నా మనుమడే నా మాట వినడు. ఇక నేనేంటయ్యా యువతకు సందేశమిచ్చేదం'టూ విశ్వనాథ్ ఓ విలేకరి ప్రశ్నకు చమత్కరించారు. సినీ రంగంలో తనకు వారసులు గానీ శిష్యులు గానీ లేరని చెప్పారు. తనకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిన విషయాన్ని మొదటగా ఫోన్ చేసి చెప్పిన వ్యక్తి వెంకయ్యనాయుడని.. అలాంటిది ఆయనకు సోమవారం నెల్లూరులో జరిగే సన్మానానికి తాను రాలేకపోవడం బాధగా ఉందన్నారు.

టీడీపీతో పొత్తు వద్దు

భారతీయ జనతా మజ్దూర్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వీరబాబు



రాయవరం (మండపేట): టీడీపీతో పొత్తు వద్దని తమ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి నివేదించనున్నట్టు భారతీయ జనతా మజ్దూర్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆకుల వీరబాబు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం లొల్ల గ్రామంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల బీజేపీ నష్టపోయిందన్నారు. టీడీపీతో పొత్తు వల్ల పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొందని చెప్పారు. టీడీపీ మిత్రధర్మాన్ని పాటించడం లేదని, నామినేటెడ్ పదవులను వారి కార్యకర్తలతోనే నింపుకుంటోందని విమర్శించారు. అంతేకాకుండా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను హైజాక్ చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, బీజేపీ నేతలు చాట్రాతి జానకి రాంబాబు పాల్గొన్నారు.




• పుస్తక పరిచయం

నానీ కెరటాలు

అరకు కాఫీకి
అంతర్జాతీయ ఖ్యాతి
అరకు సవరలకు
అంటువ్యాధులే గతి

ఇంతకుముందు 'సహృదయ సాంగత్యం' పుస్తకం వెలువరించిన హర్షవర్ధన్ నెల రోజుల్లో రాసిన తొంభై నానీలున్నాయిందులో. వీటి జననం విశాఖపట్నంలో జరిగింది కనుక నానీల కెరటాలు అని నామకరణం చేశారు.



పార్కు దగ్గర
పూలదుకాణం
కొననివారికి
పరిమళం ఉచితం

కొనకపోయినా తరచూ అత్తరు దుకాణానికి వెళ్లాలనీ, అలాగైనా కొంత పరిమళం మనకు అంటుతుందనీ పెద్దలు చెప్పిన మాట తన విషయంలో నిజమైందంటారు హర్షవర్ధన్. కేవలం సజ్జన సాంగత్యం వల్లే తాను ఈ నానీలు రాయగలిగానంటారు.

రచన: హర్షవర్ధన్; పేజీలు: 64; వెల: 50; ప్రతులకు: కవి, 203, చాముండేశ్వరి అపార్ట్‌మెంట్స్, సుందర్ నగర్, ప్లాట్ 24, హైదరాబాద్–38. ఫోన్: 9949992880

• వ్యాసం

కవిత్వమే మతం అయిన సందర్భం

కవిత్వం, తత్వం అయి మతం అయింది చైనా కవి లావ్ ట్సూ (LAO-TZU) కర్తృత్వంలో. ఆయన రాసిన 81 కవితలు టాఔ ఇజం అన్న మతానికి ప్రాతిపదిక అయినాయి. ప్రపంచంలో ఇలాంటి ఘటన ఇదే! మతం నుంచి కవిత్వం రావడం, మతం కోసం కవితా రచన జరగడం ఉన్నదే. కానీ కవిత్వం మతంగా పరిణమించడం ఒక్క లావ్ ట్సూ ద్వారానే జరిగింది. ఒక్క టాఔ ఇజం విషయంలోనే జరిగింది. ఆశ్చర్యకరమైన పరిణామం ఇది!

ప్రపంచంలోని మహోన్నతమైన కవులలో చైనా దేశపు కవి లావ్ ట్సూ ఒకరు. లావ్ ట్సూ జననం, జీవితం, మరణంలపై సరైన వివరాలు లేవు. ఆయన క్రీ.పూ. 6వ శతాబ్ది వారని విశ్వసిస్తున్నారు. అందులోనూ సందిగ్ధతే. క్రీ.పూ. 604–517 కాలం వారనీ, క్రీ.పూ. 551–479 కాలం వారనీ వేరు వేరు వాదనలు ఉన్నాయి. చైనాలో చౌ అనే ప్రదేశంలో ఒక రాజాస్థానంలో పురాతన దస్తావేజుల సంరక్షకులుగా ఆయన పనిచేసేవారనీ, ఒక దశలో అక్కడి పరిస్థితులు నచ్చక ఊరు వదిలి వెళ్లిపోతూండగా ఊరి పొలిమేరలో కాపలాదారులు పట్టుకున్నారనీ, ఆ పట్టుకున్న కాపలాదారులలో ఒకతనికి ఆయన తన జ్ఞానాన్ని కొన్ని కవితలలో చెప్పారనీ, అందుకు బదులుగా ఆ కాపలాదారు ఆయన్ను వదిలేశాడనీ, ఆయన ఎద్దునెక్కి ఎటో వెళ్లిపోయారనీ కథనం. లావ్ ట్సూ ఎద్దుపై కూర్చుని ఉన్న చిత్రం ప్రచారంలో ఉంది. ఆయన పొలిమేర దాటుతూండగా పట్టుకున్న కాపలాదారులలో ఒకతను ఆయన స్నేహితుడనీ, అతని పేరు యిన్–హ్సి అనీ, ఆ 81 కవితలూ అతని కోసం రాసిచ్చారనీ మరో కథనం.

లావ్ ట్సూ రాసిచ్చిన 81 కవితలు 'టాఔ– టీ – చింగ్' అయినాయి. అదే 'టాఔ ఇజం' అన్న మతానికి అధారం అయింది. ఆ 81 కవితలలోని భాషా సంక్షిప్తత, కవిత్వం తరువాతి కాలంలో ప్రపంచ సాహిత్యంలో ఒక సంచలనాన్ని సృష్టించాయి. టాఔ– టీ – చింగ్ ను 'డాఔ–డీ జింగ్' అని కూడా అంటారు. ఈ టాఔ– టీ – చింగ్‌కు చెప్పబడిన అర్థాలలో కూడా తేడాలు కనిపిస్తున్నాయి. 'మార్గం దాని శక్తి' అనే అర్థం కొంత కాలం వాడుకలో ఉండేది. కానీ 'తత్వం దాని ఆచరణపై గ్రంథం' అనే అర్థం తరువాతి కాలంలో వ్యాప్తిలోకి వచ్చింది. అసలు లావ్ ట్సూ అంటే 'సిద్ధ గురువు' (old master) అని అర్థమట. ఆ పేరుగల వ్యక్తే లేడన్న వాదన కూడా ఉంది.

టాఔ– టీ – చింగ్ కు రకరకాలైన అర్థాలు, భాష్యాలు పుట్టుకొచ్చాయి. వాటిల్లో వంగ్ పి, హౌ షంగ్ కుంగ్, హన్ షన్–టీ–చింగ్ ప్రభృతుల భాష్యాలు ముఖ్యమైనవి. ఆ 81 కవితల టాఔ– టీ – చింగ్ ఒక పవిత్ర గ్రంథంగా పరిణమించింది. ఇది 2 పుస్తకాలుగా ఉంది. పుస్తకం 1, పుస్తకం 2 అని. ఆ 81 కవితలనూ 81 అధ్యాయాలుగా చూపించారు. వాటిని ఇంగ్లిష్‌లో కొందరు వచనంగా, కొందరు కవితలుగా అనువదించారు.



మతం నుంచి కవిత్వం రావడం, మతం కోసం కవితా రచన జరగడం ఉన్నదే. కానీ కవిత్వం మతంగా పరిణమించడం ఒక్క లావ్ ట్సూ ద్వారానే జరిగింది. ఒక్క టాఔ ఇజం విషయంలోనే జరిగింది.

తత్వాన్ని (టాఔ) ప్రకటించే విధానం శాశ్వతమైనది కాదు
దానికి ఇవ్వబడిన పేరూ శాశ్వతమైనది కాదు
కోరికల నుంచి స్వేచ్ఛను పొందు, మర్మం విడిపోతుంది
కోరికలలో చిక్కుకుపోతే వ్యక్తీకరణ మాత్రమే కనిపిస్తుంది

లావ్ ట్సూ 'టాఔ' అంటూ చెబుతున్నది మనం 'సర్వాంతర్యామి' అనే పదానికి పర్యాయపదంగా కనిపిస్తోంది. ఓ కవితలో –

'టాఔ అనంతం, శాశ్వతం
ఎందుకది శాశ్వతం?
అది పుట్టలేదు కనుక
అది మరణించదు–
అది ఎందుకు అనంతం?
దానికి కోరికలు లేవు
అది అందరి కోసమూ ఉన్నది' – అని చెబుతారు లావ్ ట్సూ.

ఉపమాలంకారాన్ని చాలా చక్కగా వాడతారు లావ్ ట్సూ. ఓ కవితలో మంచితనాన్ని నీటితో పోలుస్తారు. 'ఇతరులతో నిన్ను పోల్చుకోకు, ఇతరులతో పోటీ పడకు, అందరూ నిన్ను గౌరవిస్తారు' అని సగటు మనిషికి సందేశమిస్తారు. భగవద్గీతలో కనిపించే నిష్కామ కర్మ ప్రస్తావన టాఔ– టీ – చింగ్ లోనూ కనిపిస్తోంది. 'ఎదురు చూపుతో సంబంధం లేకుండా పని చెయ్యడం మహోన్నతమైనది' అనీ, 'నీ పని చెయ్యి, ఆపై వదిలెయ్యి' అనీ చెబుతారు లావ్ ట్సూ. ఒక భావాన్ని ఎంత గొప్పగా చెప్పొచ్చో, ఎలా కవిత్వంగా మలచొచ్చో ఈ పంక్తుల ద్వారా తెలుసుకోవచ్చు.

'బంకమట్టితో మనం కుండను చేస్తాం
దాని లోపల ఖాళీగానే ఉంటుంది
ఆ ఖాళీనే మనకు కావలసిన నీళ్లను మోస్తుంది'

ఓ కవితలో 'ఓటమి ఎంత అపాయకరమైనదో– విజయమూ అంత అపాయకరమైనదే' అంటారు లావ్ ట్సూ.

'భగవంతుడు(టాఔ) గొప్పవాడు
విశ్వం గొప్పది
భూమి గొప్పది
మనిషి గొప్పవాడు'– అంటారు మరో కవితలో.

'నిజమైన పూర్ణత్వం ఏమీ లేనట్లుగానే ఉంటుంది
అయినా అందులో సంపూర్ణమైన ఉనికి ఉంటుంది'– అన్న లావ్ ట్సూ వాక్యాలు

'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణామాదాయ పూర్ణమేవావశిష్యతే' శ్లోకాన్ని గుర్తుచేస్తాయి.

'నీ తలుపు తెరవకుండా
నీ హృదయాన్ని ప్రపంచం కోసం తెరవగలవు
నీ కిటికీ వైపు చూడకుండా
బ్రహ్మ తత్వాన్ని నువ్వు చూడగలవు' అని ఒక కవితలో అంటారు.

'నీ స్వీయ కాంతిని ఉపయోగించు
ఆపై కాంతి యొక్క మూలాన్ని చేరుకో' అంటారు మరోచోట. ఇక్కడ 'స్వీయ కాంతి' అనడం ఆది శంకరాచార్యులు 'స్వస్య యుక్త్యాః' అంటే 'నీ యుక్తి చేత' అనడాన్ని తలపిస్తోంది. వేమన పద్యాల్లాగా వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడేవి కొన్ని లావ్ ట్సూ కవితల్లో ఉన్నాయి.

'చిన్న చిన్న చర్యలతో గొప్ప పనులను పూర్తిచెయ్యి', 'ఓటమి ఓ అవకాశం', 'కష్టాలతో తలపడు', 'నువ్వు ప్రజల్ని పాలించాలంటే నువ్వు వాళ్లకన్నా కింద ఉండాలి, నువ్వు ప్రజలకు నాయకత్వం వహించాలంటే నువ్వు వాళ్లను అనుసరించడం నేర్చుకోవాలి'– వంటివి. వ్యక్తిత్వ వికాసానికి లావ్ ట్సూ కవితలు తోడ్పడతాయి అనే కోణంలో కూడా ఆయన కవితలకు భాష్యం చెబుతూ ఇంగ్లిష్‌లో పుస్తకాలొచ్చాయి. మతం గురించి లావ్‌ట్సూ–

'నేను మతాన్ని వెళ్లిపోనిస్తాను
ఆపై ప్రజలు నిర్మలమౌతారు' అంటారు.

ఒక చోట 'నిజమైన మాటలు విపరీతార్థాలుగా అనిపిస్తాయి. నిజమైన మాటలు వాగ్ధాటితో ఉండవు. వాగ్ధాటితో ఉండేవి నిజమైన మాటలు కావు' అంటారు.

❖ **రోచిష్మాన్**
09444012279

• కవిత



మరో వాక్యం

ఈ దారి కదలకుండా పడున్న
ఒక వాక్యంలా అచేతనంగా ఉంటుంది

వేకువనే
దారి పొడవునా పిచ్చుక గింజలకోసం వెతికినట్టు
ఈ వాక్యంలో పదాలను వెతుకుతుంటాను

సమస్తం ఈ చోటే కదులుతున్నపుడు
పిచ్చుకలా సుతారంగా వొంగి వేళ్ళతో
కరుచుకుంటాను
నడుస్తూ నడుస్తూ ఈ దారి ఆగిపోతే
పదాల్ని రెండుచేతుల్లో మూసి
మంత్రంలా కదిపి వాక్యాన్ని తీస్తాను
అరచేతిలో వుంచి సూచికలా తిప్పగానే
వాక్యం ఇంకొకదారిలా పరుచుకుంటుంది

దారిని కాళ్లకు, వాక్యాన్ని చేతులకు ఆయుధాన్ని
చేయడానికి
ఈచోట నిలబడి లోకాన్ని చూస్తూ
మరోవాక్యం ఉనికి కోసం నన్ను నేనే
వలయాకారంలో
వెంటాడుతుంటాను

వాక్యం పుట్టడానికి దారి కావాల్సినపుడు
దారి గుండా నడవడానికి వాక్యం కావాల్సినపుడు
వానలాంటి సంపూర్ణ తడిదనాన్ని లోకంపై
అద్దుతాను
ఇదిగో ఈ వాక్యం
దారిని మింగేసే నదిలా మారుతోంది చూశావా !

❖ **సత్యగోపి**
8500845710

• కవిత



వాన

పైనుంచి కురుస్తున్న ధార
దారులు వేసుకుంటూ –
తోట చివర డొంకల్లో నుంచి
బొడ్డమూడి చెట్లనీ,
బూరుగు చెట్ల మొదళ్ళనీ
చుట్టుకుంటూ, నీరుకట్ల పాముల్ని వెంటేసుకొని
నల్లటి దుక్కుబెడ్డ మీద పాకుతున్న
వానపాముల్ని చుట్టబెట్టుకుని
గట్టు మీద మెత్తని గడ్డిమొక్కల చివర్లని తాకుతూ,
బోదురుకప్ప బెకబెకలకి భయపడకుండా
నురగలు కక్కుతూ, మెలికలు తిరుగుతూ
ఇంటిముందు చూరు కింద నిలబడి
కాఫీ రంగు పులుముకొని
కాగితపు పడవల్ని ముంచుతూ
కింద రాలిన ఎర్ర మందారాల్లో మునుగుతూ
పిల్లకాల్వ లాగ పంట కాలవలో చేరి
తూర ముందు
చేదు పరిగల కోసం కట్టిన
ఎదురు నాముల్లో దూకి
తూర దాటాక
బొచ్చు పరిగెల కోసం వేస్తున్న
వలల్ని దాటుకొని
సాగిపోతోంది
ప్రయాణం తన భాషైనట్టు
నా కన్నుల్లో చిక్కుకున్న వాన
నల్లగాలిని చుట్టుకున్న తెల్లని చినుకుల వాన .

❖ **నాగేంద్ర కాశి**
8790198928

• పఠనానుభవం

స్త్రీలు నిరంతరం ఊరే శ్రీకృష్ణ చెలమ

నరేష్ నున్నా సన్నాసేం కాదు.. పొద్దస్తమానం గొప్ప ఔన్నత్యంతో స్త్రీ ఆలోచన లేకుండా గడిపేసి, పొద్దు పోయాక కాళ్లొక దగ్గర ముడుచుకుని పడుకోడానికి. అతడికెప్పుడూ పక్కన ఒక స్త్రీ దేహం ఉండాలి. దీపం లాంటి దేహం. అదీ తన నీడలు, జాడలు ఆమెలో వెతుక్కోవడం కోసం. 'స్త్రీకి కూడా శరీరం ఉంటుంది. దానికి వ్యాయామం కావాలి. స్త్రీకి కూడా మెదడు ఉంటుంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. స్త్రీకి కూడా హృదయం ఉంటుంది. దానికి అనుభవం ఇవ్వాలి' అని అస్సలు అనుకోడు. స్త్రీ నుంచి తనే వ్యాయామాన్ని, జ్ఞానాన్ని, అనుభవాన్ని పొందుతాడు! చిత్రం చూడండీ.. ఇన్ని పొందుతాడు కదా స్త్రీ నుంచి, ఇతనేమో చిక్కిపోతూ ఉంటే, ఆ స్త్రీ ఏమో ఈయన పుస్తకాల్లో పొద్దు పొద్దుకి మెరుపెక్కిపోతూ ఉంటుంది. ఒక స్త్రీ కాదు, ఇద్దరు స్త్రీలు కాదు. రెండొందలూ, రెండు వేలూ కాదు. నరేష్ హృదయం.. స్త్రీలు నిరంతరం ఊరే శ్రీకృష్ణ చెలమ. లక్కీ బాస్టర్డ్ అనుకుంటే మీ కర్మ. అతడేం సుఖపడటం లేదు. ఐ కెన్ సే. సుఖపడడం లేదు. I know her through the ages అనుకుంటూ కనిపించిన ప్రతి పిల్లను అలా నోరు తెరుచుకుని చూసేవాడికి సుఖం ఎక్కడ ఉంటుంది? నరేష్‌కి స్త్రీ యావ తప్ప, స్త్రీ మీద యావ లేదు. (నువ్వేలా చెప్తావ్? చూడట్లేదేంటీ.. ఇరవై ఏళ్లుగా).

నరేష్ దగ్గర జ్ఞానం ఉంది. భావం ఉంది. అదంతా చెత్త. తడి చెత్తో, పొడి చెత్తో తెలియని చెత్త. మరి ఈ పుస్తకాలేంటీ! 'తేరా నామ్ ఏక్ సహారా', 'అపరిచితం', అప్పటివేవో 'మిణుగురులు', ఇప్పుడు ఈ 'ఆమె'!



ఆమె (మ్యూజింగ్స్); రచన: నరేష్ నున్నా; పేజీలు: 158; వెల: 120; ప్రచురణ: చినుకు పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ. ఫోన్: 9848132208

ఇవన్నీ ఏంటి? ఏంటా?! చెత్తకు బతుకును పేర్చి స్త్రీ అనే మంటలో కాల్చి బూడిద చేస్తే పుట్టిన బ్రేక్–అప్ లెటర్స్. లైక్.. డియర్ జాన్ లెటర్స్!

నరేష్ ఫ్రాజైల్. స్త్రీనే అక్కర్లేదు, స్త్రీ నీడ కూడా అతడిని చిత్తుగా తడిపేస్తుంది. అంత ఫ్రాజైల్. తడిచిన ప్రతిసారీ, తడిచిన వెంటనే.. వణుకుతూ.. భార్యకు 'డియర్ ఉషా..' అంటూ ఓ పెద్ద బ్రేక్–అప్ లెటర్ రాసేస్తాడు.. 'ఆమెతో వెళ్లిపోతున్నాను. నా కోసం చూడకు' అని! అయితే ఆ బ్రేక్–అప్ లెటర్ 'డియర్ ఉషా' అని స్టార్ట్ అవదు. అందులో అసలు 'ఉష' ఉండనే ఉండరు. ఆమె తప్ప ఈ భూమ్మీది అందరు స్త్రీలూ ఉంటారు. ఓ సుమధ్యా.. ఓ చక్రజఘనా.. ఓ విశాఖా.. అంటూ ఆ కనబడిన వాళ్ల వెంటబడి పోతుంటాడు.. దారి పొడవునా వాళ్లపై కీర్తనలు రాసి, పాడుకుంటూ! ఒక్కో కీర్తనా ఉషగారికి ఒక్కో బ్రేకప్ లెటర్! ఆఖర్న కన్ఫెషన్‌తో 'కడగనివ్వు చెలీ! నీ క్షమాపాదాలు' అని ఆమె కాళ్ల మీద పడిపోయిన నరేష్‌ను చూసి మన మనసులు కొంత శాంతిస్తాయి. మళ్లీ సడెన్‌గా.. ఓ సుమధ్యా.. ఓ విశాఖా అని నరేష్ లేచి లంఘించుకోడని కాదు. అతడంతే! తనో గొప్ప 'ఉమనైజర్'అని లోకం చేత అనిపించుకోవాలని ఆరాటపడుతున్నట్లుగా పరుగులు తీస్తుంటాడు. నిజానికతడు 'ఉష'నైజర్. ఆ సంగతి ఈ పుస్తకంలోని ప్రతి పేజీలో ఏదో ఒక మూల దీపంలా వెలుగుతూ కనిపిస్తుంది.

❖ **మాధవ్ శింగరాజు**

• చదువరుల శీర్షిక

నాకు నచ్చిన 5 పుస్తకాలు



డాక్టర్ భార్గవి

హకల్‌బెరీ ఫిన్:

మార్క్ ట్వేన్ 'టామ్ సాయర్', 'హకల్‌బెరీ ఫిన్, 'విచిత్ర వ్యక్తి' నవలలను తెలుగులోకి అనువదించినవారు నండూరి రామ్మోహనరావు. ఆయన ఆ పని యెంత ప్రతిభావంతంగా చేశారంటే అనువాదం చదువుతున్నట్టుండదు, ఒరిజినల్ ఎలావుందో చూడాలనిపించదూ. పది, పన్నెండేళ్ల పిల్లవాడు మిసిసిపీ నదిపై చిన్న పడవపై చేసే ప్రయాణానుభవాలే 'హకల్‌బెరీ ఫిన్'. అతనితో పాటు స్వేచ్ఛను కోరుతూ జిమ్ అనే నీగ్రో నౌకరు కూడా ప్రయాణిస్తూ వుంటాడు. వారిద్దరి మధ్యా యేర్పడిన అనుబంధాన్ని వివరిస్తూ, మానవ స్వభావంలోని కపటత్వాన్ని వెక్కిరిస్తూ, మత ఛాందసాన్ని దుయ్యబడుతూ, బానిసత్వాన్ని నిరసిస్తూ హాస్యస్ఫోరకంగా మార్క్ ట్వేన్ రాసిన విధానం పుస్తకాన్ని కిందపెట్టనివ్వకుండా చదివిస్తుంది. నేను చిన్నప్పుడు చదివిన యీ పుస్తకాన్ని ఇప్పటికీ తీసి మళ్లీ మళ్లీ చదివి ఆనందిస్తూ వుంటాను.

ద వుమన్ ఆఫ్ రోమ్:

1940 ప్రాంతాలలో వెలువడిన ఈ పుస్తక రచయిత ఆల్బర్ట్ మొరావియా ఇటలీ దేశస్థుడు. మొదటి సారి ఈ నవల చదువుతున్నపుడు నేను ఆశ్చర్యానికి గురయ్యాను. పాత్రల స్వభావాలనూ, వారి ఆలోచనలనూ ధైర్యంగా, నిర్మొహమాటంగా, నిస్సిగ్గుగా రచయిత చిత్రీకరించిన తీరు విప్లవాత్మకమయినది. ముఖ్యంగా స్త్రీ పాత్రలను చిత్రీకరించిన తీరు చూస్తే అతను వారిని పరిశీలించి కాదు, వారి ఆత్మలను దర్శించి రాశాడు అనిపిస్తుంది. అందరు ఆడపిల్లల్లాగే ఎన్నో కలలు కంటూ యవ్వనంలో అడుగుపెట్టిన వొక యువతి జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందీ, చివరికామె వొక వేశ్యగా మారటానికి దారితీసిన పరిస్థితులూ రాసిన విధానం అనుపమానం.

దువ్వూరి వెంకట రమణశాస్త్రి స్వీయచరిత్ర:

ఇది చదివితే తెలుగు భాషలోని రుచితో పాటు వొకప్పటి తెలుగు ప్రజల జీవితాలలోని రుచీ తెలుస్తుంది. శాస్త్రిగారు తెలుగు, సంస్కృతం చదివిన పండితులు. తన కెదురయిన వింత అనుభవాలూ, విశేషాలూ, ఆనాటి మనుషుల మనస్తత్వాలూ, మమతలూ, చిట్టి పొట్టి కథలుగా చెప్పిన విధానం పుస్తకాన్ని వదలకుండా చదివిస్తుంది.

దీక్షితులు గారికి చలం లేఖలు:

తెలుగులో లేఖా సాహిత్యంలో చలానిది ప్రత్యేక స్థానం. ప్రముఖులు కాని వాళ్లకు కూడా ఆయన వుత్తరాలు రాశారు. చలం నా అభిమాన రచయితయినా, ఆయన రాసినవన్నీ నాకిష్టమే అయినా ఈ పుస్తకమంటే ప్రత్యేకాభిమానం. చలం స్త్రీనే కాదు, ఒక పురుషుడిని కూడా ఎంతగా ప్రేమించీ అభిమానించీ గౌరవించీ పలవరిస్తాడో యీ పుస్తకం చదివితే తెలుస్తుంది. ఒక మనిషిని వేరొక మనిషి జెండర్ స్పృహ లేకుండా ఇంత అభిమానించవచ్చా అని ఆశ్చర్యంగానూ, చలం అభిమానాన్ని అంతగా పొందిన దీక్షితులుగారిని తలుచుకుని అసూయగానూ అనిపిస్తుంది యీ పుస్తకం చదివితే.

అనుక్షణికం:

తెలుగు సాహిత్యంలో నూతనత్వానికి తెరతీసిన వ్యక్తి చండీదాస్. భాషనుపయోగించే తీరుగానీ, భావాలను వ్యక్తీకరించే తీరుగానీ అంతా కొత్తే. బుచ్చిబాబును తన అభిమాన రచయితగా చెప్పుకున్నా, అక్కడక్కడా ఆయన ప్రభావం తొంగిచూసినా ఈయన ధోరణి ఈయనదే. 'అనుక్షణికం'లో తీసుకున్న కాన్వాస్ చాలా పెద్దది. అనేక పాత్రలు వచ్చిపోతుంటాయి. 1970–80 ప్రాంతాలలోని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జీవిత శకలాన్ని కళ్లముందుంచారు. నిష్పక్షపాతంగా రకరకాల పాత్రలనీ, వారి కుటుంబ, కుల నేపథ్యంతో సహా ఆవిష్కరించిన తీరు అనితర సాధ్యం. ఒక్క స్వప్నరాగలీన తప్ప మిగతా పాత్రలన్నీ మనం రోజువారీ చూసే వ్యక్తులే అనిపించడం ఈ నవల ప్రత్యేకత.

(rbhargavi17@gmail.com)

• ఈవెంట్

విశాఖ కథాసాహిత్యం సదస్సు

సాహిత్య అకాడెమీ, విశాఖ సాహితి ఆధ్వర్యంలో ఆగస్టు 8న ఉదయం 10 నుంచి విశాఖ జిల్లా కథా సాహిత్యంపై ఒక రోజు సదస్సు జరగనుంది. వేదిక: ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం. వక్తలు: డి.వి.సూర్యారావు, ఆదూరి సీతారామమూర్తి, కందాళ కనకమహాలక్ష్మి, ఎల్.ఆర్.స్వామి, వి.సిమ్మన్న, అయ్యగారి సీతారత్నం, కోలవెన్ను మలయవాసిని, చింతకింది శ్రీనివాసరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు. ఇదే వేదికపై సాయంత్రం 5 గంటలకు ఈతకోట సుబ్బారావు తమ కవితలను చదివి ఆహూతులతో ముచ్చటిస్తారు.

రాచపాళెంకు అద్దేపల్లి పురస్కారం

తెలుగు కవితా విమర్శకుగానూ అద్దేపల్లి రామమోహనరావు కవితా విమర్శ పురస్కారాన్ని ప్రారంభిస్తున్నట్టు అద్దేపల్లి ఉదయభాస్కరరావు తెలియజేస్తున్నారు. 2017కుగానూ రాచపాళెం చంద్రశేఖర రెడ్డికి ఈ పురస్కారాన్ని సెప్టెంబర్ 6న కాకినాడలో జరిగే అద్దేపల్లి జయంతి సభలో ప్రదానం చేయనున్నారు.

కవిత్వంపై కార్యశాల

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు శాఖ, తెలంగాణ సారస్వత పరిషత్‌ల ఆధ్వర్యంలో పద్య, గేయ, వచన కవితా రచనలపై ఆగస్టు 10న ఒక రోజు కార్యశాల జరగనుంది. తిరుమల శ్రీనివాసాచార్య, వడ్డేపల్లి కృష్ణ, కోయి కోటేశ్వరరావు శిక్షణ ఇస్తారు. నందిని సిధారెడ్డి, ఎల్లూరి శివారెడ్డి, కసిరెడ్డి వెంకటరెడ్డి అతిథులు.

గరగపర్రు- వెలిపై నిరసన కవిత్వం

బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో గరగపర్రు– వెలిపై నిరసన కవిత్వ సభ ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు తాడేపల్లిగూడెంలోని అంబేడ్కర్ భవన్‌లో జరగనుంది.

బహుమతి ప్రదాన సభ

తానా– మంచి పుస్తకం బాల సాహిత్య రచనల పోటీ– 2017 బహుమతి ప్రదాన సభ ఆగస్టు 8న సాయంత్రం 5:30కు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో జరగనుంది. నందిని సిధారెడ్డి, సతీష్ వేమన, ఎస్.ఆర్.పరిమి, వేదాంత సూరి, సీతారామ్ పాల్గొంటారు.

అం.ర.సం. తొలి సమావేశం

అంబేడ్కర్‌వాద రచయితల సంఘం తొలి సమావేశం ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు తణుకులోని అంబేడ్కర్ అధ్యయన కేంద్రంలో జరగనుంది.

విరసం పుస్తకాల పరిచయ సభ

ప్రొద్దుటూరు సాహిత్య పాఠశాలలో ఆవిష్కరించిన విరసం పుస్తకాల పరిచయ సభ విజయవాడలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాలులో ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు జరగనుంది. వక్తలు: సీతారాం, రమాసుందరి, వేములపల్లి రాధిక, వి.చెంచయ్య.

ఆవిష్కరణ- పురస్కారాలు

ఎం.వి.జె.భువనేశ్వరరావు సంకలించిన 'కథానందనం' ఆవిష్కరణ ఆగస్టు 11న సాయంత్రం 5 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ స్మార్ట్ సెమినార్ హాల్లో జరగనుంది. ఆవిష్కర్త: కృత్తివెంటి శ్రీనివాసరావు. ఇందులోనే మళ్ల జగన్నాథం పురస్కారాలను మధురాంతకం నరేంద్ర, అట్టాడ అప్పల్నాయుడు, జగద్ధాత్రి, బిక్కి కృష్ణ, రామకృష్ణ, బి.వి.ఎస్.ప్రసాద్‌కు ప్రదానం చేస్తారు.

ఊదారంగు కలలు ఆవిష్కరణ

విజయచంద్ర కవితా సంపుటి 'ఊదారంగు కలలు' ఆవిష్కరణ ఆగస్టు 13న సాయంత్రం 6 గంటలకు ఉప్పల లక్ష్మణరావు 119వ జయంతి సందర్భంగా ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం, బరంపురంలో జరగనుంది. ఆవిష్కర్త: కె.శివారెడ్డి. ఉప్పల స్మారకోపన్యాసం: చినవీరభద్రుడు.

సోమసుందర్ వర్ధంతి సభ

ఆవంత్స సోమసుందర్ వర్ధంతి సందర్భంగా ఆగస్టు 13న సాయంత్రం 6:30కు ఆయన విగ్రహాన్ని పిఠాపురంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరిస్తారు. సన్నిధానం నరసింహశర్మ, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, శశికాంత్ శాతకర్ణి, గజరావు సతీరామస్వామి వక్తలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి పౌర్ణమి రా.11.01 వరకు, తదుపరి బ.పాడ్యమి. నక్షత్రం శ్రవణం తె.3.58 వరకు(తెల్లవారితే మంగళవారం). వర్జ్యం ఉ.6.31 నుంచి 8.14 వరకు. దుర్ముహూర్తం ప.12.30 నుంచి 1.21 వరకు, తదుపరి ప.3.02 నుంచి 3.54 వరకు. అమృత ఘడియలు సా.4.48 నుంచి 5.43 వరకు. చంద్రగ్రహణం, రాఖీ పండుగ.

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం : 6.29
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	4.40
జొహర్	12.22
అసర్	4.49
మగ్రీబ్	6.46
ఇషా	8.03

పోస్ట్ మీ రచనలు పంపవలసిన చిరునామా: సాహిత్యం, సాక్షి తెలుగు దినపత్రిక, 6-3-249/1, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34 ; ఫోన్: 040–23256000 ; మెయిల్: sakshisahityam@gmail.com

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



సాక్షి, తిరుమల: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మహద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించిన జస్టిస్‌కు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి..

కేంద్ర హోంమంత్రిని కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ



కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాజ్‌నాథ్‌సింగ్‌తో ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమై.. ఆరు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రజకుల సమస్యలను వివరించారు. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చారని, అయితే తెలుగు రాష్ట్రాలతోపాటు 14 రాష్ట్రాల్లో వారిని ఎస్సీ జాబితాలో చేర్చలేదన్నారు. 1985 మే 28న అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రజకుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ కేంద్రానికి లేఖ పంపిందన్నారు. అప్పట్లో దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. రజకుల్ని ఎస్సీ జాబితాలో చేర్చే విషయమై 1984లో కేంద్ర హోంశాఖ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో ఎస్సీ, ఎస్టీల జాబితా పునర్నిర్వచనంపై చర్చలు జరుపుతున్నట్టు చెబుతున్నా.. గత 32 ఏళ్లుగా ఇంకా కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అభిప్రాయాలు తీసుకోలేదని వివరించారు. రజకుల్ని ఎస్సీల జాబితాలో చేర్చితేనే వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు వస్తాయన్నారు.

అమరజవాన్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: దేశ రక్షణ కోసం పాటుపడుతూ అమరులైన వీరుల కుటుంబాలకు విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నగదు అందజేశారు. 25 మంది జవానుల కుటుంబాలకు రూ.22 లక్షల 50 వేలు అందించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీ కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా జవాన్లకు తమ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ ఉగ్రవాదుల చేతుల్లో అమరులైన జవానుల కోసం ప్రత్యేకంగా 'భారత్ కే వీర్' వెబ్‌సైట్ ఉందని, దీని ద్వారా జవానుల కుటుంబాలకు నేరుగా నగదు పంపించవచ్చన్నారు. కార్యక్రమంలో డీజీపీ సాంబశివరావు, సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ డీజీ జీహెచ్‌పీ రాజు, గుంటూరు అర్బన్ ఎస్పీ సీహెచ్ విజయరావు, మంగళగిరి సబ్ డివిజన్ డీఎస్పీ గోగినేని రామాంజనేయులు, క్లబ్ అధ్యక్షుడు సూర్రెడ్డి విష్ణు, సెక్రటరీ వీరమాచనేని రంగప్రసాద్, జాయింట్ సెక్రటరీ కొల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ జవహర్, ట్రెజరర్ జి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీ తథ్యం: శిల్పా



నంద్యాల మండలం పుసులూరులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న శిల్పా మోహన్‌రెడ్డి

నంద్యాల రూరల్: కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికలో ధర్మం వైఎస్సార్‌సీపీ వెంటే ఉందని, భారీ మెజార్టీతో గెలవడం తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నంద్యాల మండల పరిధిలోని పుసులూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సమయంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశానని గుర్తు చేశారు. రైతు వ్యతిరేకిగా మారిన చంద్రబాబు ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నికలో గుణపాఠం తప్పదన్నారు. కాగా, పుసులూరులో శిల్పామోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ భూమా నాగిరెడ్డి వర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు.

మెడ్‌టెక్ మాజీ వైస్‌ప్రెసిడెంట్ రాజ్ అరెస్టు

మధురవాడ(భీమిలి)/సాక్షి, అమరావతి: విశాఖపట్నం మధురవాడ హిల్ నంబర్–2లోని ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ పార్కు(మెడ్‌టెక్)కు చెందిన విలువైన అధికారిక సమాచారాన్ని ఇతరులకు చేరవేసి సైబర్ నేరానికి పాల్పడ్డాడన్న అభియోగంపై ఆ సంస్థ మాజీ వైస్ ప్రెసిడెంట్ జుడిష్ రాజ్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మెడ్‌టెక్ సంస్థలో పనిచేసిన జుడిష్ రాజ్ కీలక సమాచారాన్ని అనధికారికంగా తప్పుడు మెయిళ్ల ద్వారా ఇతరులకు, ఇతర రాష్ట్రాలకు చేరవేశాడు. సంస్థను మోసం చేసి నష్టం కలిగించాడు. కేరళకు చెందిన జుడిష్ రాజ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. సైబర్ నేరం, సెక్షన్ 420 కింద అతడిని శనివారమే హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విశాఖకు తరలించి ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెల్లడించారు.

గ్రూప్‌-3 తొలిరోజు పరీక్షకు 90.60% హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1,055 పంచాయతీ సెక్రెటరీల పోస్టుల భర్తీకి నిర్వహించిన గ్రూప్–3 పరీక్షకు తొలిరోజు ఆదివారం 90.60 శాతం మంది హాజరయ్యారని ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి తెలిపారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని 9 జిల్లాల్లో 135 కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. 35,150 మంది దరఖాస్తు చేసుకోగా, 31,847 మంది హాజరయ్యారు. గుంటూరు, చిత్తూరు జిల్లా పలమనేరులోని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొద్దిసేపు పరీక్షకు అంతరాయం కలిగింది. కొన్ని చోట్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయి. సోమవారం కూడా గ్రూప్–3 పరీక్ష జరగనుంది. విజయనగరం, తూర్పుగోదావరి, నెల్లూరు, కర్నూలు, జిల్లాల్లో రెండో రోజు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు హైదరాబాద్‌తోపాటు ఏపీలో 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నేడు చంద్ర గ్రహణం.. ఆలయాల మూసివేత

సాక్షి, తిరుమల/ఇంద్రకీలాద్రి (విజయవాడ): చంద్ర గ్రహణం సందర్భంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాలను మూసి వేయనున్నారు. నేటి రాత్రి 10.52 గంటలకు గ్రహణం ప్రారంభమై అర్ధరాత్రి 12.48 గంటలకు పూర్తవుతుంది. గ్రహణ సమయం కంటే కనీసం ఆరు గంటలు ముందుగా ఆలయాల తలుపులను మూసి వేయడం శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. గ్రహణ సమయం ముగిశాక సంప్రోక్షణ, పుణ్యాహవచనం నిర్వహించి తిరిగి తలుపులు తెరుస్తారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి మంగళవారం వేకువజాము 2 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయాన్ని మూసి వేయనున్నారు. చంద్ర గ్రహణం కారణంగా సోమవారం అలిపిరి మార్గంలో 4 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో 2 వేల టోకెన్లు మాత్రమే కాలిబాట దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తామని.. భక్తులు సహకరించాలని జేఈవో శ్రీనివాసరాజు కోరారు. ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు వరుస సెలవులతో ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామని తెలిపారు. కాగా, విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఆలయాలు, ఉప ఆలయాలను సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మూసి వేస్తారు. మంగళవారం ఉదయం 8 గంటల తర్వాత అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

అర్ధరాత్రి మసీదు కూల్చివేత

- ధ్వంసమైన మసీదు సామగ్రి, ప్రార్థన వస్తువులు
- తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న ముస్లింలు
- ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ నేతలు
- ఘటనాస్థలాన్ని సందర్శించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పార్థసారథి



అర్ధరాత్రి పొక్లెయిన్‌లతో మసీదును కూల్చివేస్తున్న దృశ్యం



మసీదు శిథిలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొలుసు పార్థసారథి

కంకిపాడు (పెనమలూరు): విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మసీదును శనివారం అర్ధరాత్రి దాటాక కూల్చివేశారు. భారీ పొక్లెయిన్లతో మసీదును పునాదులతో సహా తొలగించివేశారు. ఈ క్రమంలో మసీదులోని పురాతన ఖురాన్, ప్రార్థన వస్తువులు, జనాజా (ముస్లింలు చనిపోతే మోసుకుని వెళ్లే బల్ల, మంచం), ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. ముందస్తు సమాచారం లేకుండా, మసీదులో సామగ్రి భద్రపరుచుకునే అవకాశం ఇవ్వకుండా తమ మనోభావాలు దెబ్బతినేలా అధికారులు వ్యవహరించారంటూ ముస్లింలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఘటనాస్థలాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొలుసు పార్థసారథి పరిశీలించి ముస్లింలకు అండగా నిలిచారు.

90 ఏళ్లనాటి మసీదు..

కృష్ణా జిల్లా ఈడుపుగల్లు గ్రామంలోని మసీదు–ఏ–అలీ మసీదును 90 ఏళ్ల కిందట ఎనిమిది సెంట్లలో నిర్మించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మసీదు స్థలాన్ని భూ సేకరణ కింద తీసుకున్నారు. ఇందు కోసం రూ.18.37 లక్షలు నష్టపరిహారాన్ని మసీదు కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. మసీదు తొలగించేందుకు నోటీసును స్థానిక రెవెన్యూ అధికారులు గత నెల 30న మసీదు కమిటీకి అందించారు. నోటీసులో పేర్కొన్న వారం రోజులు గడువు శనివారం అర్ధరాత్రి 12 గంటలతో ముగిసింది. తెల్లవారితే సమస్య జఠిలం అవుతుందని, ముస్లిం పెద్దలు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందనే కారణంతో అర్ధరాత్రి దాటాక సుమారు 2 గంటల సమయంలో రెండు పొక్లెయిన్లతో మసీదును కూల్చారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, రోడ్డు నిర్మాణ సంస్థ దిలీప్ బిల్డ్‌కాన్ ప్రతినిధుల నేతృత్వంలో పునాదుల ఆనవాలు కూడా లేకుండా తొలగించారు. మసీదుకు కాపలాగా వ్యవహరించే (మౌజన్) వయోవృద్ధులైన జాకీర్‌హుస్సేన్, బాజీ సాహెబ్‌ల నోరుమూసి బలవంతంగా కొందరు వ్యక్తులు లాక్కెళ్లి పోలీసు జీపులో కూర్చోబెట్టారు.

సామగ్రి ధ్వంసం పట్ల ఆవేదన..

పాతకాలంనాటి మసీదు కూల్చివేతతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని స్థానిక ముస్లింలు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం మసీదు ప్రాంగణానికి చేరుకున్న ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ ప్రతినిధులు మసీదులో భద్రపరిచిన సామగ్రి ధ్వంసం కావటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రార్థనలు నిర్వహించే వస్తువులు, పవిత్ర గ్రంథాలను భద్రపరిచే బీరువాలు, పురాతన ఖురాన్ పత్రాలు ధ్వంసమయ్యాయని తెలిపారు.

అర్ధరాత్రి కూల్చివేత దారుణం..

మసీదు కమిటీకి, పెద్దలకు తెలియజేయకుండా అర్ధరాత్రి మసీదు కూల్చటం దారుణమని కొలుసు పార్థసారథి విమర్శించారు. కూల్చిన మసీదు ప్రదేశాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. మసీదును కూల్చే సమయంలో ఆ మతస్తులను ఒప్పించకుండా, అందులో సామగ్రి భద్రపర్చుకునే అవకాశం ఇవ్వకుండా చేయడం సరైంది కాదన్నారు. మసీదుకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని, ప్రత్యామ్నాయ స్థలం చూపి, మసీదు కూడా ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్థసారథితోపాటు పార్టీ పామర్రు ఇన్‌చార్జి కైలే అనిల్ కుమార్, పర్వతనేని కృష్ణారావు, మసీదు పెద్దలు షేక్ సిద్దయ్య, షేక్ గూడ్‌సాహెబ్, షేక్ బాషా ఘటన ప్రాంతాన్ని సందర్శించారు. కూల్చివేతపై చర్యలు తీసుకోవాలని మసీదు కమిటీ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కృష్ణాజిల్లాలో రోడ్ల విస్తరణలో భాగంగా మసీదు, దర్గాలు, శ్మశానవాటికల కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని ఏఐఎం అధినేత, అసదుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు.

'నంద్యాల'లో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- భారత ఎన్నికల సంఘం మాజీ సలహాదారుడు కేజే రావు
- ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- రాష్ట్రంలో కార్యకర్తల పాలన సాగుతోంది



మాట్లాడుతున్న భారత ఎన్నికల సంఘం మాజీ సలహాదారుడు కేజే రావు, చిత్రంలో లక్ష్మణరెడ్డి తదితరులు



నంద్యాల: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలో ప్రతి అధికారీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని భారత ఎన్నికల సంఘం మాజీ సలహాదారుడు కేజే రావు కోరారు. ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాలలో సదస్సు జరిగింది. వేదిక రాష్ట్ర కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కేజే రావు మాట్లాడుతూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అధికారులు మంత్రులకు, అధికార పార్టీ నేతలకు దాసోహమవ్వడం సరికాదన్నారు. మనకు కావాల్సింది చట్టబద్ధ పాలన అయితే.. రాష్ట్రంలో కార్యకర్తల పాలన కొనసాగుతోందన్నారు. అధికారులు తలుచుకుంటే ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే దానికి ఉదాహరణగా బిహార్ ఎన్నికల అనుభవాలను ఆయన చెప్పుకొచ్చారు. అనంతరం వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. ఓటుకు రూ.5 వేలు ఇవ్వగలనని సీఎం చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. దేశంలో ఇప్పటివరకూ ఏ ఉప ఎన్నికలో లేనివిధంగా నంద్యాలలో డబ్బు పాత్ర పెరిగిందని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాలలోనే మకాం వేయడంతో రాష్ట్రంలో పాలన కుంటుపడిందన్నారు. కాగా, ఉప ఎన్నిక సందర్భంగా జరిగే అక్రమాలపై 9949930670, టోల్‌ఫ్రీ నంబర్ 1950, ఫ్యాక్స్ 040–2345578 నంబర్లకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి చిమ్మి జాన్ బర్నబాస్, సమాచార హక్కు చట్టం ఉద్యమ నాయకులు ఎస్.కె.జయన్న, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయత, వంచనకు మధ్య పోరాటం

- పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టీకరణ
- ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబును ప్రతిపక్ష నేత నిలదీస్తే తప్పా?
- చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలను మానుకోవాలి



నంద్యాల అర్బన్: నంద్యాల ఉప ఎన్నికలో విశ్వసనీయత, వంచనకు మధ్య పోరాటం సాగుతోందని ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కర్నూలు జిల్లా నంద్యాలలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విలువలు కలిగిన పార్టీ కాబట్టే అప్పట్లో 18 మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లామన్నారు. ఇప్పుడు శిల్పా చక్రపాణిరెడ్డితో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి పార్టీలో చేర్చుకున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకొని, వారితో రాజీనామాలు చేయించకుండా మంత్రి సైతం పదవులు కట్టబెట్టడాన్ని విశ్వసనీయత అంటారా? అని ప్రశ్నించారు.

సత్యవంతుడైతే దొంగ వాగ్దానాలెందుకు?

నంద్యాలలో మంత్రుల పర్యట నను రాష్ట్ర ఎన్నికల సంఘం సుమోటోగా స్వీకరించి జిల్లా ఎన్నికల అధికారిని విచారణకు ఆదేశించిందని బుగ్గన తెలిపారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారని, దానికి చట్టపరంగా వైఎస్సార్‌సీపీ సమాధానం చెబుతుందని అన్నారు. తనంతటి నీతివంతుడు, ఆలోచనాపరుడు, సత్యవంతుడు ఉండడని చెప్పుకునే సీఎం చంద్రబాబు దొంగ వాగ్దానాలు ఎందుకు చేస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగిస్తుంటే, బాధ్యతగల ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీయడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. సాక్షాత్తూ ఐఏఎస్ అధికారులే చంద్రబాబు పాలనను తప్పు పడుతుంటే రాష్ట్ర ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌ను కట్టించింది నేనే.. ఐటీ నేర్పింది నేనే.. మొన్న అమెరికాకు వెళ్లి తెలుగు వారికి ఇంగ్లిష్ నేర్పింది నేనే అని చంద్రబాబు చెప్పుకోవడాన్ని ఏమంటారో చెప్పాలన్నారు.

టీడీపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

నూనెపల్లె: నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఆదివారం పట్టణంలోని 5, 11 వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి తనకు ఓటు వేయాలని కోరారు. తనను గెలిపిస్తే నంద్యాల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు.



నంద్యాలలోని విశ్వనగర్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి

గిరిబాబుకు జంధ్యాల స్మారక పురస్కారం

ప్రదానం చేసిన సుమధుర కళానికేతన్

విజయవాడ కల్చరల్: అవార్డులు నటుల బాధ్యతలు పెంచుతాయని సినీ నటుడు గిరిబాబు అన్నారు. సుమధుర కళానికేతన్ 44వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన 22వ జాతీయ హాస్యనాటికల పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు 2017 సంవత్సరానికిగాను నటుడు, దర్శకుడు, నిర్మాత గిరిబాబుకు జంధ్యాల స్మారక పురస్కారం ప్రదానం చేశారు. గిరిబాబు మాట్లాడుతూ.. తెలుగు సినిమా చరిత్రలో జంధ్యాలది హాస్యయుగమన్నారు. ఆయన రచించిన నాటికలు కూడా జనాదరణ పొందా యన్నారు. విజయవాడ పట్టణ జాయింట్ పోలీస్ కమిషనర్ బీవీ రమణ కుమార్ మాట్లా డుతూ.. భగవంతుడు మనిషికి మాత్రమే ఇచ్చిన వరం నవ్వు అని చెప్పారు. పని ఒత్తిడిలో ఉన్న ప్పుడు నవ్వు మందులా పని చేస్తుందన్నారు. సుమధుర కళానికేతన్ పరిషత్ చైర్మన్ సామంతపూడి నరసరాజు మాట్లాడుతూ ఏటా హాస్యనాటికల పోటీలు నిర్వ హిస్తామన్నారు.

దొండపాడు నిందితుల్ని అరెస్టు చేయాలి: మధు

సాక్షి, అమరావతి: అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వడాన్ని నిరసించిన దళితులపై, వారికి అండగా నిలిచిన తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై అగ్రకుల పెత్తందారులు దాడి చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దాడులకు తెగబడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. గుడివాడ రూరల్ మండలం దొండపాడులో దళితుల నివాస స్థలాల పక్కన అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వుతున్నారని, ఈ వ్యవహారమై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మధు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని అగ్రకుల పెత్తందార్లు అధికార పార్టీ అండదండలతో ఈ నెల 5న ప్రొక్లెయిన్లు పెట్టి తవ్వడం ప్రారంభించారని, దీన్ని నిరసించిన సీపీఎం నాయకులపై దాడి చేసి తీవ్రంగా కొట్టారని వివరించారు. ఈ దాడిలో పార్టీ నాయకుడు బీవీ శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయని, సబ్బే అనీల్ తల పగి లిందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు.

ఇనుప నిచ్చెనలపై వెనక్కి తగ్గిన టీటీడీ

సాక్షి, తిరుమల: తిరుమలేశుని ఆలయంలో వివాదానికి కారణమైన ఇనుప నిచ్చెనల ఏర్పాటును టీటీడీ ఉపసంహరించుకుంది. భక్తుల మనోభావాలు, ఆగమ విరుద్ధంగా వెండివాకిలి ప్రాకారానికి ఆనుకుని 30 అడుగుల ఎత్తులో ఇనుప నిచ్చెనలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం పెద్ద దుమారం రేపింది. టీటీడీ తీసుకున్న తాజా నిర్ణయంపై భక్తులు, ఆధ్యాత్మిక, ధార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్చించింది. వివాదాస్పద నిచ్చెనలు తొలగించకపోతే దాని ప్రభావం ప్రభుత్వంపై పడే అవకాశముందని గుర్తించింది. దీంతో నిచ్చెనలు తొలగించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆదివారం మధ్యాహ్నం నిచ్చెనలు తొలగించారు.

భక్తుల మనోభావాలను గౌరవిస్తాం: టీటీడీ ఈవో సింఘాల్

వెండివాకిలి వద్ద తోపులాటలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెనల నిర్మాణం నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. భక్తుల మనోభావాలు గౌరవించాలనే సంకల్పంతో నిచ్చెనలు తొలగించామన్నారు. నిర్మాణంలో భక్తుల సౌకర్యం తప్ప మరో ఉద్దేశమే లేదని ఈవో స్పష్టం చేశారు.

అవినీతిలో బాబు నంబర్‌వన్

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ధర్మాన ధ్వజం
- అవినీతి పనులతో రాష్ట్ర ప్రతిష్టను మంటగలిపారు
- అందువల్లే బాబుకు ప్రధాని అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదు
- సీఎం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, బొత్స, చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు

కాకినాడ: అవినీతిలో సీఎం చంద్రబాబు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. దేశంలో పేరున్న ప్రముఖ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయం నిర్ధారణైందన్నారు. ఆయన కాకినాడలో ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ సాధారణ కార్యకర్త నుంచి సీఎం స్థాయి వరకు మూడేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి కంపుకొడుతోందన్నారు. జన్మభూమి కమిటీలద్వారా, సొంత వ్యక్తులద్వారా చేస్తున్న అవినీతి పనులతో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనంతగా రాష్ట్ర ప్రతిష్టను చంద్రబాబు మంటగలిపారని దుయ్యబట్టారు. అందువల్లే చంద్రబాబుకు ఏడాదిగా ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్‌సిటీ పథకంలో దేశమంతా అభివృద్ధి జరుగుతుంటే.. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ సర్కారు మితిమీరిన జోక్యం వల్ల న్యాయపరమైన సమస్యలేర్పడి అభివృద్ధి ముందుకు సాగట్లేదన్నారు. సీఎం చంద్రబాబు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ధర్మాన మండిపడ్డారు. 73, 74 రాజ్యాంగ సవరణ తర్వాత సకాలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, న్యాయస్థానం జోక్యం చేసుకుంటే తప్ప నిర్వహించలేని దుస్థితికి తీసుకెళ్లారని తప్పు పట్టారు. గాడి తప్పిన చంద్రబాబు ప్రభుత్వానికి రానున్న నంద్యాల ఉపఎన్నిక, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయ సాయిరెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, కొప్పన మోహనరావు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు, కాకినాడ పార్లమెంట్ కోఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ కోఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ కోఆర్డినేటర్ ముత్తా శశిధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యల్లో తప్పేముంది?: బొత్స

సీఎం చంద్రబాబు అరాచకాల నేపథ్యాన్ని వివరిస్తూ నంద్యాల సభలో తమ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. గోదావరి పుష్కరాల్లో ప్రచారంకోసం చంద్రబాబు చేసిన ఆర్భాటం వల్ల 29 మంది ప్రాణాలు కోల్పోతే ఇప్పటివరకు ఆ నివేదిక బయటకు రాలేదన్నారు. దానిపై మాట్లాడని సీఎం అనుకూల మీడియా జగన్‌పై మాత్రం రాద్ధాంతం చేస్తోందన్నారు. కాపు గర్జన సందర్భంగా తుని రైలు దుర్ఘటన వెనుక ఆ ప్రాంతానికి చెందిన మంత్రి యనమల, ఆయన బంధువులున్నారని బొత్స ఆరోపించారు. కాపుల్ని బీసీల్లో చేరుస్తామంటూ ఇచ్చిన హామీని విస్మరించిన చంద్రబాబు ఆ హామీ అమలు చేయాలంటూ ముద్రగడ చేస్తున్న దీక్షను అడ్డుకోవడం సరికాదన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన కాకినాడ టీడీపీ నేతలు

వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణకు చేరికలే నిదర్శనమన్న పార్టీ నేతలు



వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలు విజయసాయిరెడ్డి, ధర్మాన, బొత్స సమక్షంలో పార్టీలో చేరిన ఇనుకొండ పట్టాభిరామయ్య, కొలగాని దుర్గాప్రసాద్. చిత్రంలో జిల్లా అధ్యక్షుడు కన్నబాబు, చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: తూర్పుగోదావరి జిల్లాలో పలువురు టీడీపీ నేతలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాకినాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఇనుకొండ పట్టాభిరామయ్య, మాజీ కార్పొరేటర్ కొలగాని దుర్గాప్రసాద్ తమ అనుచరులతో టీడీపీకి రాజీనామా చేసి ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి ధర్మాన ప్రసాదరావు, పార్టీ సీనియర్‌నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం గట్టిగా పని చేయాలని నేతలు వీరికి సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల అన్ని వర్గాల్లో పెరుగుతున్న ఆదరణకు ఈ చేరికలే నిదర్శనమని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పార్టీ కాకినాడ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్ ముత్తా శశిధర్ పాల్గొన్నారు.




ప్రధాని నరేంద్ర మోదీకి కట్టనున్న రాఖీలతో బృందావన్‌కు చెందిన వితంతువులు. బృందావన్‌లోని ఐదుశతాబ్దాల పురాతన గోపీనాథ్ ఆలయంలో సులభ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా తయారుచేసిన రాఖీలు, స్వీట్లను అందంగా ప్యాక్ చేశారు. సోమవారం ఢిల్లీలో మోదీని కలిసి వీరు ఈ రాఖీలను కట్టనున్నారు.

జీఎస్టీతో వైద్యసేవలు ఖరీదు

న్యూఢిల్లీ: వస్తుసేవల పన్ను(జీఎస్టీ) వల్ల డయాలసిస్, పేస్‌మేకర్‌ను అమర్చడం, ఆర్థోపెడిక్స్ రోగులు వాడే పరికరాలు, కేన్సర్ చికిత్స మరింత ఖరీదైనవిగా మారనున్నాయని కేంద్రం తెలిపింది. వైద్యరంగంపై జీఎస్టీ చూపనున్న ప్రభావంపై ఓ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ మేరకు జవాబిచ్చింది. డయాలసిస్(5 నుంచి 12 శాతం), పేస్‌మేకర్ అమర్చడం(5.5 నుంచి 12–18 శాతం), ఆర్థోపెడిక్ రోగుల సహాయ పరికరాలు(5 నుంచి 12 శాతం), బ్లడ్ కేన్సర్ మినహా ఇతర కేన్సర్ల చికిత్స పరికరాలపై(5 నుంచి 7–12 శాతం) పన్నులు జీఎస్టీ వల్ల పెరిగినట్లు పేర్కొంది.

రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి



న్యూఢిల్లీ: రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీలు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా దేశ ప్రజలందరూ తమ మధ్య సౌభ్రాతృత్వ భావనలను పునరుద్ధరించుకుంటారని కోవింద్ విశ్వాసం వ్యక్తం చేశారు. రాఖీ పండుగ సందర్భంగా మహిళల గౌరవాన్ని కాపాడడానికి పునరంకితం కావాలని ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ ప్రజలను కోరారు.

'అమర్‌నాథ్' దాడి కేసులో ముగ్గురు అరెస్టు

అనంతనాగ్: అమర్‌నాథ్ యాత్రికులపై గతనెల 10న జరిగిన దాడిలో ముగ్గురు నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసినట్లు ఆదివారం జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. బిలాల్ అహ్మద్ రేషి, ఐజాజ్ వాగే, జహూర్ అహ్మద్‌ల్ని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న వీరిని మరింత సమాచారం కోసం విచారించనున్నట్లు తెలిపారు. వీరిలో బిలాల్ సోదరుడు ఆదిల్ గతంలో లష్కరే తోయిబా ఉగ్రవాదిగా పనిచేశాడని పోలీసులు వెల్లడించారు.

తొలి పింఛన్‌కు బ్యాంకుకు వెళ్లక్కర్లేదు

న్యూఢిల్లీ: పదవీ విరమణ పొందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తొలిసారి పింఛను అందుకోడానికి కూడా ఇకపై బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ) ఉద్యోగి ప్రతిని ఇకనుంచి పదవీ విరమణ పొందే సమయంలోనే అందజేస్తామని సిబ్బంది, శిక్షణ విభాగం వెల్లడించింది. గతంలో పీపీఓ ఉద్యోగుల ప్రతి కూడా బ్యాంకుకు వస్తే వారు వెళ్లి తీసుకోవాల్సి వచ్చేది. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలోనే పీపీఓ ప్రతిని కూడా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'ఆలిండియా జ్యుడీషియల్' వద్దు

దిగువ కోర్టుల్లో జడ్జీల నియామకాలకు ఉద్దేశించిన ఏఐజేఎస్‌పై మెజారిటీ హైకోర్టుల వ్యతిరేకత

- కేంద్ర ప్రతిపాదనలకు లభించని ఆమోదం
- కింది కోర్టులపై నియంత్రణ కోరుతున్న హైకోర్టులు
- దిగువ కోర్టుల్లో భారీగా జడ్జీల ఖాళీలు
- నీట్, యూపీఎస్సీ తరహా ప్రతిపాదనలు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: న్యాయవ్యవస్థలోనూ ఆలిండియా సర్వీసుల (ఆలిండియా జ్యుడీషియల్ సర్వీసెస్–ఏఐజేఎస్)ను ఏర్పాటు చేయాలన్న కేంద్రం ఆలోచనకు హైకోర్టుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. కిందిస్థాయి కోర్టుల్లో ఈ సేవలను అమలుచేయాలంటూ కేంద్ర న్యాయశాఖ చేసిన ప్రతిపాదనను 9 హైకోర్టులు వ్యతిరేకించాయి. రెండు హై కోర్టులు మాత్రమే దీన్ని ఆమోదించగా.. ఎనిమిది హైకోర్టులు చాలా మార్పులు (నియామక స్థాయి, అర్హతలు, శిక్షణ, ఏఐజేఎస్ ద్వారా భర్తీ చేసే ఖాళీల్లో కోటా వంటి అంశాలపై పలు సూచనలు) సూచించాయి. ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపేందుకు 24 హైకోర్టులు దాదాపుగా విముఖత వ్యక్తం చేశాయి. ఈ కోర్టులన్నీ కిందిస్థాయి కోర్టులపై తమ నియంత్రణ ఉండాల్సిందేనని అభిప్రాయపడ్డాయి. అయితే దిగువ కోర్టుల్లో భారీగా న్యాయమూర్తుల ఖాళీల కారణంగానే పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రం భావిస్తోంది. వీలైనంత త్వరగా ఓ నిర్ణయానికి వచ్చి ఖాళీలను భర్తీ చేయాలని న్యాయశాఖ యోచిస్తోంది. 'మెజారిటీ కోర్టులు కిందిస్థాయి కోర్టులపై పాలనాపరమైన నియంత్రణ ఉండాలని భావిస్తున్నాయి' అని కేంద్ర న్యాయశాఖ.. పార్లమెంటు సంప్రదింపుల కమిటీకి పంపిన నివేదికలో పేర్కొంది.



వ్యతిరేకించినవి	తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టు సహా బాంబే, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పట్నా, పంజాబ్-హరియాణా (చండీగఢ్)
సూచనలు చేసినవి	అలహాబాద్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మణిపూర్, మేఘాలయ, ఒడిశా, ఉత్తరాఖండ్
ఆమోదించినవి	సిక్కిం, త్రిపుర
నిర్ణయం చెప్పనివి	జార్ఖండ్, రాజస్తాన్, కలకత్తా, జమ్మూకశ్మీర్, గువాహటి హైకోర్టులు

బంతి 'సుప్రీం' కోర్టులో..
2015, డిసెంబర్ 31న విడుదల చేసిన వివరాల ప్రకారం దేశంలోని దిగువకోర్టుల్లో 4,452 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీచేసే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు కొన్ని సూచనలు చేసింది. నీట్ తరహా పరీక్షను నిర్వహించటం ద్వారా ఈ ఖాళీలను భర్తీ చేయాలని ప్రతిపాదించింది. కోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీలను వేగంగా భర్తీ చేసేందుకు వివిధ పద్ధతులను కూడా కేంద్రం సూచించింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉండే.. నియామక సంస్థను ఏర్పాటుచేసి కేంద్రీకృత పరీక్షను నిర్వహించాలని కూడా ప్రతిపాదించింది. జ్యుడీషియల్ అధికారుల ఎంపిక కోసం యూపీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తే ఎలా ఉంటుందని కూడా సుప్రీంను కేంద్రం కోరింది. ఐబీపీఎస్‌లో అనుసరిస్తున్న పద్ధతులను కూడా పరిశీలించాలని న్యాయశాఖ కార్యదర్శి సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. 1960 నాటి ఈ ప్రతిపాదనలను మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది.

జర్నలిస్టులు ప్రత్యేకం కాదు: ఢిల్లీ కోర్టు
పౌరుల పేరు ప్రతిష్టలను భంగం కలిగించేలా ఎవరినైనా విమర్శించటం, ఆరోపణలు చేసే హక్కు మీడియాకు లేదని ఢిల్లీ హైకోర్టు చురకలంటించింది. జర్నలిస్టులకు ప్రత్యేక స్వేచ్ఛ ఏదీ లేదని పేర్కొంది. సమాచారాన్ని వ్యాప్తి చేయాల్సిన గొప్ప బాధ్యత జర్నలిస్టులపై ఉందంటూనే పరిధి దాటి వ్యవహరించకూడదని సూచించింది. తన పరువుకు భంగం కలిగించారంటూ ఓ పత్రిక మేనేజింగ్ ఎడిటర్‌పై ఓ వ్యక్తి వేసిన కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

'పనికిరాని' ఐపీఎస్‌ల తొలగింపు

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఐపీఎస్ అధికారులను 'పనికిరాని'వారుగా నిర్ధారించి, విధుల నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించింది. వివరాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మీడియాకు వెల్లడించింది. 2000 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఏఎం జురీ, 2002 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కేసీ అగర్వాల్‌ను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ సూచనల మేరకు తొలగించారు. ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ నియామక కమిటీ అనుమతి తర్వాత తొలగింపు ఉత్తర్వులను శనివారమే వెలువరించినట్లు అధికారులకు చెప్పారు. 15 ఏళ్ల సర్వీస్ పూర్తయిన సందర్భంగా డీఐజీ ర్యాంక్ అధికారులైన ఈ ఇద్దరి పనితీరుపై సమీక్ష చేసి, 'పనికిరాని'వారుగా తేల్చారు. 1983లో రాష్ట్ర పోలీస్ సర్వీస్‌లో చేరిన జురీ అనంతరం 2000లో ఐపీఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. ఇక 1985లో రాష్ట్ర పోలీస్ సర్వీస్‌లో చేరిన అగర్వాల్ 2002లో ఐపీఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. సర్వీస్‌లో చేరిన 15 ఏళ్ల తర్వాత ఒకసారి, 25 ఏళ్ల తర్వాత రెండోసారి.. ఇలా ఐపీఎస్‌ల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తారు.

సీపీఎం వల్లే కేరళలో హింస

అరుణ్ జైట్లీ ధ్వజం

తిరువనంతపురం: కేరళలో రాజకీయ హింసకు రాష్ట్రంలోని అధికార సీపీఎం పార్టీనే కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలను నిర్మూలించడానికి సీపీఎం తన శ్రేణులను ఉసిగొల్పుతోందని మండిపడ్డారు. ఇటీవల హత్యకు గురైన ఆరెస్సెస్ కార్యకర్త రాజేశ్ ఎడవకోడ్ కుటుంబ సభ్యులను జైట్లీ ఆదివారమిక్కడ పరామర్శించారు. రాజేశ్‌ను దారుణంగా చంపారని, మృతదేహంపై 70కిపైగా గాయాలున్నాయని జైట్లీ చెప్పారు. గాయాలు ఉగ్రవాదులు కూడా సిగ్గుపడేలా ఉన్నాయని పేర్కొన్నారు. తర్వాత సంతాప సభలో ఆయన ప్రసంగించారు. 'రాష్ట్రంలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడల్లా హింస పెరుగుతోంది. భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. అయితే రాజకీయ హింసతో ఆరెస్సెస్, బీజేపీలను అణచివేయలేరు. దేశంలోని మిగతా ప్రాంతాల్లో జరుగుతున్న హింసపై మాట్లాడుతున్న వారు కేరళలో చోటుచేసుకుంటున్న హింసపై ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని ఆయన



హత్యకు గురైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త రాజేశ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జైట్లీ

ప్రశ్నించారు. ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్తలను చంపుతోంటే పోలీసులు ప్రేక్షకుల్లా మిగిలిపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు.

షా పర్యటన తర్వాతే హింస..
జైట్లీ ఆరోపణలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ తోసిపుచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా జూన్‌లో రాష్ట్రంలో పర్యటించాకే రాజకీయ హింస పెరిగిందని ఆరోపించారు. ఆరెస్సెస్–బీజేపీ దాడుల్లో చనిపోయినట్లు భావిస్తున్న 21 మంది లెఫ్ట్ కార్యకర్తల బంధువులతో సీపీఎం రాజ్‌భవన్ వద్ద ధర్నా నిర్వహించింది. మరోపక్క.. హింసకు అడ్డకట్ట వేసే మార్గాలపై చర్చించడానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జైట్లీ ఆరోపణలను తోసిపుచ్చారు. హింస నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నేరుగా గుజరాత్‌కే..

ఎమ్మెల్యేలు సోనియాను కలుస్తారన్నది అవాస్తవం: కాంగ్రెస్

బెంగళూరు: కర్ణాటకలోని ఒక ప్రైవేటు రిసార్ట్‌లో బస చేస్తున్న గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. నేరుగా తమ స్వరాష్ట్రానికి చేరుకుంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. వీరంతా ఢిల్లీ వెళ్లి పార్టీ అధినేత్రి సోనియాగాంధీతో సమావేశమవుతారని వస్తున్న కథనాలు అవాస్తవమని పేర్కొన్నాయి. ఈ నెల 8న జరగనున్న రాజ్యసభ ఎన్నిక నేపథ్యంలో 44 మంది ఎమ్మెల్యేల్ని గత నెల 29న బెంగళూరుకు తరలించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు నేరుగా గుజరాత్ చేరుకుంటారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోహిల్ వెల్లడించారు.

పార్టీ నేతలతో అమిత్‌షా సమావేశం
అహ్మదాబాద్: రాజ్యసభ ఎన్నిక నేపథ్యంలో గుజరాత్‌లోని పార్టీ నేతలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆదివారం సమావేశమయ్యారు. రాజ్యసభ ఎన్నికలు పూర్తయ్యే వరకూ అమిత్‌షా ఇక్కడే బస చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. రాజ్యసభ ఎన్నికకు సంబంధించి ఈ సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. రక్షా బంధన్‌లో పాల్గొనేందుకు షా అహ్మదాబాద్ వచ్చారని పార్టీ వర్గాలు చెపుతున్నాయి.

అదే జోరు... అదే ఫలితం

- రెండో టెస్టులోనూ భారత్‌దే విజయం
- శ్రీలంకపై ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో గెలుపు
- సిరీస్ 2–0తో కైవసం
- జడేజా మాయాజాలం
- 12 నుంచి చివరి టెస్టు

రెండేళ్ల క్రితం శ్రీలంకలోనే భారత్ జైత్రయాత్ర మొదలైంది. అప్పటి నుంచి టీమిండియా వరుస సిరీస్ విజయాలతో దూసుకెళుతోంది. ఈ పర్యటనలో ఇన్నింగ్స్ తేడాతో... చరిత్రకెక్కే విజయాన్ని సాధించి భారత్ వరుసగా ఎనిమిదో సిరీస్‌నూ కైవసం చేసుకుంది. తద్వారా వరుసగా అత్యధిక సిరీస్‌లు గెలిచిన జట్ల జాబితాలో ఇంగ్లండ్ (8) సరసన సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. మరో సిరీస్ గెలిస్తే 9 వరుస సిరీస్ విజయాలతో ఆస్ట్రేలియా పేరిట ఉన్న రికార్డును భారత్ అందుకుంటుంది.



విజయానంతరం కోహ్లి బృందం

కొలంబో: లంకగడ్డపై భారత్ మళ్లీ లంకను శాసించింది. మరో రోజు మిగిలుండగానే రెండో టెస్టును... మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2–0తో గెలిచింది. రెండో టెస్టులో కోహ్లి సేన ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. లంకలో ఇన్నింగ్స్ తేడాతో గెలవడం భారత్‌కిదే మొదటిసారి. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (5/152) ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను స్పిన్‌తో దెబ్బ కొట్టాడు. దీంతో ఆదివారం 209/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఫాలోఆన్ ఆడిన శ్రీలంక 116.5 ఓవర్లలో 386 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ కరుణరత్నే (307 బంతుల్లో 141; 16 ఫోర్లు) శతకం సాధించాడు. మిగతా వారిలో ఏంజెలో మాథ్యూస్ 36, డిక్‌వెలా 31 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా, అశ్విన్ చెరో 2 వికెట్లు తీశారు. అజేయ అర్ధశతకంతో పాటు 7 (రెండు ఇన్నింగ్స్‌ల్లో) వికెట్లు తీసిన జడేజాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. చివరి టెస్టు 12 నుంచి పల్లెకెలెలో జరుగుతుంది.

కరుణరత్నే శతకం: గెలుపెలాగో అసాధ్యం కాబట్టి అంతరం తగ్గించే పనిలో... ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ కరుణరత్నే, పుష్పకుమార (16) నింపాదిగా ఆడారు. ఇన్నింగ్స్ పరాజయాన్ని తప్పించడమే లక్ష్యంగా బ్యాటింగ్ చేద్దామనుకున్నా భారత బౌలర్ల జోరు దృష్ట్యా అది ఎంతోసేపు సాగలేదు. ఇన్నింగ్స్ 66వ ఓవర్లోనే కరుణరత్నే 95 పరుగుల వద్ద ఔటయ్యేవాడు! కానీ... జడేజా వేసిన ఆ ఓవర్లో షార్ట్ లెగ్‌లో ఉన్న రాహుల్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయాడు. ఆ మరుసటి ఓవర్లోనే కరుణరత్నే 224 బంతుల్లో సెంచరీ పూర్తిచేశాడు. తర్వాత స్వల్ప వ్యవధిలో అశ్విన్, జడేజా చెరో వికెట్ తీసి లంక పతనానికి బాటలు వేశారు. ఆ తర్వాత కరుణరత్నేకు మాథ్యూస్ జతయ్యాడు. ఇద్దరు లంచ్ వరకు మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు.

జడేజా వికెట్ల వేట: రెండో సెషన్‌లో భారత స్పిన్నర్ల ధాటికి లంక బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. ముఖ్యంగా రవీంద్ర జడేజా అద్భుతమైన బంతులతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు క్రీజులో నిలిచే అవకాశమివ్వలేదు. ఇన్నింగ్స్ 96వ ఓవర్లో జడేజా వేసిన బంతిని కరుణరత్నే సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాడు. గ్లౌవ్స్‌ను తాకుతూ వెళ్లిన బంతి నేరుగా రహానే చేతుల్లో పడింది. తర్వాత మాథ్యూస్, పెరీరా (4) ఇద్దరూ జడేజా బౌలింగ్‌లోనే స్టంపౌటయ్యారు. అనంతరం ధనంజయ డిసిల్వా (17)ను కూడా జడేజానే ఔట్ చేయగా, డిక్‌వెలాను హార్దిక్ పాండ్యా పెవిలియన్ చేర్చాడు. 386 స్కోరు వద్ద ప్రదీప్ (1) వికెట్ తీసిన అశ్విన్ లంక ఇన్నింగ్స్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు
భారత్ తొలి ఇన్నింగ్స్: 622/9 డిక్లేర్డ్; **శ్రీలంక తొలి ఇన్నింగ్స్:** 183; **శ్రీలంక రెండో ఇన్నింగ్స్:** కరుణరత్నే (సి) రహానే (బి) జడేజా 141; తరంగ (బి) ఉమేశ్ 2; మెండిస్ (సి) సాహా (బి) పాండ్యా 110; పుష్పకుమార (బి) అశ్విన్ 16; చండిమాల్ (సి) రహానే (బి) జడేజా 2; మాథ్యూస్ (సి) సాహా (బి) జడేజా 36; డిక్‌వెలా (సి) రహానే (బి) పాండ్యా 31; పెరీరా (స్టంప్డ్) సాహా (బి) జడేజా 4; డిసిల్వా (సి) రహానే (బి) జడేజా 17; హెరాత్ నాటౌట్ 17; ప్రదీప్ (సి) ధావన్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (116.5 ఓవర్లలో ఆలౌట్) 386.**
వికెట్ల పతనం: 1–7, 2–198, 3–238, 4–241, 5–310, 6–315, 7–321, 8–343, 9–384, 10–386.
బౌలింగ్: ఉమేశ్ 13–2–39–1, అశ్విన్ 37.5–7–132–2, షమీ 12–3–27–0, జడేజా 39–5–152–5, పాండ్యా 15–2–31–2.

1 లంకలో భారత్‌కిది తొలి ఇన్నింగ్స్ విజయం. ఓవరాల్‌గా 8 టెస్టుల్లో నెగ్గింది. వరుసగా నాలుగు టెస్టుల్లో గెలిచింది.

3 టెస్టు క్రికెట్ చరిత్రలో ఒకే జట్టులో ఇద్దరు ఆటగాళ్లు (అశ్విన్, జడేజా) అర్ధసెంచరీలతో పాటు ఐదేసి వికెట్లు పడగొట్టడం ఇది మూడోసారి మాత్రమే.

4 ఏడాది కాలంలో నాలుగు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకున్న ఏకైక క్రికెటర్ జడేజా.

2009 ఫాలోఆన్‌లో ఇద్దరు బ్యాట్స్‌మెన్ (మెండిస్, కరుణరత్నే) సెంచరీలు చేయడం 2009 తర్వాత ఇదే తొలిసారి. చివరి సారిగా గంభీర్, లక్ష్మణ్‌లు న్యూజిలాండ్ పర్యటనలో (2009)లో ఈ ఘనత సాధించారు. ఓవరాల్ టెస్టు క్రికెట్‌లో ఇది 14వ సారి మాత్రమే.

జడేజాపై సస్పెన్షన్ వేటు



కొలంబో: రెండో టెస్టులో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచన రవీంద్ర జడేజా చివరి టెస్టుకు దూరమయ్యాడు. ఆటగాళ్ల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించడంతో ఐసీసీ అతని మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత, ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధించింది. దీంతో ఈనెల 12 నుంచి పల్లెకెలెలో జరిగే మూడో టెస్టు మ్యాచ్‌లో జడేజాకు ఆడే అవకాశం లేకుండా పోయింది. రెండో టెస్టు మూడో రోజు ఆటలో ఇన్నింగ్స్ 58వ ఓవర్ వేసిన జడేజా... బ్యాట్స్‌మెన్ పుష్పకుమార ఆడిన డిఫెన్స్ షాట్ బంతిని అందుకొని పుష్పకుమారవైపు ప్రమాదకరంగా విసిరాడు. ఆ సమయంలో పుష్పకుమార క్రీజులోనే ఉన్నాడు. దీనిపై ఫీల్డ్ అంపైర్ జడేజాను హెచ్చరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ అతనిపై జరిమానా, మ్యాచ్ నిషేధం విధించారు. న్యూజిలాండ్‌తో ఇండోర్ టెస్టులో నియమావళిని ఉల్లంఘించడంతో జడేజాకు 3 డీమెరిట్ పాయింట్లు ఇచ్చారు. ఇప్పుడు మరో 3 డీమెరిట్ పాయింట్లు రావడంతో నిషేధం తప్పలేదు. ఈ డీమెరిట్ పద్ధతి ప్రకారం ఒక టెస్టు లేదంటే రెండు వన్డేలు... రెండు టి20లు ఇలా ఏది ముందయితే అది అమలవుతుంది. ఈ నేపథ్యంలో తదుపరి టెస్టుకు అతను దూరమయ్యాడు.

ఈ జట్టు ఇంకా దూసుకెళ్తుంది

సునీల్ గావస్కర్

వరుస టెస్టుల్లో 600 పైచిలుకు పరుగులు చేసిన భారత జట్టుకు ఎదురీదడం అంత సులభం కాదు. రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. అయితే ఫాలోఆన్‌లో కరుణరత్నే, కుశాల్ మెండిస్‌లు పోరాడారు. ఇది పరాజయాన్ని ఆలస్యం చేస్తుందే తప్ప ఓటమిని దూరం చేయదని వారిద్దరికి బాగా తెలుసు. ఇక్కడ వాతావరణం తప్ప ఇంకేదీ లంకను ఆదుకోలేదు. నిజానికి ఈ ఇద్దరూ బాగా ఆడారు. ఓపెనర్ కరుణరత్నే చక్కని స్ట్రోక్స్‌తో అలరించాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్లను చక్కగా ఎదుర్కొన్నాడు. ఇక మెండిస్ కూడా అంతే. గతేడాది ఇతను ఆస్ట్రేలియాపై 176 పరుగులు బాదిన ప్రదర్శనను మర్చిపోలేం. ఈ టెస్టులో అతను స్వీప్ షాట్లతో ఆకట్టుకున్నాడు.

ఆడుతున్నంత సేపు స్పిన్నర్లపై పట్టు కనబరిచాడు. డ్రైవ్, కట్ ఇలా చక్కని షాట్లు అతని బ్యాట్ నుంచి జాలువారాయి. మెండిస్ నిష్క్రమణ తర్వాత కరుణరత్నే, మాథ్యూస్‌ల భాగస్వామ్యం కూడా లంక ఇన్నింగ్స్‌ను కాసేపు నడిపించింది. అయితే భారీ ఆధిక్యం దృష్ట్యా భారత శిబిరాన్ని ఇదేమంత కలవరపర్చలేదు. స్వల్ప విరామంలో జడేజా కరుణరత్నేతో పాటు మాథ్యూస్‌ను బోల్తాకొట్టించడంతో ఇక లంక పతనం ఊపందుకుంది. ఎడం చేతి బ్యాట్స్‌మెన్‌పై రౌండ్ ద వికెట్ బౌలింగ్‌తో జడేజా ఫలితాలు రాబట్టాడు. ఈ మ్యాచ్ కూడా నాలుగు రోజుల్లోనే ముగియడానికి స్పిన్నర్లే కారణం. బౌలింగ్, బ్యాటింగ్, పుష్కలమైన ఆల్‌రౌండ్ నైపుణ్యమున్న ఈ జట్టు (భారత్) ఇక ముందు కూడా మరిన్ని విజయాలు సాధిస్తుంది.

పట్టుబిగించిన ఇంగ్లండ్

మాంచెస్టర్: దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న నాలుగో టెస్టులో ఇంగ్లండ్ పట్టుబిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగుల ఆధిక్యం పొందిన ఇంగ్లండ్ అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట నిలిచే సమయానికి 8 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. మొయిన్ అలీ (67 బ్యాటింగ్), బ్రాడ్ (0) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఇంగ్లండ్ ఓవరాల్‌గా 360 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 220/9 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 226 పరుగుల వద్ద ఆలౌటైంది.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్‌ఆర్ జిల్లా
సోమవారం, 7-8-2017



ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు - సినిమాలో



రాఖీ సాక్షిగా - పక్క పేజీలో



మా అన్నయ్య పెళ్లిలో సందడి చేస్తాం

- సాయి ప్రకీర్తి



"ప్రభాస్ మాకు ఓన్ బ్రదర్ కాకపోయినా.. సొంత అన్నయ్యలానే అనుకుంటాం. హీ ఈజ్ రెబల్ స్టార్. మాకు కూల్ స్టార్" అంటున్నారు సాయి ప్రసీద, సాయి ప్రకీర్తి, సాయి ప్రదీప్తి. రెబల్ స్టార్ కృష్ణంరాజు ముద్దుల కుమార్తెలు ఈ ముగ్గురూ. పెదనాన్న కూతుళ్లను ప్రభాస్ ప్రేమగా చూసుకుంటారు. ప్రతి సంవత్సరం అన్నయ్యకు రాఖీ కడతారు చెల్లెళ్లు. సాయి ప్రకీర్తి చెప్పిన విశేషాలు...



సాయి ప్రదీప్తి
సాయి ప్రకీర్తి
సాయి ప్రసీద

● ప్రభాస్‌గారు మీ ముగ్గురితో ఎలా ఉంటారు?

ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే కదా. రాఖీ గురించి చెప్పే ముందు ఫ్రెండ్‌షిప్ డే గురించి చెప్పాలి. మా అన్నయ్య మాకు మంచి ఫ్రెండ్. మా ముగ్గురితో చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. బాగా టీజ్ చేస్తారు. నేనైతే ఉక్రోషం ఆపుకోలేక కొట్టేస్తుంటాను. మా అన్నయ్య తిరిగి కొడితే నేనెక్కడ? చెప్పండి. ఎంత కొట్టినా ఏమీ అనరు. నవ్వుకుంటూ ఉంటారు.

● ఎలా టీజ్ చేస్తారు.. ఒక ఇన్సిడెంట్ చెబుతారా?

ఫర్ ఎగ్జాంపుల్ నాకు చాక్లెట్స్ చాలా ఇష్టం. నా ఫేవరెట్ చాక్లెట్ తింటూ కనిపించాననుకోండి లాగేసుకుని, తినేస్తారు. అప్పుడు నేను ఉక్రోషంగా ముఖం పెడితే నవ్వుకుంటారు.

● మీ అన్నయ్యని 'రు' అని రెస్పెక్ట్ ఇచ్చి, పిలుస్తారా?

అవును. మా ఫ్యామిలీలో రెస్పెక్ట్‌కి ఇంపార్టెన్స్ ఇస్తాం. అన్నయ్యను 'మీరు' అంటాం. కోపం వచ్చినప్పుడు 'మీరిలా చేయడం బాగాలేదు.. మీరు ఎందుకిలా చేశారు?' అని రెస్పెక్ట్‌గా తిడుతుంటాం (నవ్వుతూ). భలే కామెడీగా ఉంటుంది. మా అన్నయ్య భలే కామెడీ చేస్తారు.

● ప్రభాస్‌గారు కామెడీ చేస్తారా.. బయటివాళ్లకు రిజర్వ్‌డ్‌గా, బిడియంగా కనిపిస్తారు కదా..

అదంతా బయటివాళ్లకు. అన్నయ్య ఎవరికైనా క్లోజ్ అయితే చాలు.. చాలా ఫ్రీగా మూవ్ అవుతారు. జోక్స్ వేస్తారు.

● మీ అన్నయ్యలో మీ ముగ్గురికీ నచ్చే విషయాలు?

అన్నయ్యను డైరెక్ట్‌గా నేనెప్పుడూ పొగిడింది లేదు. ఇప్పుడు అడుగుతున్నారు కాబట్టి, అన్నయ్య ఎంత మంచివాడో చెప్పాలనిపిస్తోంది. గుడ్ హ్యూమన్ బీయింగ్. తనో స్టార్ అనే ఫీలింగ్ లేదు. నార్మల్‌గా ఉంటారు. ఏదైనా సరే ఓపెన్‌గా మాట్లాడతారు. ఫ్యామిలీ మెంబర్స్ గురించి బాగా పట్టించుకుంటారు. అంత కేరింగ్ బ్రదర్ ఉంటే ఎవరైనా లక్కీయే.

● ప్రభాస్

● మీకు గిఫ్ట్స్ అవీ ఇస్తుంటారా?

ప్రతి సంవత్సరం రాఖీ కడతాం. ఏదో ఒక గిఫ్ట్ ఇస్తుంటారు. మా అక్క (సాయి ప్రసీద)కు కుక్కపిల్లలంటే ఇష్టం. తన బర్త్‌డేకి అన్నయ్య కుక్కపిల్ల కొనిచ్చారు. నాకు వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చారు. మా బర్త్‌డే అప్పుడు ఎవరి బర్త్‌డే అయితే వాళ్లకి తెలియకుండా మిగతా ఇద్దరు సిస్టర్స్‌తో కలిసి, 'ఏం గిఫ్ట్ ఇస్తే బాగుంటుంది?' అని డిస్కస్ చేసి, ఇస్తుంటారు. నగలు, బొమ్మలు.. ఇలా చాలా గిఫ్టులు ఇచ్చారు. షూటింగ్‌కి వేరే కంట్రీస్‌కి వెళ్లినప్పుడు కూడా మాకు గిఫ్ట్స్ తెస్తుంటారు.

● మరి.. మీ ముగ్గురూ గిఫ్టులు ఇస్తుంటారా?

అన్నయ్య ఏది కావాలనుకుంటే అది కొనుక్కోగలరు. అందుకని 'మెటీరియల్స్' కొనిస్తే, మాకు పెద్దగా శాటిస్‌ఫేక్షన్ ఉండదు. అందుకే మా అంతట మేం ఏదైనా క్రియేట్ చేసి ఇవ్వాలనుకుంటాం. నాకు పెయింటింగ్స్ అంటే ఇష్టం. నేను గీస్తాను కూడా. అన్నయ్య ప్రతి బర్త్‌డేకీ తన బొమ్మ గీసి, గిఫ్ట్‌గా ఇస్తుంటాను.

● మీకేమైనా సలహాలిస్తుంటారా?

బాగా చదువుకుంటున్నారా? అని అడుగుతారు. 'మీరేం చేయాలనుకుంటే అది చేయండి. బట్ బెస్ట్‌గా చేయండి' అంటుంటారు. అమ్మానాన్నలతో మా విషయాలు మాట్లాడుతుంటారు. వెరీ లవింగ్ అన్నయ్య.

● మీ ఫ్రెండ్స్‌తో బాగా మాట్లాడతారా?

ఎప్పుడైనా షూటింగ్ స్పాట్‌కి తీసుకెళతాం. చాలా ఫ్రెండ్లీగా మాట్లాడతారు. అన్నయ్య డౌన్ టు ఎర్త్. 'బాహుబలి'తో ఇమేజ్ బాగా పెరిగిపోయింది. అయినా ఎప్పటిలానే ఉన్నారు.

● మరి.. మీ అన్నయ్య పెళ్లెప్పుడు?

ఆ ప్రశ్న మా అన్నయ్యను అడిగితే, దాటేస్తుంటారు. మాకు మాత్రం అన్నయ్య పెళ్లి ఫిక్స్ అయితే సందడి చేయాలని ఉంది. మా ఫ్యామిలీలో రెండు విషయాలకు ఇంపార్టెన్స్ ఇస్తాం. ఒకటి ఫ్యామిలీ, రెండోది ఫుడ్. అన్నయ్యకు పెళ్లి కుదిరితే ఫ్యామిలీ అంతా కలుస్తాం. వెరైటీ ఫుడ్ ఉంటుంది. సంగీత్‌లో డ్యాన్స్ చేయొచ్చు. ఫుల్‌గా ఎంజాయ్ చేయొచ్చు. మేమంతా ఆ ఎంజాయ్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నాం. అయితే అన్నయ్య సినిమాలతో బిజీగా ఉంటున్నారు కాబట్టి, పెళ్లి గురించి ఆలోచించడం లేదనుకుంటా!



రమేశ్ అన్నయ్య నాన్న అయితే.. మహేశ్ అన్నయ్య ఫ్రెండ్

- పద్మినీ ప్రియదర్శిని



భర్త సుధీర్‌బాబుతో...

'ఒక్కడు' సినిమాలో తన చెల్లెలితో మహేశ్‌బాబు చాలా సరదాగా ఉంటారు. ఆటపట్టించారు.. ప్రేమ చూపించారు. మరి, రియల్ లైఫ్‌లో తన అక్కాచెల్లెళ్ల (పద్మ, మంజుల, పద్మినీ ప్రియదర్శిని)తో ఎలా ఉంటారు? 'రాఖీ' పండగ సందర్భంగా మహేశ్‌బాబు చెల్లెలు, హీరో సుధీర్‌బాబు భార్య పద్మినీ ప్రియదర్శిని ఆ విశేషాలను పంచుకున్నారు.



అక్కలు పద్మ, మంజులతో ప్రియదర్శిని

● రమేశ్ - మహేశ్ బాబుగార్లకు చిన్న చెల్లెలు మీరు... మీ ఇద్దరు అన్నయ్యల గురించి?

రమేశ్ అన్నయ్య నాకు నాన్నలా. నానీ (మహేశ్‌ని అలానే పిలుస్తారు) ఫ్రెండ్‌లా. రమేశ్ అన్నయ్యను నాన్న అని ఎందుకు అన్నానంటే మా చిన్నప్పుడు నాన్నగారు (సూపర్ స్టార్ కృష్ణ) మాకు పాకెట్ మనీ ఇస్తే, రమేశ్ అన్నయ్య తన మనీనంతా నాకోసం ఖర్చు పెట్టేవాడు. రెస్టారెంట్స్‌కి తీసుకెళ్లి నాక్కావల్సినవి కొనిపెట్టేవాడు. నాకు రమేశ్ అన్నయ్య ఇచ్చిన ఫస్ట్ గిఫ్ట్ వాచ్. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. ఇక, నానీ ఫ్రెండ్ అని ఎందుకు అన్నానంటే, ఫ్రెండ్స్ మధ్య చిన్న చిన్న గొడవలుంటాయి కదా. అలా చిన్నప్పుడు మేమిద్దరం గొడవపడేవాళ్లం. ముఖ్యంగా 'ఇంక్' పెన్ విషయంలో నానీ నన్ను ఇబ్బందులపాలు చేసేవాడు. మార్నింగ్ ఇద్దరం మా పెన్స్‌లో ఇంక్ ఫిల్ చేసుకునేవాళ్లం. ఆ తర్వాత నాకు తెలియకుండా నా పెన్నులో ఉన్న ఇంక్ అంతా నానీ తీసేసి, సైలెంట్‌గా నా బ్యాగులో పెట్టేవాడు. స్కూల్‌కెళ్లి చూసుకుంటే, ఖాళీ పెన్ను కనిపించేది. రాసుకోవడానికి చాలా ఇబ్బందిపడేదాన్ని. అది తల్చుకుంటే నవ్వొస్తోంది.

● మహేశ్‌బాబు

● పెద్దయ్యాక మహేశ్‌గారు మీ గురించి తీసుకుంటున్న కేర్ గురించి?

నాకు పెళ్లి కుదిరినప్పుడు చాలా టెన్షన్ పడ్డాడు. సుధీర్ (హీరో సుధీర్ బాబు – పద్మినీ ప్రియదర్శిని భర్త) మంచి వ్యక్తేనా? అని ఆరా తీశాడట. మంచి అబ్బాయి అని తెలుసుకుని, రిలాక్స్ అయ్యాడు. పెళ్లికి ముందు ఇలా అంటే, పెళ్లి తర్వాత కూడా నానీ టెన్షన్ పడ్డాడు. మంజుల (మహేశ్ రెండో చెల్లెలు) దగ్గర 'బుల్లి (పద్మినీని ఇంట్లో అలానే పిలుస్తారు) హ్యాపీగా ఉందా?' అని అడిగేవాడట. 'హ్యాపీ' అని చెప్పాక రిలీఫ్ అయ్యాడు. సిస్టర్స్ అంటే నానీకి అంత కేర్. మా ఇద్దరన్నయ్యలూ అంతే.

● అంటే.. మీ నాన్నగారు మిమ్మల్ని చూసుకున్నంత జాగ్రత్తగా మహేశ్‌గారు చూసుకుంటారన్న మాట?

అవునండి. చిన్నప్పుడు అల్లరి బాగా చేసేవాడు. జనరల్‌గా కూతుళ్ల గురించి తల్లీతండ్రీ ఎక్కువ కేరింగ్‌గా ఉంటారు. మహేశ్ కూడా ఓ ఫాదర్ తీసుకున్నంత కేర్ తీసుకుంటాడు. మంచి ఫ్యామిలీ పర్సన్.

● మీ హజ్బెండ్ సుధీర్‌బాబు హీరో అవుతానన్నప్పుడు మీరెలా ఫీలయ్యారు? మీ అన్నయ్య మహేశ్ ఏమన్నారు?

నేను సుధీర్ దగ్గర ఒక్కటే చెప్పాను. 'నీ టాలెంట్ మీద నాకు నమ్మకం ఉంది. ఆ టాలెంట్‌తోనే పైకి రావాలి. మహేశ్ హెల్ప్ తీసుకోకూడదు. ఎందుకంటే తనని హెల్ప్ అడగడానికి బయటివాళ్లు చాలామంది ఉంటారు. ఇక, ఇంట్లోవాళ్లు కూడా అడిగి ఇబ్బందిపెట్టకూడదు' అన్నాను. యాక్చువల్‌గా సుధీర్ కూడా తన టాలెంట్‌ని నమ్ముకునే ముందుకెళ్లాలనుకున్నాడు. అందుకు నాకు సంతోషంగా అనిపించింది. నిజానికి నానీకి అందర్నీ ఎంకరేజ్ చేసే హ్యాబిట్ ఉంది. కానీ, ఫెయిలైతే ఎక్కడ అప్‌సెట్ అయిపోతామోనని భయం. అందుకే సుధీర్ హీరో అవుతానన్నప్పుడు కొంచెం టెన్షన్ పడ్డాడు. అయితే, సుధీర్ వర్కవుట్స్‌కి సంబంధించిన వీడియోలు, తన ప్యాషన్ చూసి, 'గో ఎ హెడ్' అన్నాడు.

● మహేశ్ తన ముగ్గురు సిస్టర్స్ హజ్బెండ్స్‌తో ఎలా ఉంటారు?

వెరీ ఫ్రెండ్లీ. సేమ్ టైమ్ రెస్పెక్ట్ కూడా ఉంటుంది. మేమంతా ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే అందరం కలసి మాట్లాడుకుంటాం. అందరి ఫీలింగ్స్‌ని రెస్పెక్ట్ చేస్తాం.

● మీ పిల్లలతో ఎలా ఉంటారు?

మాకిద్దరు అబ్బాయిలు. మా రెండో బాబు పుట్టినప్పుడు నానీ చూడ్డానికి వచ్చాడు. అప్పుడు మా వదిన నమ్రతతో మనక్కూడా ఇద్దరు పిల్లలు ఉంటే బాగుంటుందన్నాడట. అప్పటికే వాళ్లకు గౌతమ్ పుట్టాడు. ఆ తర్వాత సితార పుట్టింది. తన పిల్లలతో ఎలా ఉంటాడో మా పిల్లలతో కూడా అలానే ఉంటాడు. పిల్లలతో సరదాగా మాట్లాడతాడు.

● ఫైనల్లీ... వ్యక్తిగా మహేశ్ ఎలాంటి టైప్?

హీ ఈజ్ పర్ఫెక్ట్. నాకు నచ్చే విషయం ఏంటంటే.. ఇంట్లో ఆడవాళ్లను ఒకలా బయటివాళ్లను ఒకలా నానీ చూడడు. అందరికీ రెస్పెక్ట్ ఇస్తాడు.

- డి.జి. భవాని



ఆత్మీయం

అభిషేకిద్దాం... ఆచరిద్దాం...



ఆయనకు నైవేద్యంగా చక్రపొంగలి అవసరం లేదు. పులిహోర ప్రసక్తేలేదు. పాయసాన్నాలు తినిపించనక్కర లేదు. నెత్తిమీద నాలుగు చెంబుల నీళ్లు గుమ్మరిస్తే చాలు. లింగడు కాస్తా ఉబ్బులింగడయిపోతాడు. నాలుగు మారేడు దళాలు తెంపి ముఖాన పారేస్తే సరి, పట్టరానంత సంతోషపడిపోతాడు. చిటికెడంత విభూది తీసుకుని ఆయన ముఖాన మూడు రేఖలు దిద్ది, మన నుదుటన కాసింత పులుముకుంటే చాలు... మనకు వెన్నుదన్నవుతాడు. చేతిలో ఏమీ లేనినాడు భక్తితో చెంబెడు నీళ్లు సమర్పిస్తే చాలు... పంచభక్ష్యపరమాన్నాలూ పెట్టినంతగా పొంగిపోతాడు. అందుకే ఆయన పేదల పెన్నిధయ్యాడు, పేదదేవుడయ్యాడు. అయితే, ఇంతటి బోళావాడిలోనూ మానవుడికి మల్లే కోపం ఉంటుంది. కరుణ తొణికిసలాడుతుంటుంది. హాస్యం ఉంటుంది. ప్రేమ ఉంటుంది. అనుగ్రహం ఉంటుంది. సత్యం ఉంటుంది. నృత్యం ఉంటుంది. ప్రణయం ఉంటుంది. భార్యకు తనలో అర్ధభాగమిచ్చి అర్ధనారీశ్వర సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టిన ఆది దేవుడాయన. అందుకే మహాకవి కాళిదాసు, వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే.. అంటూ అమ్మవారిని, అయ్యవారిని కీర్తించడానికి కారణమిదే. పార్వతీ పరమేశ్వరులు వాక్కు–అర్థంలా విడదీయరాని బంధమై ఒకే శరీరంలో ఒకే ఆత్మగా కొలువున్నారని తన్మయభావనతో కొలుస్తాడు. ఈ సందర్భంగా ఇక్కడ చెప్పుకోవలసిందేమిటంటే... కార్తీక సోమవారాలేవిధంగా శివప్రీతికరమైనవో, అదేవిధంగా శ్రావణమాసంలోని ప్రతి సోమవారం శివుడికి ఎంతో ప్రీతిపాత్రమైనది. ఈ రోజున ఆ ముక్కంటిని మనసారా అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, ఆయనలోని మంచి లక్షణాలను అలవరచుకునేందుకు ప్రయత్నిద్దాం... ఆయన అనుగ్రహానికి పాత్రులమవుదాం.

గుడ్ ఫుడ్

ఆరోగ్యానికి మోదం... బాదం!



గుప్పెడు బాదం పలుకులు రోజూ తినే వారికి రోగనిరోధక శక్తి పెరిగి అంత తేలిగ్గా అనారోగ్యాలు దరిచేరవన్న సంగతి అందరికీ తెలిసిందే. బాదంతో ఒనగూరే మరికొన్ని ఉపయోగాలను తెలుసుకుందాం.

● బాదం గింజలు రక్తంలోని చక్కెర పాళ్లను నియంత్రిస్తాయి. అందుకే డయాబెటిస్ రోగులు నట్స్ అన్నింటిలోనూ బాదంను నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.

● బాదంలోని ఎల్–కార్నిటిన్ అనే పోషకం మెదడు పనితీరును చురుగ్గా చేస్తుంది. అందుకే మంచి జ్ఞాపకశక్తి కోసం, భవిష్యత్తులో అల్జైమర్స్ డిసీజ్ నివారణ కోసం బాదం బాగా ఉపయోగపడుతుంది.


● బాదం తీసుకునే వారు అంత తేలిగ్గా బరువు పెరగరు. అందుకే ఊబకాయం నియంత్రణకు ఇవి ఉపయోగపడతాయి.

● నిగారించే చర్మం కోసం, నల్లటి మెరుపుతో కూడిన కురుల కోసం బాదంలోని పోషకాలు తోడ్పడతాయి.

● బాదంలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల బాదం పలుకులు తీసుకునే వారి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

● గుండె జబ్బులకు దోహదపడే 'సీ–రియాక్టివ్ ప్రోటీన్' అనే పదార్థాన్ని బాదం తగ్గిస్తుంది. తద్వారా ఇది అనేక గుండెజబ్బులను నివారిస్తుంది.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్!! నేను ఒక అబ్బాయిని లవ్ చేశాను. చెప్పకుండా ఉండటం సరికాదని ధైర్యం చేసి చెప్పేశాను. త్రీఇయర్స్‌గా తన మాట కోసం వెయిట్ చేస్తున్నా. నాతో క్లోజ్‌గానే ఉంటాడు, బాగా మాట్లాడతాడు.. కానీ నేనంటే ఇష్టమని చెప్పడ్డంలేదు. నేను వెయిట్ చేస్తానని కూడా చెప్పాను తనకి. అయినా ఇంత వరకూ ఎలాంటి రిప్లై లేదు. అలా అని వేరే వాళ్లని పెళ్లి చేసుకోలేను. తన స్థానంలో ఎవరినీ ఊహించుకోలేను. మనసులో ఒకరిని పెట్టుకుని రేపు వచ్చే వ్యక్తిని మోసం చెయ్యలేను. ఎందుకంటే ప్రేమ అనేది మానసికమైన సంబంధమని నేను నమ్ముతాను. గతాన్ని మరచిపోలేక, భవిష్యత్‌ను ఆహ్వానించలేక.. అనుక్షణం చస్తూ బతుకుతున్నాను. ఇప్పటికీ మేం మంచి స్నేహితుల గానే ఉన్నాం. నేను ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి అన్నయ్యా.. మరోసారి ధైర్యం చేసి అడగనా?

– ఉష

ఏం చెయ్యగలుగుతాం బంగారం..?

‘ఏంటి సార్ క్వశ్చన్‌కి క్వశ్చన్ ఆన్సర్‌గా చెబుతున్నారు?’

అంటే..?

‘అంటే గింటే కాదు అక్కడ మీ చెల్లెలు లైఫ్‌లో టెన్షన్ భరించలేక రాస్తే క్వశ్చన్‌కి క్వశ్చన్ ఆన్సర్‌గా చెబుతారా?’

అంటే..?

‘అంటే ఏంటి సార్.. అంటే... అంటే... అని నసుగుతున్నారు?’

సరే నువ్వు చెప్పు!!

‘ఫొటో మీది పెడుతున్నారు సార్ ఆన్సర్ నేనెందుకు ఇవ్వాలి...? యూ ఓన్లీ టెల్..’

నువ్వూ నేనూ చెప్పగలిగింది ఏమీ లేదు.. ఆ అబ్బాయే చెప్పాలి. ధైర్యంగా అడిగెయ్యాలి. ఇప్పటికే ఒకసారి అడిగా, మరోసారి అడిగితే మనం చీప్ అయిపోతాం అని అనుకోవడం కంటే... అడిగి ఆ వలయంలో నుంచి బయటపడటం ఎంతో బెటర్! బీ కాన్ఫిడెంట్ అండ్ బీ షూర్ ఆల్‌వేస్!

‘అరటిపండు లాంటి ఆన్సర్ సార్.. క్వశ్చన్‌కి క్వశ్చన్ ఆన్సర్‌గా చెప్పేముందు... ముందే ఈ ఆన్సర్ చెప్పొంటే..!?’

మేడమ్! నీకో దండం పెడతా చెబుదామనే లోపలే రియాక్ట్ అవుతున్నావు... ఒక అరటిపండు ఇస్తే నేను తింటా... నువ్వు బ్రెయిన్ తిను..!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సెల్ఫ్ చెక్

రాఖీ అందమైన బ్యాండ్ మాత్రమేనా?



పిల్లలకు రాఖీ అంటే మణికట్టుకు కట్టుకునే అందమైన బ్యాండ్ అనే తెలుసు. పురాణ కాలం నుంచి శ్రావణ పౌర్ణమి నాడు దేశం మొత్తం స్థానిక సంప్రదాయాలను అనుసరిస్తోంది. పిల్లలకు చెప్పే ముందు మనం గుర్తు చేసుకుందాం.

1. యమున తన సోదరుడు యముడు క్షేమంగా ఉండాలని రక్షాబంధనాన్ని కట్టిందని, రక్షాబంధనం కట్టే ఆనవాయితీకి ఇదే మొదలు అని విశ్వాసం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. బలి చక్రవర్తికి లక్ష్మీదేవి రాఖీ కట్టినట్లు పురాణ కథనం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. శచీదేవి రాఖీని ఇంద్రునిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసం కలిగించడానికి సాధనంగా ఉపయోగించింది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. శిశుపాల వధలో కృష్ణుని మణికట్టుకు గాయమై రక్తం కారితే ద్రౌపది తన చీర చెంగును చించి గాయానికి కడుతుంది. అప్పుడు కృష్ణుడు ఆమెకు అండగా ఉంటానని మాట ఇచ్చినట్లు ఒక కథనం వాడుకలో ఉంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. అరేబియా తీరంలోని వాళ్లు ఈ రోజు సముద్రంలో కొబ్బరికాయలను వదిలి నారియల్ పూర్ణిమగా పండగ చేసుకుని చేపల వేట ప్రారంభిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పర్వదినాన్ని రుషి తర్పణ్, అవని అవిట్టమ్ పేరుతో సంప్రదాయబద్ధంగా చేసుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. ఉత్తరాది రైతులు ఈ రోజును కజారి పూర్ణిమగా పండగ చేసుకుంటారు. గోధుమ, బార్లీ పంటలు నాటే రోజులివి. భగవతీదేవికి పూజ చేసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. గుజరాత్‌లో ఈ రోజు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి మణికట్టుకు పంచకవ్యంలో(ఆవు పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడలతో చేసిన మిశ్రమం) ముంచిన నూలుదారాలను కట్టుకుంటారు. ఇది విషాన్ని హరిస్తుందని, పాపనాశకంగా పని చేస్తుందని వారి విశ్వాసం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

మీ సమాధానాల్లో ‘ఎ’లు ఆరు అంత కంటే ఎక్కువగా వస్తే ఈ పండగ పుట్టుపూర్వోత్తరాల గురించి మీకు ఆసక్తి ఎక్కువ. పిల్లలకు దీని మూలాలను చెప్పడానికి తగిన సమాచారం ఉంది.

ఈ వారం YouTube హిట్స్

అబ్బాయి నాట్ సో.. స్ట్రాంగ్

శుభ్ మంగళ్ సావ్‌ధాన్ : ట్రైలర్

నిడివి : 2 ని. 52 సె., హిట్స్ : 61,15,868

‘‘ఎస్.. మిస్టర్ శర్మ.. మీ ప్రాబ్లం ఏంటి?’’ – డాక్టర్ గారి ప్రశ్న. ఆయన ఎదురుగా శర్మ, శర్మకు కాబోయే మామగారు కూర్చొని ఉన్నారు. శర్మ చెప్పడం మొదలు పెట్టాడు. మామగారు మధ్య మధ్యలో ముఖం చిట్లించి శర్మపై విరుచుకు పడుతున్నారు. ‘‘రెండ్రోజుల్లో మా పెళ్లి డాక్టర్. ఈయన కూతుర్నే చేసుకోబోతున్నాను. ఒకరోజు ఏమైందంటే.. ఈయన, ఈయన భార్య ఇంట్లో లేనప్పుడు.. ఈయన కూతురు, నేను.. దగ్గర కాబోయాం. నేను తనను టచ్ చేశాను’’ అని శర్మ చెబుతుంటే, కాబోయే మామగారు ఇంతెత్తున లేచి, ‘‘సిగ్గుండాలి. పెళ్లి కాకుండా పిల్లను తాకడానికి’’ అని గయ్ మంటాడు. శర్మ కూడా పెద్దగా అరుస్తాడు.. ‘‘నేనే కాదు, మీ కూతురు కూడా నన్ను తాకింది’’ అంటాడు. ఇక్కడ ఈ సీన్ కట్ కాగానే అక్కడ ఫ్లాష్‌బ్యాక్‌లో.. శర్మ చెయ్యి వెయ్యడం, ఆ తర్వాత ఇంకేమీ చెయ్యలేకపోవడం, అమ్మాయి కంగారుగా.. ‘ఏమైందీ’ అని అడగడం, ‘అది జెంట్స్ ప్రాబ్లం’ అని శర్మ చెప్పడం ట్రైలర్‌లో రెండో సీన్. ఇదిగో ఆ ప్రాబ్లంతోనే అల్లుడు గారిని కాబోయే మామగారు డాక్టర్ దగ్గరికి తీసుకొస్తాడు. ‘ఎరక్టైల్ డిస్‌ఫంక్షన్’ (అంగస్తంభన సమస్య) అనే ఒక దుస్సాహస థీమ్‌తో తయారైన ‘శుభ్ మంగళ్ సావ్‌ధాన్’ అనే బాలీవుడ్ మూవీ ట్రైలర్ ఇది. సినిమా సెప్టెంబర్ 1న విడుదల అవుతోంది. శర్మగా ఆయుష్మాన్ ఖురానా, శర్మకు కాబోయే భార్య సుగంధగా భూమి పెడ్నేకర్ ఇందులో యాక్ట్ చేస్తున్నారు. పైకి చెప్పుకోడానికి మగవాళ్లు బిడియపడే ఒక గంభీరమైన సమస్యకు కామెడీ ప్రజెంటేషన్ ఈ చిత్రం. ట్రైలర్‌లోని బిట్స్ చూస్తుంటే.. మూవీ హిట్టయ్యేలానే ఉంది!




శుభ్ మంగళ్ సావ్‌ధాన్ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా, భూమి పెడ్నేకర్

నువ్వొక నికార్సైన దుష్టశక్తివి

మేజర్ లేజర్-సువా కారా: మ్యూజిక్ వీడియో

నిడివి : 2 ని. 46 సె., హిట్స్ : 5,06,76,064




గుర్రాలు డాన్స్ చెయ్యవు. ముందుకాళ్లు పైకెత్తి సకిలిస్తాయి. అయితే.. ఇరవై నాలుగేళ్ల బ్రెజీలియన్ ఫిమేల్ సింగర్ ‘అనిట్టా’, అదే దేశపు పాప్ గాయని పాబ్లో విట్టార్‌ల ఎడారి యుగళ నృత్యాన్ని ఈ వీడియోలో చూస్తున్నప్పుడు అచ్చంగా రెండు అందమైన గుర్రాలు డాన్స్ చేస్తున్నట్లే ఉంటుంది. ఇదొక పోర్చుగీసు దృశ్యగీతం. ‘మేజర్ లేజర్’ అనే ముగ్గురు అమెరికన్ కుర్రాళ్ల ఎలక్ట్రానిక్ మ్యూజిక్ బృందం దీనిని చిత్రీకరించి ‘సువా కారా’ అనే పేరుతో యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసింది. సావా కారా అంటే పోర్చుగీసు భాషలో ‘యువర్ ఫేస్’ అని అర్థం. ఫస్ట్ అనిట్టా స్టార్ట్ చేస్తుంది. ‘సిద్ధమవ్వు. బట్, యుద్ధం చెయ్యకు. చూడు, కానీ తలపడకు. నువ్వు మగాడిననుకుంటున్నావ్ కదా, బట్ నన్నాపలేవ్. నువ్వొక నికార్సైన దుష్టశక్తివి. కానీ నన్నెదుర్కోలేవు..’ అని! తర్వాత పాబ్లో విట్టార్ అందుకుంటుంది. ‘.. నేనిక్కడ ఉన్నాను, ఎటాక్ చెయ్యడానికి సిద్ధంగా. నీ ముఖం మీద గుద్దేస్తాను. సరిగ్గా ముఖం మీద..’ అని! ధైర్యవంతులైన అబ్బాయిలు మాత్రమే అందమైన అమ్మాయి ఇలా మాట్లాడితే తట్టుకోగలరు. మ్యూజిక్ హైలైట్. అంతకంటే హైట్ ఈ ఇద్దరు అమ్మాయిలు! బహుశా అందుకేనేమో ఈ వీడియో హిట్స్ కూడా త్వరత్వరగా కోట్లు దాటేస్తున్నాయి!

చందమామల బృందగానం

గర్ల్స్ జనరేషన్: హాలిడే మ్యూజిక్ వీడియో

నిడివి : 3 ని. 23 సె., హిట్స్ : 71,30,903

దక్షిణ కొరియా అమ్మాయిల ఫేమస్ మ్యూజిక్ బ్యాండ్ ‘గర్ల్స్ జనరేషన్’ కొత్తగా విడుదల చేసిన 6వ ఫుల్ లెంగ్త్ ఆల్బమ్ ‘హాలీడే నైట్’లోని ఒక ట్రాక్ ఇది. పేరు ‘హాలీడే’. ఎనిమిది మంది (మొదట్లో తొమ్మిది మంది ఉండేవారు) బాలికల్లాంటి యువతులు ఫ్రెష్‌గా, ఎంతో ఎనర్జిటిక్‌గా సెలబ్రేట్ చేసుకున్న సమ్మర్ హాలీడే అనుభూతులు మిక్స్ అయి ఉన్న ఈ డాన్స్ వీడియో యూట్యూబ్‌లో వాయువేగంతో ఉల్లాసాన్ని వెదజల్లుతోంది. బ్యాండ్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అమ్మాయిలంతా ‘హో.. హో.. హో..’ అని డ్యాన్స్ చేసి, అర్థవంతంగా పాడి రెండు మూడు రోజుల్లోనే.. లాట్స్ ఆఫ్ ‘లవ్ అండ్ సపోర్ట్’ని హిట్‌ల రూపంలో కొట్టేశారు. ‘నాకెంతో బాగుంది. ఈ రోజు కోసం నేను ఎదురు చూశాను. మనం మొదటిసారి కలుసుకున్నప్పటిలానే మళ్లీ ఒకసారిప్పుడు కలుసుకున్నాం’ అంటూ ప్రారంభమయ్యే ఈ ఆహ్లాదగీతం.. ‘హే.. ఈరోజు మన హాలీడే. మన అలసట దినాల నుంచి ఇక్కడికి పారిపోయి వచ్చాం. విద్యుల్లతలమై మెరిసి మురిసిపోదాం’ అని ఎండ్ అవుతుంది. మిస్ కాకుండా చూడండి.





మణికట్టుకు కడుతున్న రాఖీ
ఎందుకివాళ బాధపడుతోంది?
పువ్వులా వికసించే రాఖీ
ఎందుకు వడలిపోయినట్టుగా అనిపిస్తోంది?

అసలు రాఖీకొచ్చిన బాధ ఏంటి?
కలుగుతున్న కష్టమేంటి?
సోదరులు కరువయ్యారా?
రక్షణ బరువయ్యిందా?
ఆగండాగండి!
ఇవాళ రాఖీ పండగ.
రాఖీ స్వగతం వింటే
సోదరులకే కాదు...
అక్కాచెల్లెళ్లకు కూడా కళ్ళు చెమరుస్తాయి.
ఆ అందమైన బంధాన్ని
మళ్లీ బలపరచాలన్న స్ఫూర్తి కలుగుతుంది..

రాఖీ... అంటే భారతీయుల పరిభాషలో రక్షణ. అంటే నేనే! అన్న, తమ్ముడు, కొన్నిచోట్ల నాన్నకు కూడా అక్క, చెల్లి, కూతురు నన్ను మణికట్టుకు కడతారు.. జీవితాంతం తమకు అండగా, రక్షగా ఉండమని! అందుకే ఈ వేడుక రక్షాబంధన్ అయింది. ఒకరకంగా ఇది నా పుట్టినరోజు. నాది నిన్నమొన్నటి జన్మ కాదు. పురాణకాలంలోనే పురుడు పోసుకున్నాను. ఎప్పుడు పుట్టానో చెప్పలేను కాని నాటి నుంచయితే ఉనికిలో ఉన్నా!

నాకు గుర్తున్నంత వరకు నా పుట్టిన రోజులు.. మీలో చాలామందికి తెలిసినవి.. నెమరు వేసుకునేవి మరోమారు గుర్తు చేస్తా! ఇది ద్వాపర యుగం నాటిది.. ఓ రోజు... శ్రీకృష్ణుడు చెరుకుగడను విరుచుకుంటుంటే దాని పేడు తగిలి వేలు కోసుకుపోయింది. జలజల రక్తం కారడం మొదలైంది. పక్కనే ఉన్న రుక్మిణి కంగారు పడి ఆ పక్కనే ఉన్న చెలికత్తెలను పురమాయించింది కట్టుకట్టడానికి గుడ్డ తెమ్మని. ఈ పక్కనే ఉన్న ద్రౌపది క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన కొంగు చించి శ్రీకృష్ణుడి వేలుకు గట్టిగా చుట్టి రక్తప్రవాహానికి అడ్డుకట్టవేసింది. కృష్ణుడు ఆప్యాయంగా ద్రౌపది తల నిమిరి.. “చెల్లెమ్మా.. ఆపదకాలంలో నీకు రక్షణగా నిలిచి నీ రుణం తీర్చుకుంటాను” అని మాట ఇచ్చాడు. దుశ్శాసనుడు నిండుసభలో ద్రౌపదిని అవమానించినప్పుడు ఆమె అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడి ఇచ్చిన మాటను నెరవేర్చుకున్నాడు. ఇదీ రక్షాబంధనమే! ఇంకో జ్ఞాపకం కూడా చెప్తా.. ఒకసారి యమునా నది యమధర్మరాజు ముంజేతికి నన్ను కట్టింది. సంతోషపడిన యమధర్మరాజు “నీకు మరణం అనేది ఉండదు. నిత్యం పరవళ్లు తొక్కుతూ ఉంటావ్’ అని ఆశీర్వదించాడు. “నువ్వే కాదు రాఖీ కట్టిన ఏ సోదరైనా సోదరుల రక్షణలో చిరంజీవులుగా వర్ధిల్లుతారు” అనే వరమూ ఇచ్చారు. అప్పుడు తెలిసింది నాకు నా శక్తేంటో!

చరిత్ర

సరే... “పైనవన్నీ యుగాలనాటివి.. పైగా పురాణాలంటున్నావు.. వాటిల్లో
మెంతో?” అని ఫేస్ క్వశ్చన్‌మార్క్‌లా పెట్టారు? ఒకే అయితే చరిత్రలోని సంఘటనలే చెప్తా
తెలుసు కదా? దండయాత్రలతో ప్రపంచాన్ని చుడుతూ మన దేశానికీ వచ్చాడు. ఇక్కడ ప
వర్తి గొప్ప వీరుడు, మహా శూరుడు అని అలెగ్జాండర్‌తోపాటు అతని భార్య రుక్సానా కూ
మవంతుడు యుద్ధంలో తన భర్తను మట్టుపెట్టేస్తాడేమోనని భయపడింది. అప్పుడు నా గు
కుడి ద్వారా పురుషోత్తముడి దగ్గరకు పంపింది. నన్ను తన మణికట్టుకు ముడివేసుకొని
మని.. యుద్ధంలో అలెగ్జాండర్‌ను వధించకుండా వదిలేయమని విన్నవించుకుంది. అన్న
యుద్ధంలో అలెగ్జాండర్‌ను వధించే అవకాశం వచ్చినా..
మాటను ని
ఇంకోలా కు
షోత్తముడి భా
రాఖీ కట్టిందని, ఆ
గ్జాండర్, ప
పెట్టా
ఏదైత
నన్ను
ప్రాణాలే
డతా. జీవితాం

పరువుకోసం..

హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో అట... తమ కులం కాని వాళ్లను ప్రేమించారని.. వాళ్లనే పెళ్లి చేసుకుంటామని పట్టుబట్టారని కడుపున పుట్టిన బిడ్డలని కూడా చూడకుండా నరికి పోగులు పెట్టారు. పదిమందిలో పరువు కోసం కన్నపిల్లల ప్రాణాలనే బలిపెట్టారు. వాళ్లనుకునే పేరుప్రతిష్ఠలను నిలుపుకోవడం కోసం ఆ ఇళ్లల్లో ఆడపిల్లలను చంపడానికి ఇంటి పెద్ద సహా అన్నాతమ్ముళ్లు కూడా సిద్ధపడుతున్నారు. భద్రతకు భావమే లేకుండా చేస్తున్నారు.

భ్రూణ హత్యలు

పుట్టాక అమ్మాయి మీద కక్షగట్టి చేస్తున్న నీచాలు ఒకెత్తయితే.. పుట్టకుండా చూసే పాతకం ఒకెత్తు. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిసిందంటే చాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనే కాదు పక్కరాష్ట్రమైన మహారాష్ట్రలాంటి చోట్ల కూడా అబార్షన్‌తో ఆ పిల్లకు పుట్టుకలేకుండా చేస్తున్నారు. ఒకవేళ పుట్టినా పురిట్లోనే గొంతునొక్కేస్తున్నారు.

ఇవన్నీ కాక.. ప్రతి అన్న, తమ్ముడు, మామయ్య, బాబాయ్, చివరకు తాతయ్య వయసు వృద్ధులు కూడా ఇంట్లోంచి బయటకు వెళితే చాలు.. పరాయి ఆడపిల్ల కనపడితే చాలు ఈవ్‌టీజింగ్, వెకిలి నవ్వులు, అసభ్యప్రవర్తనలు, అవాకులు, చవాకులతో అమ్మాయిలు గడపదాటకుండా కట్టడి చేస్తున్నారు. దినదినగండం.. నూరేళ్ల ఆయుష్షను తలపిస్తున్నారు! వీళ్లంతా అన్నదమ్ములు, తాతతండ్రులే అయినప్పుడు.. నా

సాక్షిగా ప్రతి ఇం
నివ్వాలి కదా..
కదా! మరెందుకు ఇలా
న్నారు?
అర్థమైంది.. అంటే నా అస్తిత్వంతో అవ
లంతా భద్రంగా ఉంటున్నారని అనుకు
యేటా నా పుట్టిన రోజుకి నన్ను వాళ్ల సో
కట్టి రక్షణను కానుకగా స్వీకరిస్తున్నారనే
ఉన్నాను. అసలు రక్షాబంధన్‌కు విలువే
వాస్తవాలు సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.
పండుగలా సంవత్సరానికి ఒక్కరోజుకు
చేశారు. దాని స్ఫూర్తిని అవగతం చేసుకో
స్తుంది నాకు.. ఇన్నాళ్లు ఎంత విర్రవీగా
లాగే. నాదేదో అద్భుతమైన జన్మ అని..
అమ్మాయి సంక్షేమం, శ్రేయస్సు కోసం
అవతరించానని గర్వపడ్డాను. ఇప్పుడు
అయినా నా ధర్మం మరిచిపోను. రక్షణ.
బాధ్యత అని తెలిసొచ్చింది. అందుకే ఇ
మీకు మీరే కట్టుకోండి అమ్మాయిలూ..
ణను మీ చేతుల్లోనే పెట్టుకోండి. నాకు
కాలిటీని ఆపాదించండి. సంత్సరానికి ఒ
ప్రతిరోజును రాఖీపౌర్ణమిని చేసుకోండి.
కున్న శక్తిని, యుక్తిని, ఆత్మవిశ్వాసాన్ని

డైరెక్టర్ అవ్వాలని...



‘అల్లరి’ నరేశ్

పెద్ద హీరోను డైరెక్ట్ చేసి లైఫ్‌లో సెటిల్ అయిపోదామనుకున్న అబ్బాయి ఓ అమ్మాయితో లవ్‌లో పడతాడు. అలా డైరెక్షన్ దారి తప్పుతుంది. కానీ, మేడ మీద అబ్బాయి దారిలోకి అమ్మాయి వస్తుంది. డైరెక్టర్ కావాలనుకున్న ఆ అబ్బాయి లవ్‌ను ఎలా డైరెక్షన్ చేసుకున్నాడు? అన్న అంశాలతో రూపొందిన చిత్రం ‘మేడ మీద అబ్బాయి’. ‘అల్లరి’ నరేశ్ హీరోగా జి. ప్రజిత్ దర్శకత్వంలో శ్రీమతి నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. రెండు రోజుల్లో పది లక్షలు వ్యూస్ సాధించింది. ‘ఈ మేడ మీద అబ్బాయిని అందరూ మీ ఇంటి అబ్బాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను’’ అన్నారు నరేశ్. ‘‘రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. నరేశ్ కేరీర్‌లో మరపురాని చిత్రంగా నిలిచిపోతుంది. ఈ నెలలో ఆడియోను, సెప్టెంబర్‌లో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నాం’’ అన్నారు చంద్రశేఖర్. అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: షాన్ రెహమాన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎమ్.ఎస్ కుమార్.



విజయ్ దేవరకొండ, షాలిని

నాని హ...

‘‘ట్రైలర్ చూసి సినిమా చ
లీనం కావడానికి కొంత స
వెళ్లాలనుకుంటాం. ఇలాం
థ్యాంక్స్’’ అని హీరో నాని
త్వంలో ప్రణయ్ రెడ్డి నిర్మి
అనంతరం ఆయన మాట్లా
అయ్యాడు. అతడి ‘పెళ్లిచూ
చడం సంతోషంగా ఉంది.
మరో స్థాయికి తీసుకెళ్లేది
చిత్రమిది. లోకేషన్ల ఎంపిక
చేస్తున్నాం’’ అన్నారు సంది
రిలీజ్ చేయడంతో పాటు
వచ్చింది’’ అన్నారు విజయ్
మండలి అధ్యక్షుడు పి. కిర

లోకరక్షకుడు

ఏసుక్రీస్తు జీవిత చరిత్ర ఆధారంగా బ్రహ్మం సి. హెచ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘లోకరక్షకుడు’. చంద్ర పర్వతమ్మ సమర్పణలో చంద్రశేఖర్ చంద్ర నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాటలను రికార్డ్ చేస్తున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ– ‘‘కొత్త అంశాలతో ఏసుక్రీస్తు జీవిత చరిత్రను అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ ఏకే రిసాల్ సాయి మంచి ట్యూన్స్ కంపోజ్ చేశారు. సింగర్ మధుబాల కృష్ణన్, గీతామాధురి, హేమాంబిక చక్కగా పాడారు. అభినవ్ శ్రీనివాస్ రాసిన పాట ఈ చిత్రానికి హైలెట్. ఈ చిత్రం మూడో షెడ్యూల్‌ను ఫారిన్ ఆర్టిస్టులతో కర్ణాటకలో జరుపుతున్నాం’’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: క్రిష్.

రాఖీ సాక్షిగా



నిజమా? మరి ఇవేంటి?

‘‘పురాణాలను, చరిత్రను చూపించి నిన్ను నువ్వు భలే రొమాంటిసైజ్ చేసుకుంటున్నావ్.. బాగానే ఉంది. నీ ఉనికికి అది అవసరం కూడా! కాని వర్తమాన భారతం చూడు.. అక్క, చెల్లి, తల్లి, బిడ్డ పడుతున్న యాతన చూడు..’’ అంటారా? .. విశాఖపట్టణం జిల్లాలోని వాకపల్లిలో రక్షణనివ్వాల్సిన పోలీసులే ఆదివాసి ఆడబిడ్డల మీద లైంగిక దాడి చేశారు. వాళ్ల ఆత్మగౌరవాన్ని కించపరిచారు. దేశాన్ని కంటికిరెప్పలా కాపుకాయాల్సిన జవాన్లు కశ్మీరు ఆడపిల్లల మానాభిమానాల్ని మంటగలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని నోరెత్తి ఎక్కడా చెప్పుకోనివ్వకుండా చేశారు. పోలీసుల, జవాన్ల అహంకారం వాకపల్లికో.. కశ్మీర్‌కో పరిమితం కాలేదు.. దేశంలోని ఎనిమిది దిక్కులకూ వ్యాపించింది.

... నిజమెంతో.. అబద్ధ
...్తాను. అలెగ్జాండర్ ది గ్రేట్
...పురుషోత్తముడు అనే చక్ర
...డా విన్నది. అలాంటి పరాక్ర
...రించి తెలుసుకొని.. సేవ
...తనను సోదరిగా స్వీకరించ
...ట్టుగానే పురుషోత్తముడు
... వదిలేసి రుక్సానాకు ఇచ్చిన
...లబెట్టుకున్నాడు. దీనినే
...ాడా చెప్పకుంటారు. పురు
...ర్య సంయుక్త అలెగ్జాండర్‌కు
...మెను చెల్లిగా భావించిన అలె
...పురుషోత్తముడికి ప్రాణభిక్ష
...డనీ కూడా చెబుతారు. కథ
...తేనేం... నాకున్న పవర్ అదీ!
... కట్టిన అక్క, చెల్లి ధనమాన,
...కాదు సౌభాగ్యాన్నీ కాపా
...ంతం రక్షగా నిలుస్తా!

అన్న.. తండ్రి..

జన్మనిచ్చిన తండ్రే కూతుళ్ల పాలిట భక్షకుడిగా మారుతుంటే జవాన్లను, పోలీస్‌లను అని ఏం లాభం? ఇదేదో పల్లెటూరులో జరిగిన దారుణం కాదు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాజధాని.. హైదరాబాద్ నగరంలో బయటపడ్డ విషాదం! పన్నెండేళ్ల కూతురికి ఆత్మస్థయిర్యమై.. ఆమె వెనకాల నిలబడాల్సిన తండ్రి.. కన్న బిడ్డ అనే ఇంగితం కూడా మరచి ఆ పిల్లపట్ల పైశాచికంగా ప్రవర్తించాడు. మూడేళ్లపాటు ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇంట్లో కూడా అమ్మాయిలకు రక్షణ లేదని నిరూపించాడు. ఇంకెక్కడో బిహార్‌లో.. అన్న తన చెల్లి పట్ల ఇలాంటి నిర్వాకమే వెలగబెట్టాడట. బయటి వాళ్ల నుంచి చెల్లికి అపాయం కలగకుండా చూడాల్సిన అన్నే చెల్లెలిని చెరిచాడు. ఆ తప్పును పెద్దవాళ్ల ముందు బయటపెడుతుందని చెల్లి గొంతు కోసేశాడు. భగవంతుడా.. ఇంకా ఏమేమి చూడాలి? ఎన్ని ఘోరాల గురించి వినాలి?

...ంటి ఆడపిల్లకు భద్రత
...రక్షణగా నిలవాలి
... కాల్చుకు తింటు
...మ్మాయి
...న్నాను. ప్రతి
...ోదరుల చేతులకు
... భ్రమలో
... ఇవ్వట్లేదు ఇన్ని
... నన్ను ఒక
... పరిమితం
...ోలేదు. ఏడుపా
...ు.. ఈ మగాళ్ల
... లోకంలోని
...కారణజన్మురాలిగా
... సిగ్గుపడుతున్నాను.
... భద్రత స్వీయ
...ప్పటి నుంచి నన్ను
...మీ భద్రత, మీ రక్ష
...పవిత్రత కన్నా ప్రాక్టి
...క్కసారి కాదు...
... నేను మీ ముంజేతి
...అని మరచిపోకండి.

కదిలే కార్లల్లో.. బస్సుల్లో..

నాలుగు గోడల కప్పు కింద.. కన్నవాళ్ల సంరక్షణలోనే భద్రత లేనప్పుడు వీధుల్లో.. నడి బజారుల్లో.. కదిలే కార్లల్లో.. బస్సుల్లో ఎక్కడిది? నిర్భయను కదిలే బస్సులోనే కబళించారట. భారత దేశం నా మాతృభూమి, భారతీయులంతా నా సహోదరులు.. అన్న ప్రతిజ్ఞను మరచి మరీ నిర్భయ జీవితాన్ని చెరిచారు. భవిష్యత్తు గురించి బంగారు కలలు కన్నది, ఏదో సాధించాలనే తపనతో ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీ వచ్చింది. తండ్రి ఉన్న ఆస్తి అంతా అమ్మి కూతురును ఫిజియోథెరపీలో చేర్పించాడు. మంచి ఫిజియోథెరపిస్ట్‌గా పేరు తెచ్చుకుంటుందని తల్లిదండ్రులు ఆశపడ్డారు. వాళ్ల కోరికను నెరవేర్చాలనే పట్టుదలతో చదువుతోంది. ఈ లోపే బస్సులో దుర్మార్గులు ఆమె కలలను కుళ్లబొడిచారు. బతుకును బుగ్గిపాలు చేశారు. ఇది జరిగిన కొద్దిరోజులకే అయిదేళ్ల గుడియా.. ఇంటి పక్క అన్నయ్య కోరికకు బలైంది దారుణంగా! ఇలాంటివి ప్రపంచానికి తెలిసినవి వందల్లో.. తెలియనివి వేలల్లో ఉన్నాయ్!

అమ్మేస్తున్నారు...

ఆడపిల్లను లక్ష్మీదేవిగా కొలవడం.. రాతలకు, మాటలకే పరిమితం. ఇప్పుడైతే అమ్మాయి పుడితే భారంగానే భావిస్తున్నారు. అందుకే వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండుల్లో, వీధుల్లో, చివరకు చెత్త కుప్పల దగ్గరా ఉట్టిగానే వదిలేసి వెళితే.. కొంతమంది అమ్మేసి కాసులు తీసుకుంటున్నారు. ఇది కన్నవాళ్లు మూటగట్టుకుంటున్న పాపమైతే.. ఇంకొంతమంది తమకూ కూతుళ్లు, అక్కాచెల్లెళ్లు ఉంటారు అని మరచి తమ ఇంటి ఆడపిల్ల కాకపోతే చాలు అనుకొని ఇంకే ఇంటి ఆడపిల్ల అమాయకంగా కనిపించినా మాయచేసి.. మోసంచేసి చేతులు మారుస్తున్నారు, ట్రాఫికింగ్‌తో క్యాష్ చేసుకుంటున్నారు. క్షమించలేని తప్పకు పాల్పడుతున్నారు.



రామ్

ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు

...ఈ మాట అంటున్నది హీరో రామ్. అనడమే కాదు... ‘ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు..’ అని ఓ పాట పాడుతున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం పది గంటలకు ఈ పాట విడుదల చేశారు. ‘నేను శైలజ’ తర్వాత కిశోర్ తిరుమల దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న సినిమాలోనిదీ పాట. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. అలాగే, స్నేహితుల దినోత్సవం కానుకగా టైటిల్‌నూ ప్రకటించారు. ‘స్రవంతి’ రవికిశోర్, పీఆర్ సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై కృష్ణచైతన్య నిర్మిస్తున్న ఈ సినిమాకు ‘ఉన్నది ఒకటే జిందగీ’ టైటిల్‌ను ఖరారు చేశారు. చిత్రసమర్పకులు ‘స్రవంతి’ రవికిశోర్ మాట్లాడుతూ– ‘‘ఇప్పటివరకు జరిగిన చిత్రీకరణతో 50 శాతానికి పైగా సినిమా పూర్తయింది. సోమవారం ఊటీలో కొత్త షెడ్యూల్ మొదలవుతోంది. దాంతో ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తవుతుంది. వచ్చే నెల్లో ఇటలీలో ఆ పాటను చిత్రీకరించి, దసరాకు సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం’’ అన్నారు. అనుపమా పరమేశ్వరన్, లావణ్యా త్రిపాఠి హీరోయిన్లుగా, శ్రీవిష్ణు, ‘పెళ్లి చూపులు’ ఫేమ్ ప్రియదర్శి కీలక పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కళ: ఏఎస్ ప్రకాశ్, కూర్పు: శ్రీకర్ ప్రసాద్, కెమెరా: సమీర్‌రెడ్డి.

ఎవరూ వెనక్కి వెళ్లలేని పరిస్థితి!

– డి.సురేశ్ బాబు

‘‘సినిమా ఇండస్ట్రీలోకి నిర్మాతగా, డైరెక్టర్‌గా, రైటర్‌గా, యాక్టర్‌గా రావాలని చాలామంది అనుకుంటారు. కానీ అందరి కలలు నిజం కావు. తక్కువమంది సక్సెస్ అవుతారు. నాకు మా ఫాదర్ (డి. రామానాయుడు) ఒక కంపెనీ తయారు చేసి పెట్టారు. నా తమ్ముడు (వెంకటేశ్) యాక్టర్. తనతో సినిమాలు తీస్తున్నాను. ఇప్పుడు నా కొడుకు (రానా) కూడా ఉన్నాడు. ఎక్కడో నేను బ్లెస్డ్ అనుకుంటున్నాను’’ అన్నారు నిర్మాత డి. సురేశ్‌బాబు. రానా, కాజల్ అగర్వాల్ జంటగా తేజ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘నేనే రాజు నేనే మంత్రి’. డి.సురేశ్ బాబు, సీహెచ్. భరత్‌చౌదరి, వి.కిరణ్‌రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో సురేశ్‌బాబు మాట్లాడుతూ– ‘‘ఇది రాధ, జోగేంద్ర స్టోరీ. రాధ, జోగేంద్ర చిన్నప్పటి నుంచి ఫ్రెండ్స్.. తర్వాత లవర్స్.. ఆ తర్వాత భార్యాభర్తలు. అనుకోని కారణాల వల్ల రాధకు దూరమవుతాడు జోగేంద్ర. చివరికి రాధ దగ్గరకు వెళ్లి ఫైనల్‌గా ఎలా సెట్ అయ్యాడన్నదే చిత్రకథ. మూడో అమ్మాయి క్యాథరిన్ క్యారెక్టర్ ఈ సినిమాలో ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది’’ అన్నారు. ఈ నెల 11న మరో రెండు సినిమాలు విడుదలవుతున్న విషయం గురించి సురేశ్‌బాబు ప్రస్తావిస్తూ – ‘‘ఒక్కొక్కసారి పండగకు మూడు నాలుగు సినిమాలు రిలీజ్ అవుతాయి. అన్నీ బాగానే ఆడతాయి. అలాగే ఈ నెల 11ని ప్రేక్షకులు పండగలా, అన్ని సినిమాలను ఆదరిస్తారనుకుంటున్నాను. మిగతా సినిమాల నిర్మాతలతో సంప్రదించడం జరిగింది. కానీ, ఎవరూ వెనక్కు వెళ్లలేని పరిస్థితి. ఎవరైనా వెనక్కు వెళితే భయపడ్డారనే పుకార్లు వస్తాయి. అందుకే వెళ్లలేదు. మా సినిమాపై నమ్మకం ఉంది’’ అన్నారు.



భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి, సురేశ్ బాబు

‘‘సినిమాల గురించి సురేశ్‌బాబుగారి దగ్గర ఏడాది పాటు ఒక పీజీ డిప్లొమా కోర్స్ చేసినట్లు ఉంది. ప్రీ–ప్రొడక్షన్ వర్క్ బాగా చేస్తే ప్రొడక్షన్‌లో అన్ని బాధలు తగ్గుతాయని ఆయన దగ్గర నేర్చుకున్నాను. తేజగారు బాగా డైరెక్ట్ చేశారు. రానా సూపర్‌గా యాక్ట్ చేశారు’’ అని కిరణ్‌రెడ్డి అన్నారు. ‘‘గ్రేట్ ప్రొడ్యూసర్ సురేష్‌బాబుగారితో అసోసియేట్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. కథను నమ్మి ఈ సినిమా తీశాం. రానాగారిని ఈ సినిమా నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళుతుందన్న నమ్మకం ఉంది. తేజగారి లాంటి డైరెక్టర్‌తో సినిమా తీయడం చాలా ఆనందంగా ఉంది’’ అన్నారు భరత్ చౌదరి.

...స్తవాసి మంచిది - విజయ్

...ాడాలా? వద్దా అనే నిర్ణయానికొస్తున్నాం. సినిమాకు వెళ్లాక కథలో ...మయం పడుతుంది. కానీ ‘అర్జున్ రెడ్డి’ ట్రైలర్ చూడగానే సినిమాకు ...టి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు మేకర్స్‌కు ... అన్నారు. విజయ్ దేవరకొండ, షాలిని జంటగా సందీప్ రెడ్డి దర్శక...ంచిన చిత్రం ‘అర్జున్ రెడ్డి’. ఈ సినిమా ట్రైలర్‌ను నాని రిలీజ్ చేశారు. ...్లాడుతూ– ‘‘విజయ్ నా ‘ఎవడే సుబ్రమణ్యం’తో పరిచయం ...ాపులు’ టీజర్‌ను, ఇప్పుడు ‘అర్జున్ రెడ్డి’ ట్రైలర్‌ను నేను ఆవిష్కరిం... ‘అర్జున్ రెడ్డి’ ట్రైలర్ చాలా బాగుంది. ఈ చిత్రం తెలుగు సినిమాని ...అవ్వాలని కోరుకుంటున్నా’’ అన్నారు. ‘‘ఎమోషన్స్‌తో కూడుకున్న ...కకు చాలా టైమ్ పట్టింది. ఈ నెల 25న సినిమాను విడుదల ...ప్ రెడ్డి. ‘‘నాని హస్తవాసి మంచిది. ఆయన మా సినిమా ట్రైలర్ ...చాలా బాగుందని మెచ్చుకోవడంతో మా సినిమా హిట్ అనే భరోసా ...్ దేవరకొండ. ప్రణయ్ రెడ్డి, షాలిని, తెలుగు చలనచిత్ర వాణిజ్య ...ణ్ తదితరులు పాల్గొన్నారు.

‘లోకరక్షకుడు’లో ఓ దృశ్యం



సూపర్ ఫాస్ట్

సప్తగిరి హీరోగా హర్షవర్ధన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘సప్తగిరి సూపర్ ఫాస్ట్’ చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. జొన్నాడ రమణ మూర్తి సమర్పణలో నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నట్టి క్రాంతి, నట్టి కరుణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి తెలుగు చలన చిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు పి. కిరణ్ క్లాప్ ఇవ్వగా, సీనియర్ రచయిత విజయేంద్రప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకులు బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ –‘‘నా చిరకాల మిత్రుడు హర్షవర్ధన్ నాతో కలిసి చాలా సినిమాలకు వర్క్ చేశాడు. ఈ సినిమా కథను రెడీ చేసి, నాకు వినిపించి నా అనుమతి



నట్టికుమార్, సప్తగిరి, హర్షవర్ధన్

తీసుకున్నాడు. సప్తగిరికి సూట్ అయ్యే మంచి కథ ఇది. హీరోగా మరో మెట్టు పైకి ఎదుగుతాడు’’ అన్నారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ– ‘‘కొత్త నిర్మాతలిద్దరూ సినిమాపై మంచి ప్యాషన్‌తో ఉన్నారు’’ అన్నారు. ‘‘మా టీమ్‌ని నమ్మి సప్తగిరిగారు సినిమా చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది’’ అన్నారు నిర్మాతలు. ‘‘ఈ సినిమా అందరికీ మంచి పేరు తీసుకురావాలి’’ అన్నారు సప్తగిరి.

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ హిస్టరీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: ఇంగ్లిష్ లాంగ్వేజ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- లోక్‌సభ సెక్రెటేరియట్‌లో 31 జూనియర్ క్లర్క్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 9
- పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)లో 38 డిప్లొమా ట్రైనీ పోస్టులకు చివరి తేదీ: ఆగస్టు 9
- మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌లో 69 గ్రాడ్యుయేట్, టెక్నీషియన్, డిప్లొమా; 20 ట్రేడ్ అప్రెంటీస్‌లకు చివరి తేదీ: ఆగస్టు 9



అంతరిక్ష కార్యక్రమం

గ్రూప్స్ ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

1. సార్క్ ఉపగ్రహ (దక్షిణాసియా ఉపగ్రహ) ప్రయోగం గురించి రాయండి.



జ. 2014లో నేపాల్‌లోని ఖాట్మండ్‌లో జరిగిన సార్క్ శిఖరాగ్ర సదస్సులో సభ్య దేశాల ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఒక ఉపగ్రహాన్ని కానుకగా ప్రకటించారు.

- 2,230 కిలోల బరువున్న ఈ ఉపగ్రహంలో 12 కేయూ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్లు ఉన్నాయి. దీని జీవిత కాలం 12 ఏళ్లు. వ్యయం రూ.235 కోట్లు. ఈ ఉపగ్రహాన్ని జీశాట్-9 అని కూడా పిలుస్తారు.
- మోదీ ప్రకటనపై పాకిస్తాన్ తొలుత సానుకూలంగా స్పందించినా తర్వాత వ్యతిరేకించింది.
- ఈ ఉపగ్రహానికి మొదట సార్క్ ఉపగ్రహం అని పేరు పెట్టినప్పటికీ పాక్ వైదొలగడంతో 'సౌత్ ఏషియా శాటిలైట్' అని నామకరణం చేశారు.
- ఈ ఉపగ్రహ సేవలతో నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, శ్రీలంక, మాల్దీవులు లబ్ధి పొందుతాయి.
- దీన్ని ఇస్రో 2017, మే 5న జీఎస్ఎల్‌వీ -ఎఫ్9 రాకెట్ నుంచి ప్రయోగించింది.

ప్రయోజనాలు:

- టెలీకమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవలను విస్తరించడానికి ఈ ఉపగ్రహం తోడ్పడుతుంది.
- ఉపగ్రహ ఆధారిత టెలివిజన్, డీటీహెచ్ సేవలను దక్షిణాసియా అంతటా విస్తరించడానికి ఉపకరిస్తుంది.
- ఈ ఉపగ్రహం ద్వారా దక్షిణాసియా దేశాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది.
- సుదూర ప్రాంతాలకు ఉపగ్రహ ఆధారిత వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా టెలీ మెడిసిన్, టెలీ ఎడ్యుకేషన్ సేవలను విస్తరించడానికి ఉపయోగపడుతుంది.
- తుపాన్లు, వరదలు, భూకంపాలు, సునామీ, కరువు తదితర విపత్తుల నిర్వహణలో సేవలు అందిస్తుంది.
- విపత్తుల సమయంలో ప్రమాదంలో చిక్కుకున్నవారిని గుర్తించి రక్షించే సెర్చ్, రెస్క్యూ సేవలను అందిస్తుంది.
- స్వల్ప స్థాయి కమ్యూనికేషన్ టెర్మినల్ ద్వారా టెక్స్ట్, వీడియో, ఆడియో సమాచారాన్ని పూర్తి భద్రతతో ప్రసారం చేయగల వీశాట్ (వెరీ స్మాల్ అపెర్చర్ టెర్మినల్) సేవలను పొందొచ్చు. బ్యాంకింగ్, మిలటరీ, ఆర్థిక రంగాల్లో వీశాట్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి.

2. ఇస్రో పారిశ్రామిక అనువర్తనాలను చర్చించండి/ పారిశ్రామిక రంగంలో ఇస్రో పాత్రను వివరించండి.

జ. అంతరిక్ష విభాగం ఆధ్వర్యంలో అనేక కేంద్రాలు అభివృద్ధి చేసిన టెక్నాలజీలను, ఉత్పత్తులను బదిలీ చేసి, వాణిజ్య పరంగా వాటి ఉత్పత్తిని ప్రోత్సహించే విధానాన్ని ఇస్రో అమలు చేస్తోంది.

- దేశంలో పరిశ్రమలు.. అంతరిక్ష కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ఈ విధానం దోహదపడుతుంది. దీనికోసం ఇస్రో ఇప్పటికే ఐదు వేలకు పైగా చిన్న, మధ్య, భారీ పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇప్పటి వరకు సుమారు 300 టెక్నాలజీ ఉత్పత్తులను ఇస్రో వివిధ పరిశ్రమలకు బదిలీ చేసింది.
- 268 అంశాలకు సంబంధించిన పేటెంట్ హక్కుల కోసం ఇస్రో దరఖాస్తు చేయగా 137 అంశాలపై హక్కులు లభించాయి. ఇప్పటి వరకు ఇస్రో అభివృద్ధి చేసి, పరిశ్రమలకు అందించిన ముఖ్య టెక్నాలజీ ఉత్పత్తులు..

ఎ. **కెవ్లర్:** ఇది అత్యంత దృఢ పదార్థం. వేడిని బాగా నిరోధిస్తుంది. దీన్ని పీఎస్ఎల్‌వీ మూడో దశ నిర్మాణంలో ఉపయోగించారు. వివిధ పరిశ్రమల్లో అనువర్తనాల కోసం దీన్ని బదిలీ చేశారు. డెంటల్ ఫిల్లింగ్‌లో (దంతాల్లో రంధ్రాలు పూడ్చడానికి), బుల్లెట్ ప్రూఫ్ పదార్థాల తయారీలో వినియోగిస్తారు.

బి. **ఐసోపాలీ ఆయిల్:** ఇది ఉష్ణ బంధక పదార్థం. దీన్ని అంతరిక్ష నౌకల నిర్మాణంలో ఉపయోగిస్తారు. దీనికి అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యం ఉంది. అందువల్ల దీన్ని ఫర్నెస్ నిర్మాణ పరిశ్రమలకు బదిలీ చేశారు.

సి. **అఫ్లెక్స్:** ఇది భారీ మంటలను కూడా స్వల్ప వ్యవధిలో ఆర్పే శక్తి గల పొడి పదార్థం. దీన్ని అగ్నిమాపక పదార్థాల తయారీలో వినియోగిస్తున్నారు.

డి. **అడ్హెసివ్స్:** అంతరిక్ష నౌకలు, ఉపగ్రహాల నిర్మాణంలో నిరంతరం ఉపయోగపడే పదార్థాలు అడ్హెసివ్స్. సీలింగ్, కోటింగ్, ల్యామినేటింగ్ వంటి పారిశ్రామిక చర్యల్లో వీటిని ఉపయోగిస్తున్నారు. ఇస్రో అభివృద్ధి చేసిన ముఖ్య అడ్హెసివ్.. ఈపీవై 1061. ఇనుము, స్టీల్, పాలిమర్ పరిశ్రమల్లో దీని వినియోగం అధికం. అందుకే ఇస్రో దీన్ని పరిశ్రమలకు బదిలీ చేసింది.

ఇ. **బీఎంటీ (బేరియం మెగ్నీషియం టాంటలైట్) సిరామిక్స్:** ఫిల్టర్స్, ఆసిలేటర్స్, మల్టీప్లెక్సర్స్ వంటి కమ్యూనికేషన్ యంత్రాల్లో ఈ రకమైన సిరామిక్స్‌ను అధికంగా వినియోగిస్తారు. అందుకే ఇస్రో వీటిని.. కమ్యూనికేషన్ తయారీ పరిశ్రమలకు బదిలీ చేసింది.

ఎఫ్. **థర్మల్ కంట్రోల్ కోటింగ్:** అంతరిక్ష నౌకలు, ఉపగ్రహాల నిర్మాణంలో అధిక ఉష్ణోగ్రత ప్రభావాన్ని నిరోధించే లక్ష్యంతో థర్మల్ కంట్రోల్ కోటింగ్‌ను వాడతారు. దీన్ని వివిధ రకాల పెయింట్ల రూపంలో ఉత్పత్తి చేస్తారు. ఉదా: క్రోమేటెడ్ అల్యూమినియం, సిల్వర్ ప్లేటెడ్ అల్యూమినియం, నికెల్ ప్లేటెడ్ ఇన్వార్. వీటిని ఇస్రో వివిధ పరిశ్రమలకు బదిలీ చేయడంతోపాటు విదేశాలకు సైతం ఎగుమతి చేస్తోంది.

జి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఇస్రో అనేక టెక్నాలజీలను పరిశ్రమలకు బదిలీ చేసి, దేశీయ పారిశ్రామిక టెక్నాలజీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది. ఇటీవల మల్టీ లేయర్ ప్రింటెడ్ యాంటినా టెక్నాలజీని, డీడీవీ-100 రెసిన్ టెక్నాలజీని ఇస్రో.. పరిశ్రమలకు బదిలీ చేసింది.

హెచ్. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా టెక్నాలజీల బదిలీ కోసం ఇస్రో కొన్ని పరిశ్రమలను ఎంపిక చేసింది. వీటికి సరఫరా చేసే ముఖ్య టెక్నాలజీలు.. డ్యూయల్ పోలరైజేషన్ లిడార్ (లైట్ డిటక్షన్ అండ్ రేంజింగ్), సాలిడ్ స్టేట్ పవర్ ఆంప్లిఫయర్, ఈపీవై 1061, ఎలక్ట్రానిక్ సెన్సర్స్, థర్మల్ సెన్సర్స్ మొదలైనవి.

ఐ. పరిశ్రమలకు, ఆర్ అండ్ డీ సంస్థలకు సాంకేతిక సలహాలను కూడా ఇస్రో అందిస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో కేయూ బ్యాండ్ రిసీవర్లపై గోల్డ్ ప్లేటింగ్, అల్యూమినియం బాక్సులు, మెకానికల్ షాక్ టెస్ట్ వంటి అంశాలపై కొన్ని సేవలను ఇస్రో అందుబాటులోకి తెచ్చింది.

3. భారత అంతరిక్ష కార్యక్రమంలో పీఎస్ఎల్‌వీ పాత్రను విశ్లేషించండి.

జ. ప్రపంచంలోని అత్యంత విజయవంతమైన రాకెట్లలో పీఎస్ఎల్‌వీ ఒకటి. ఉపగ్రహాలను ధృవ కక్ష్యలోకి ప్రవేశపెట్టే లక్ష్యంతో ఇస్రో పీఎస్ఎల్‌వీని రూపొందించింది.

- ఇప్పటి వరకు 40 పీఎస్ఎల్‌వీ ప్రయోగాలను నిర్వహించగా, 1993లో నిర్వహించిన పీఎస్ఎల్‌వీ-డీ1(మొదటి ప్రయోగం) ప్రయోగం మాత్రమే విఫలమైంది. తర్వాత నిర్వహించిన 39 పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు వరుసగా విజయవంతమయ్యాయి.
- 2017 ఫిబ్రవరి 15న నిర్వహించిన పీఎస్ఎల్‌వీ-సీ37 ప్రయోగం ద్వారా ఇస్రో ఒకేసారి 104 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. గతంలో ఏ దేశమూ ఒకే రాకెట్ ద్వారా ఇన్ని ఉపగ్రహాలను ప్రయోగించలేదు. 2014లో రష్యా మాత్రమే ఒకేసారి 37 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఇస్రో అవసరానికి తగ్గట్టు పీఎస్ఎల్‌వీ నిర్మాణంలో మార్పులు చేస్తుండటంతో దాని సమర్థత మరింత పెరిగింది. పీఎస్ఎల్‌వీని ఇప్పటి వరకు మూడు రూపాల్లో అభివృద్ధి చేశారు. దీని ద్వారా ఎన్నో వైవిధ్యభరిత ప్రయోగాలు చేపట్టారు.
- మొదటి కార్యాచరణ ప్రయోగం (పీఎస్ఎల్‌వీ-సీ1)లోనే ఇస్రో బహుళ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఇదే పీఎస్ఎల్‌వీ ద్వారా తొలిసారిగా విదేశీ ఉపగ్రహాలను సైతం ప్రయోగించింది.
- పీఎస్ఎల్‌వీని ధృవ కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రయోగించేందుకు నిర్దేశించినప్పటికీ భూస్థిర, భూ అనువర్తిత కక్ష్యలోకి సైతం ఉపగ్రహాలను మోసుకెళ్లింది. పీఎస్ఎల్‌వీ -సీ4 ద్వారా మెట్‌శాట్ (కల్పన-1), పీఎస్ఎల్‌వీ-సీ17 ద్వారా జీశాట్-12ను భూస్థిర కక్ష్యలోకి ప్రయోగించారు.



- నావిక్ వ్యవస్థలోని ఏడు ఉపగ్రహాల్లో నాలుగింటిని పీఎస్ఎల్‌వీ ద్వారా భూ అనువర్తిత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మరో మూడు ఉపగ్రహాలను భూ స్థిర కక్ష్యలోకి ప్రయోగించారు.
- పీఎస్ఎల్‌వీ ద్వారా చంద్రయాన్-1, మంగళయాన్ వంటి కీలక ప్రయోగాలను విజయవంతం చేశారు. విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడంలో పీఎస్ఎల్‌వీ ప్రపంచ ఖ్యాతి పొందింది. పీఎస్ఎల్‌వీ-సీ38 ప్రయోగంతో కలుపుకొని ఇప్పటి వరకు 257 ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. వీటిలో 48 దేశీయ ఉపగ్రహాలు కాగా 209 విదేశీ ఉపగ్రహాలు కావడం విశేషం.
- అమెరికా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా, యూరోప్, ఆగ్నేయాసియా ప్రాంత ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ప్రయోగించింది. ఫలితంగా కొన్ని వందల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని ఇస్రో ఆర్జించింది. భవిష్యత్‌లో మరిన్ని విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించనుంది. ఈ విధంగా భారత అంతరిక్ష సేవలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంలో ఇస్రో సఫలీకృతమైంది. ఇన్ని ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించినప్పటికీ పీఎస్ఎల్‌వీ పేలోడ్ సామర్థ్యం చాలా తక్కువ. పేలోడ్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు త్వరితగతిన కార్యక్రమాన్ని పూర్తి చేసే సామర్థ్యాన్ని ఇస్రో అభివృద్ధి చేసుకోవాలి. ఇప్పటి వరకు ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో బరువైంది రీశాట్-1. దీని బరువు 1,858 కిలోలు. కనీసం 2,500 నుంచి 3,000 కిలోల బరువున్న ఉపగ్రహాలను మోసుకెళ్లే విధంగా పీఎస్ఎల్‌వీని రూపొందించాలి. ఫలితంగా తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో అధిక సంఖ్యలో ఉపగ్రహాలను ప్రయోగించవచ్చు.



సి.హరికృష్ణ,
డైరెక్టర్,
విన్-విన్ ఐఏఎస్ అకాడమీ.

రామన్ మెగసెసె అవార్డు



విమాన ప్రమాదంలో మరణించిన ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసె పేరిట ఈ అవార్డు నెలకొల్పారు. ఈయన 1953, డిసెంబర్ 30 నుంచి 1957, మార్చి 17 వరకు ఫిలిప్పీన్స్ మూడో అధ్యక్షుడిగా పనిచేశారు. మెగసెసె అవార్డును ఆసియా ఖండం వారికి మాత్రమే ఇస్తారు. అందువల్ల దీన్ని "ఆసియా నోబెల్" బహుమతి అంటారు. ఏటా రామన్ మెగసెసె జయంతి ఆగస్టు 31న ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈ అవార్డును ప్రదానం చేస్తారు. తొలిసారి 1958లో అందజేశారు. 1958 నుంచి 2008 వరకు ఐదు విభాగాల్లో ఈ పురస్కారం అందజేసేవారు. అవి..

1. ప్రభుత్వ సేవ
2. ప్రజాసేవ
3. సామాజిక నాయకత్వం
4. జర్నలిజం, సాహిత్యం, సృజనాత్మక కళలు
5. శాంతి, అంతర్జాతీయ అవగాహన

- 2001లో 'ఎమర్జెంట్ లీడర్‌షిప్' అనే ఆరో విభాగాన్ని ప్రవేశపెట్టారు. అయితే 2009 నుంచి పైన పేర్కొన్న ఐదు విభాగాలనూ రద్దుచేసి కేవలం ఎమర్జెంట్ లీడర్‌షిప్, అన్‌కేటగరైజ్డ్ అనే రెండు విభాగాల్లోనే ఈ పురస్కారం అందిస్తున్నారు.
- రామన్ మెగసెసె పురస్కారం పొందిన తొలి భారతీయుడు ఆచార్య వినోబా భావే. ఈయనకు 1958లో సామాజిక నాయకత్వ విభాగంలో ఈ అవార్డు దక్కింది.

కాంపిటీటివ్ గైడెన్స్
జీకే అండ్ కరెంట్ అఫైర్స్

2017 విజేతలు:

- 2017 సంవత్సరానికిగాను రామన్ మెగసెసె పురస్కారానికి అయిదుగురు వ్యక్తులు, ఒక సంస్థను ఎంపికచేశారు. వీరిలో భారతీయులెవరూ లేరు.

1. **యోషియాకీ ఇషిజావా:** జపాన్‌కు చెందిన ప్రముఖ చరిత్రకారుడు. ఈయన కాంబోడియాలోని ప్రఖ్యాత ఆంగ్‌కోర్‌వాట్ ఆలయం పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేశాడు.
2. **గెథ్సీ షణ్ముగం:** శ్రీలంకకు చెందిన ఉపాధ్యాయురాలు. యుద్ధ బాధితులు, నిర్వాసితుల సహాయార్థం విశేష కృషి చేశారు.
3. **లిలియా డి లిమా:** ఈమె ఫిలిప్పీన్ ఎకనామిక్ జోన్ అథారిటీ (పీఈజెడ్ఏ) తొలి డైరెక్టర్ జనరల్. ఈమె కృషి వల్లే ఫిలిప్పీన్స్‌లో వందలాది ఆర్థిక మండళ్లు ఏర్పడ్డాయి. ఇవి ఆ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డాయి.
4. **అబ్దోన్ నబాబన్:** ఈయన ఇండోనేషియాలోని సుమత్రా దీవికి చెందిన వ్యక్తి. 'ఇండీజినస్ పీపుల్స్ అలయన్స్ ఆఫ్ ది ఆర్కిపెలాగో' అనే సంస్థను ఏర్పాటు చేసి స్థానికుల హక్కులకు పోరాడుతున్నారు.
5. **టోనీ టే:** సింగపూర్‌కు చెందిన టోనీ టే నిరుపేద కుటుంబంలో జన్మించారు. స్వయంకృషితో ఎదిగారు. పేదల ఆకలి తీర్చడానికి 2003లో 'విల్లింగ్ హార్ట్స్' అనే లాభాపేక్షలేని సంస్థను ప్రారంభించారు. గత 14 ఏళ్ల నుంచి రోజూ వందలాది పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్నారు. ప్రస్తుతం రోజూ దాదాపు ఆరువేల మంది ఆకలి తీరుస్తున్నారు.
6. **ఫిలిప్పీన్ ఎడ్యుకేషన్ థియేటర్ అసోసియేషన్:** ఫిలిప్పీన్స్‌కు చెందిన 'ఫిలిప్పీన్ ఎడ్యుకేషనల్ థియేటర్ అసోసియేషన్ (పెటా)' అనే లాభాపేక్షలేని సంస్థ 50 ఏళ్ల కిందట ఏర్పాటైంది. సామాజిక మార్పులో థియేటర్ కళలకున్న ప్రాముఖ్యతకు గుర్తింపుగా 'పెటా'కు ఈ ఏడాది రామన్ మెగసెసె పురస్కారం దక్కింది.



ఎన్.విజయేందర్‌రెడ్డి
జనరల్ అవేర్‌నెస్
సీనియర్ ఫ్యాకల్టీ

భారతీయ విజేతలు

సంవత్సరం	పేరు	విభాగం
1958	ఆచార్య వినోబా భావే	సామాజిక నాయకత్వం
1959	సి.డి.దేశ్‌ముఖ్	ప్రభుత్వ సేవ
1961	అమితభ చౌదురి	జర్నలిజం
1962	మదర్ థెరిస్సా	శాంతి, అంతర్జాతీయ అవగాహన
1963	దారా ఖురోడి	సామాజిక నాయకత్వం
1963	వర్గీస్ కురియన్	సామాజిక నాయకత్వం
1963	త్రిభువన్‌దాస్ పటేల్	సామాజిక నాయకత్వం
1964	వెల్తీ ఫిషర్	శాంతి, అంతర్జాతీయ అవగాహన
1965	జయప్రకాశ్ నారాయణ్	ప్రజాసేవ
1966	కమలాదేవి ఛటోపాధ్యాయ	సామాజిక నాయకత్వం
1967	సత్యజిత్ రే	సృజనాత్మక కళలు
1971	ఎం.ఎస్.స్వామినాథన్	సామాజిక నాయకత్వం
1974	ఎం.ఎస్.సుబ్బులక్ష్మి	ప్రజాసేవ
1975	జార్జ్ వర్గీస్	జర్నలిజం
1976	హెన్నింగ్ హోక్ లార్సెన్	శాంతి, అంతర్జాతీయ అవగాహన
1976	శంభుమిత్ర	సృజనాత్మక కళలు
1977	ఇలాభట్	సామాజిక నాయకత్వం
1979	మాబెల్ అరోల్	సామాజిక నాయకత్వం
1979	రజనీకాంత్ అరోల్	సామాజిక నాయకత్వం
1981	గౌర్ కిశోర్ ఘోష్	జర్నలిజం
1981	ప్రమోద్ కరణ్ సేథి	సామాజిక నాయకత్వం
1982	చాందీ ప్రసాద్ భట్	సామాజిక నాయకత్వం
1982	మణిభాయ్ దేశాయ్	ప్రజాసేవ
1982	అరుణ్‌శౌరి	జర్నలిజం
1984	ఆర్.కె.లక్ష్మణ్	సాహిత్యం
1985	బాబా ఆమ్టే	ప్రజాసేవ
1989	లక్ష్మీచంద్ జైన్	ప్రజాసేవ
1991	కె.వి.సుబ్బన్న	జర్నలిజం
1992	రవి శంకర్	సృజనాత్మక కళలు
1993	జహంగీర్ కోయాజీ	ప్రజాసేవ
1994	కిరణ్‌బేడి	ప్రభుత్వ సేవ
1996	పాండురంగ అథవాలె	సామాజిక నాయకత్వం
1996	టి.ఎన్.శేషన్	ప్రభుత్వ సేవ
1997	మహాశ్వేతాదేవి	సాహిత్యం
1997	మహేశ్ చంద్ర మెహతా	ప్రజాసేవ
2000	జోకిన్ అర్పుతం	శాంతి, అంతర్జాతీయ అవగాహన
2000	అరుణారాయ్	సామాజిక నాయకత్వం
2001	రాజేంద్రసింగ్	సామాజిక నాయకత్వం
2002	సందీప్ పాండే	ఎమర్జెంట్ లీడర్‌షిప్
2003	జేఎం లింగ్డో	ప్రభుత్వ సేవ
2003	శాంతాసిన్హా	సామాజిక నాయకత్వం
2004	లక్ష్మీనారాయణ్ రాందాస్	శాంతి, అంతర్జాతీయ అవగాహన
2005	వి.శాంత	ప్రజాసేవ
2006	అరవింద్ కేజ్రీవాల్	ఎమర్జెంట్ లీడర్‌షిప్
2007	పాలగుమ్మి సాయినాథ్	జర్నలిజం
2008	ప్రకాశ్ ఆమ్టే	సామాజిక నాయకత్వం
2008	మందాకినీ ఆమ్టే	సామాజిక నాయకత్వం
2009	దీప్ జోషి	-
2011	నీలిమా మిశ్రా	ఎమర్జెంట్ లీడర్‌షిప్
2011	హరీష్ హండే	-
2012	కులందీ ఫ్రాన్సిస్	-
2015	అన్షుగుప్తా	-
2015	సంజీవ్ చతుర్వేది	ఎమర్జెంట్ లీడర్‌షిప్
2016	బెజవాడ విల్సన్	సామాజిక నాయకత్వం
2016	టి.ఎం.కృష్ణ	ఎమర్జెంట్ లీడర్‌షిప్

బులెటిన్ బోర్డ్

కువెంపు యూనివర్సిటీలో పీహెచ్‌డీ

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా శంకరఘట్టలో ఉన్న కువెంపు యూనివర్సిటీ.. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

- **కోర్సు పేరు:** పీహెచ్‌డీ.
- **విభాగాలు:** కన్నడ, ఇంగ్లిష్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఎకనమిక్స్, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషల్ వర్క్, కామర్స్, ఎంబీఏ, ఎంటీఏ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, అప్లైడ్ బోటనీ, జువాలజీ, బయోకెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, ఎంసీఏ అండ్ కంప్యూటర్ సైన్స్, వైల్డ్‌లైఫ్ అండ్ మేనేజ్‌మెంట్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, అప్లైడ్ జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత. ఎస్సీ/ఎస్టీ/సీఏటీ-1 అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు.
- **ఎంపిక విధానం:** ఎంట్రెన్స్ టెస్ట్.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/సీఏటీ-1 అభ్యర్థులకు రూ.750.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** ఆగస్టు 19, 2017.
- **వెబ్‌సైట్:** www.kuvempu.ac.in

ఐఐటీటీఎంలో ఎంబీఏ (టీటీఎం), బీబీఏ (టీటీ)

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటీటీఎం).. ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్-టీటీఎం), బీబీఏ (టూరిజం అండ్ ట్రావెల్-టీటీ) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఐఐటీటీఎంకు గ్వాలియర్‌తోపాటు నోయిడా, భువనేశ్వర్, నెల్లూరులో శాఖలు ఉన్నాయి.

- **కోర్సుల పేరు:** ఎంబీఏ (టీటీఎం), బీబీఏ(టీటీ).
- **కోర్సు వ్యవధి:** ఎంబీఏ (టీటీఎం)-రెండేళ్లు, బీబీఏ (టీటీ)-మూడేళ్లు.
- **అర్హతలు:** ఎంబీఏ (టీటీఎం)కు ఏదైనా డిగ్రీతోపాటు క్యాట్/మ్యాట్/సీమ్యాట్/జీమ్యాట్/ఎక్స్ఏటీ/ఏటీఎంఏ స్కోర్ కార్డ్ (2016, మే 1 నుంచి 31 ఏప్రిల్ 2017 మధ్య ఉత్తీర్ణులై ఉండాలి); బీబీఏ (టీటీ)కి ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన విద్యార్హత చాలు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.500.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని, వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, డీడీ, ఫొటోలు జతచేసి కవరులో ఉంచి గ్వాలియర్/నోయిడా/భువనేశ్వర్/నెల్లూరులోని ఐఐటీటీఎం శాఖల కార్యాలయాలకు గడువులోగా చేరేలా పోస్టులో పంపాలి. లేదా నేరుగా అయినా అందించవచ్చు.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** ఆగస్టు 14, 2017.
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

సీఎస్ఎంసీఆర్ఐలో 10 'సైంటిస్ట్' పోస్టులు



గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఉన్న సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ).. 10 'సైంటిస్ట్' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు-ఖాళీలు:** సైంటిస్ట్/సీనియర్ సైంటిస్ట్-10
- **వేతనం:** సీనియర్ సైంటిస్ట్‌కు రూ.91,564; సైంటిస్ట్‌కు రూ.79,190.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ. తగినంత ఉద్యోగానుభవం.
- **వయోపరిమితి:** 2017, సెప్టెంబర్ 29 నాటికి సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు, సైంటిస్ట్‌కు 32 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 29, 2017.
- **వెబ్‌సైట్:** www.csmcri.org

ప్రతి వారం మీ భవిత మెయిన్ పేజీల్లో...

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
10+2/గ్రాడ్యుయేట్ స్పెషల్	ఇంజనీరింగ్/ ఎంబీఏ స్పెషల్	జాబ్ పాయింట్	కెరీర్ గైడెన్స్/ టెక్నాలజీ స్పెషల్	ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్	యూత్ స్టోరీ/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్)	జాబ్ స్కిల్స్/ గెస్ట్ కాలమ్
గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం



గ్రాడ్యుయేట్స్ స్పెషల్

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2017 ప్రిలిమినరీ ఫలితాలు విడుదలయ్యాయి. మెయిన్ ఎగ్జామినేషన్ ప్రక్రియ అక్టోబర్ 28 నుంచి ప్రారంభం కానుంది. ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్స్‌కు అర్హత పొందిన అభ్యర్థులు.. ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా ప్రిపరేషన్ సాగించి, విజయాన్ని సొంతం చేసుకోవచ్చు. మెయిన్స్‌కు ఇంకా 82 రోజులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో సక్సెస్ సాధించేందుకు విజేతలు, నిపుణుల సలహాలు, సూచనలు..



సివిల్స్ మెయిన్స్..
మెరిసేందుకు మార్గాలు..

ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత



సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత చెదరకుండా చదవడాన్ని అలవరచుకోవాలి. సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ప్రిపరేషన్ కొనసాగించాలి. రోజూ ఆయా సబ్జెక్టులను చదివే సమయంలో.. ఎలాంటి అవాంతరాలు లేకుండా చూసుకోవాలి. సబ్జెక్టుకు సంబంధించి సిలబస్‌లో పేర్కొన్న అంశాలన్నింటినీ చదువుతూ.. ముఖ్యమైన పాయింట్లను నోట్స్ రూపంలో రాసుకోవాలి. ఇది రివిజన్ సమయంలో టైమ్ మేనేజ్‌మెంట్ పరంగా ఎంతో ఉపయోగపడుతుంది. కాంటెంపరరీ అంశాలకు ప్రాధాన్యమిస్తూ వాటిని కోర్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. తద్వారా జనరల్ స్టడీస్ పేపర్లకు అత్యున్నతంగా సమాధానాలు రాయడానికి వీలవుతుంది. రోజూ అన్ని పేపర్లకు సంబంధించిన సబ్జెక్టులను చదివే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

– ఎం.మనుచౌదరి, సివిల్స్–2016 విజేత (36వ ర్యాంకు).

రైటింగ్ ప్రాక్టీస్ కీలకం



సివిల్స్ మెయిన్స్‌లో సమాధానాల ప్రజెంటేషన్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుబాటులో ఉన్న వ్యవధిలోనే సదరు ప్రశ్నకు సంబంధించి ముఖ్యాంశాలను రాయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని, అభ్యర్థులు రోజూ ప్రిపరేషన్‌తో పాటు రైటింగ్ ప్రాక్టీస్ కూడా చేయాలి. ఇది శాస్త్రీయంగా ఉండాలి. నిపుణులు రూపొందించిన ఒక ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేసుకుని మూడు గంటల వ్యవధిలో సొంతంగా సమాధానాలు రాయాలి. ఫలితంగా టైం మేనేజ్‌మెంట్‌పై అవగాహన ఏర్పడుతుంది. మెరుగుపరచుకోవాల్సిన అంశాలేంటనే దానిపైనా స్పష్టత ఏర్పడుతుంది. రోజూ ఒక మాక్‌టెస్ట్‌కు 3 గంటలు కేటాయించడం కష్టం కాబట్టి, కనీసం ఒక పేపర్‌కు సంబంధించి ఆ రోజు చదివిన అంశానికి చెందిన ప్రశ్నకు పరీక్షలో లభించే సమయం లోపు సమాధానాలు రాసి, స్వీయ విశ్లేషణ చేసుకోవాలి.

– పవన్ సమీర్, సివిల్స్–2016 విజేత (142వ ర్యాంకు).

కాన్సెప్ట్ ఓరియెంటేషన్



ప్రిపరేషన్‌లో భాగంగా సిలబస్‌లోని అంశాలకు సంబంధించి బేసిక్స్, కాన్సెప్ట్స్, నేపథ్యంపై తొలుత అవగాహన పెంపొందించుకోవాలి. ముఖ్యంగా జనరల్ స్టడీస్, జనరల్ ఎస్సే విషయంలో ఈ దృక్పథం ఎంతో అవసరం. జనరల్ ఎస్సే.. కోర్, కాంటెంపరరీ అంశాల సమ్మిళితంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రిపరేషన్ కొనసాగించాలి. ప్రిపరేషన్ సమయంలోనే రివిజన్‌కు ఉపకరించే విధంగా షార్ట్ నోట్స్, పాయింటర్స్, గ్రాఫికల్ మెథడ్స్ వంటి షార్ట్‌కట్ టూల్స్‌ను అనుసరించాలి.

– పి.అన్వేష రెడ్డి, సివిల్స్–2016, 80వ ర్యాంకు.

ఆప్షనల్‌కు ప్రత్యేక సమయం



మెయిన్స్‌కు ప్రిపరేషన్‌లో ఆప్షనల్ సబ్జెక్టుకు ప్రత్యేకంగా సమయం కేటాయించడం చాలా అవసరం. అకడమిక్ నేపథ్యానికి సంబంధం లేని ఆప్షనల్‌ను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు.. ముందుగా సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. వాటిలో తమకు అనుకూలంగా, సులువుగా ఉండే అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. అంతే కాకుండా ఆప్షనల్‌కు సంబంధించిన అంశాలను సమకాలీన అంశాలతో సమ్మిళితం చేసుకుంటూ అధ్యయనం చేయాలి. కొన్ని ఆప్షనల్స్ సిలబస్ కొంత విస్తృతంగా ఉంటుంది. గత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా సదరు ఆప్షనల్‌కు సంబంధించి అధిక వెయిటేజీ లభిస్తున్న అంశాలను గుర్తించవచ్చు. వీటికి కొంచెం ఎక్కువ సమయం వెచ్చించి, ప్రిపరేషన్ కొనసాగించడం మేలు చేస్తుంది.

– ఎస్.మాధవి, సివిల్స్–2016, 104వ ర్యాంకు.

జీఎస్‌పై ప్రత్యేక దృష్టి



జనరల్ స్టడీస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రిపరేషన్ సాగించడం ఎంతో మేలు చేస్తుంది. గత మెయిన్స్ జీఎస్ పేపర్లను విశ్లేషిస్తే.. ఒక అంశంపై అన్నికోణాల్లో నైపుణ్యం ఉంటేనే సమాధానం ఇవ్వగలిగే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన అంశాలను కూడా కోర్ అంశాలతో కలిపి అడిగే ధోరణి కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని, తాజా పరిణామాలను పరిశీలిస్తూ.. వాటిని కోర్ సిలబస్‌తో అన్వయించుకుంటూ అధ్యయనం చేయాలి. పాలిటీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ సబ్జెక్టులను ఆప్షనల్‌గా తీసుకున్న వారికి సైతం ఈ తరహా ప్రిపరేషన్ ఎంతో కలిసొస్తుంది. అభ్యర్థులు సెప్టెంబర్ చివరినాటికి ప్రిపరేషన్ పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ తర్వాత అందుబాటులో ఉన్న సమయాన్ని రివిజన్‌కు కేటాయించాలి. పరీక్షకు ముందు వారం రోజుల్లో జనరల్ ఎస్సే, జీఎస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం మేలు చేస్తుంది.

– వి.గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ.

విశ్లేషణ సామర్థ్యం



మెయిన్స్‌కు ప్రిపరేషన్ కొనసాగిస్తున్న అభ్యర్థులు విశ్లేషణ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. జనరల్ స్టడీస్‌లోని ఎథిక్స్ అండ్ ఇంటెగ్రిటీ పేపర్‌కు సంబంధించిన ప్రశ్నలకు.. ఒక సివిల్ సర్వీస్ అధికారికి ఉండాల్సిన పాలనా దక్షతను ప్రతిబింబించేలా సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి. డెసిషన్ మేకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.

– ఆర్.సి.రెడ్డి, డైరెక్టర్, ఆర్.సి.రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్.

అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యమిస్తూ..



అభ్యర్థులు అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ సాగించడం వల్ల కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అడిగే ఎస్సే ప్రశ్నలకు సమాధానాలను సులువుగా రాసే సామర్థ్యం లభిస్తుంది. జీఎస్ పేపర్లు, ఆప్షనల్ పేపర్‌కు అప్లికేషన్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ కొనసాగించాలి. ఒక అంశాన్ని విశ్లేషించగలిగే నైపుణ్యం కూడా సొంతం చేసుకోవాలి. ఆప్షనల్ పేపర్‌కు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా సిలబస్‌ను, పాత ప్రశ్నపత్రాలను పరిశీలించి.. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు? వాటి ద్వారా ఎలాంటి నైపుణ్యాలను పరీక్షిస్తున్నారు? అనే అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. అందుకు అనుగుణంగా ప్రిపరేషన్‌ను మలచుకోవాలి.

– శ్రీరామ్, డైరెక్టర్, శ్రీరామ్స్ ఐఏఎస్ అకాడమీ.

మెయిన్స్‌కు దృష్టి పెట్టాల్సిన కొన్ని అంశాలు

- భారత్ – చైనా మధ్య నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు.
- అమెరికా కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు.. భారత్‌పై వాటి ప్రభావం.
- భారత రాష్ట్రపతి ఎన్నికల విధానం.
- ఇస్రో సరికొత్త ప్రయోగాలు – అంతర్జాతీయ రికార్డులు.
- కేంద్ర ప్రభుత్వ తాజా పథకాలు.
- జీఎస్‌టీతో లాభ నష్టాల బేరీజు.
- ఇటీవల కాలంలో పలు దేశాలతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక ఒప్పందాలు.. వాటి ప్రయోజనాలు.
- అంతర్జాతీయ సదస్సులు, తీర్మానాలు – భారత్‌పై వాటి ప్రభావం.
- ఇటీవల కాలంలో జరిగిన రాజ్యాంగ సవరణలు – వాటి ఉద్దేశాలు.



బ్యాంకు పీవో..

కెరీర్ గైడెన్స్



ఆన్‌లైన్ పరీక్షలు.. వేగంగా పూర్తయ్యే రిక్రూట్‌మెంట్ పిక్రియ.. ఆకర్షణీయ వేతనాలు.. కెరీర్‌లో చకచకా ఎదిగేందుకు అవకాశం.. ఇవే ఇప్పుడు యువతను బ్యాంకింగ్ రంగం వైపు ఆకర్షితులయ్యేలా చేస్తున్నాయి. బ్యాంకింగ్ కార్యకలాపాల విస్తృతితో ఈ రంగంలో అపార అవకాశాలు తలుపుతడుతున్నాయి. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్ (ఐబీపీఎస్), ఎస్‌బీఐ, ప్రైవేటు బ్యాంకులు ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తున్నాయి. ఇవి భర్తీచేసే ఉద్యోగాల్లో ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) ముఖ్యమైంది. బ్యాంకింగ్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం కల్పిస్తున్న పీవో కెరీర్‌పై ఫోకస్..

పీవోగా కెరీర్ ప్రారంభించినవారు అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యున్నత పదవి చైర్మన్/చైర్‌పర్సన్ స్థాయికి చేరుకునే సువర్ణ అవకాశముంది. ఇందుకు ఎస్‌బీఐ చైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య చక్కటి ఉదాహరణ. పీవోగా కెరీర్ ప్రారంభించిన ఆమె అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ చైర్‌పర్సన్ స్థాయికి ఎదిగారు.

పీవోకు మార్గాలు

బ్యాంకుల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎలాంటి అనుభవం లేకుండా లభించే ఉన్నత పోస్టు పీవో. ఎస్‌బీఐ మినహా ప్రభుత్వ రంగ జాతీయ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)ల్లో పీవో పోస్టుల భర్తీని ఐబీపీఎస్ చేపడుతుంది. ఎస్‌బీఐ.. పీవో పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. ప్రైవేటు బ్యాంకులు పీవోల ఎంపిక కోసం డీమ్డ్ యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకొని పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లు ఆఫర్ చేస్తున్నాయి.

ఎంపిక విధానం

ఐబీపీఎస్, ఎస్‌బీఐ పీవో పోస్టుల భర్తీకి అనుసరిస్తున్న విధానాల్లో కొంత వ్యత్యాసం ఉంటోంది. సాధారణంగా ఆన్‌లైన్ పరీక్ష (ప్రిలిమ్స్, మెయిన్ పరీక్ష), ఇంటర్వ్యూలో చూపే ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. అయితే ఎస్‌బీఐ పీవో ఎంపికలో మెయిన్ పరీక్షలో భాగంగా డిస్క్రిప్టివ్ ఎగ్జామ్, తర్వాత జీడీ, ఇంటర్వ్యూ ఉంటాయి.

ఎస్‌బీఐ, ఐబీపీఎస్ పీవో పరీక్ష-ప్రిలిమినరీ (60 నిమిషాలు)

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	35	35
రీజనింగ్ ఎబిలిటీ	35	35
మొత్తం	100	100

వడపోతకు ప్రిలిమ్స్

బ్యాంకు పీవో ఉద్యోగాలకు లక్షల దరఖాస్తులు వస్తుంటాయి. వీరిలో నుంచి ప్రతిభ ఉన్న వారిని ఎంపిక చేయడానికి ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో విజయం సాధించిన వారికి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ పరీక్ష విధానంలో ఇటీవల కాలంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గతంకంటే భిన్నంగా సెక్షన్ వారిగా సమయం కేటాయించడం వాటిలో ముఖ్యమైంది.

వేతన వివరాలు

- ఎస్‌బీఐ పీవోగా జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్–1 హోదాలో ప్రవేశించిన అభ్యర్థుల మూల వేతనం నెలకు రూ.27,620గా ఉంటుంది. వీటితో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ, మెడికల్ అలవెన్స్ తదితరాలన్నీ కలిపి పనిచేసే ప్రాంతం ఆధారంగా సంవత్సరానికి కనిష్టంగా రూ.7.93 లక్షలు, గరిష్టంగా రూ.12.95 లక్షలు లభిస్తాయి. పీవోగా ఎంపికైన వారికి తొలుత రెండేళ్ల శిక్షణ ఉంటుంది. మెరుగైన ప్రతిభ చూపితే నేరుగా మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్–2 కేడర్ సొంతం చేసుకోవచ్చు. పరీక్షలో అర్హత సాధించి, 'మిడిల్ మేనేజ్‌మెంట్' ప్రమాణాలను అందుకోని వారికి జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్–1 కేటాయిస్తారు.
- ఐబీపీఎస్ ద్వారా పీవో ఉద్యోగాలు పొందిన వారికి ఎస్‌బీఐతో పోల్చితే తక్కువ వేతనాలు ఉంటాయి.

పీవో కెరీర్ గ్రాఫ్

ప్రతి స్కేల్‌కు పదోన్నతి లభించేందుకు మూడు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుంది. పదోన్నతి ఇచ్చే క్రమంలో ఆయా బ్యాంకులు అంతర్గత పరీక్షలు నిర్వహిస్తాయి. వీటిలో చూపే ప్రతిభ ఆధారంగా పదోన్నతులు ఉంటాయి. ప్రతిభ కనబరుస్తూ పనిచేసే వారు జనరల్ మేనేజర్ స్థాయి వరకు చేరుకుంటారు. కెరీర్ పరంగా విధుల నిర్వహణలో అసాధారణ ప్రతిభ చూపడం ద్వారా టాప్ ఎగ్జిక్యూటివ్ గ్రేడ్ హోదాలను సొంతం చేసుకోవచ్చు.

టాప్ ఎగ్జిక్యూటివ్ గ్రేడ్‌లో లభించే హోదాలు: చీఫ్ జనరల్ మేనేజర్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్, చైర్ పర్సన్.

ఉన్నత విద్య ప్రక్షాళనకు..
హీరా!

ఎడ్యూ ట్రెండ్స్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. ఇక కనుమరుగు కానుందా? ఏఐసీటీఈ.. అనే మాట భవిష్యత్తులో వినపడదా..? అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది. కారణం.. Higher Education Empowerment Regulation Agency (HEERA-హీరా) పేరుతో దేశంలోని రెండు ప్రధాన విద్యా నియంత్రణ సంస్థల (యూజీసీ, ఏఐసీటీఈ) స్థానంలో ఒకే వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ యోచనే. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఉమ్మడి నియంత్రణ వ్యవస్థ రూపకల్పన దిశగా అడుగులు పడుతున్న తరుణంలో.. 'హీరా'పై విశ్లేషణ..

దేశంలో ఉన్నతవిద్య పరంగా పలు రకాల నియంత్రణ వ్యవస్థలు.. ఒక్కోదాని పరిధిలో ఒక్కో కోర్సు. ఇదే క్రమంలో యూజీసీ.. ఏఐసీటీఈ. మిగతా నియంత్రణ వ్యవస్థలు (ఎంసీఐ, పీసీఐ, బీసీఐ తదితర) పరంగా... ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. యూజీసీ, ఏఐసీటీఈల మధ్య నిరంతరం ఏదో ఒక సమస్య. దీనికి పరిష్కారంగా నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వ్యవస్థే 'హీరా'.

ఒకే గొడుగు కిందకు అన్ని సంస్థలు

హీరా ప్రధాన ఉద్దేశం.. దేశంలోని సాంకేతిక, సంప్రదాయ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలు అన్నీ.. ఇకపై ఒకే నియంత్రణ వ్యవస్థకు జవాబుదారీగా ఉండటం. అదే విధంగా యూనివర్సిటీలకు అనుమతుల నుంచి ప్రమాణాలు, నైపుణ్యాల పెంపు వరకు ప్రతి అంశాన్ని హీరా పేరిట ఏర్పడనున్న కమిటీ పర్యవేక్షిస్తుంది. ఫలితంగా ఇప్పుడు ఒకే యూనివర్సిటీలో అమలవుతున్న పలు కోర్సులకు ఇటు ఏఐసీటీఈ, అటు యూజీసీ అనుమతులు తీసుకోవడమనే భారం తొలగనుంది. ఉదాహరణకు ఒక యూనివర్సిటీ పరిధిలో ఒక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పాలనుకుంటే ముందుగా ఇటు ఏఐసీటీఈకి, మరోవైపు సంబంధిత యూనివర్సిటీకి రెండింటికీ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలి. దీంతో వివిధ సందర్భాల్లో గందరగోళం నెలకొంటోంది. ఈ క్రమంలోనే యూజీసీ, ఏఐసీటీఈ మధ్య కొంత ఆధిపత్య పోరు జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటివాటికి అడ్డుకట్ట వేసేందుకు.. అన్ని యూనివర్సిటీలు, కోర్సులను ఒకే నియంత్రణ వ్యవస్థ పరిధిలోకి తెచ్చేవిధంగా హీరాకు అంకురార్పణ జరిగింది.

ఒకే వ్యవస్థపై ఎన్నో ఏళ్లుగా..

వాస్తవానికి దేశంలో అన్ని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లకు యూజీసీ, ఏఐసీటీఈల స్థానంలో ఒకే నియంత్రణ వ్యవస్థను నెలకొల్పాలనే ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా వినిపిస్తున్నాయి. గతంలో యశ్‌పాల్ కమిటీ, నేషనల్ నాలెడ్జ్ కమిషన్ ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ప్రస్తుతం తాజాగా హరిగౌతమ్ కమిటీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. దీంతో నీతి ఆయోగ్ ఆ సిఫార్సుల అమలు సాధ్యాసాధ్యాల పరిశీలన బాధ్యతలను తీసుకొని.. పలు సంప్రదింపుల తర్వాత తుది నిర్ణయానికి వచ్చి 'హీరా' పేరుతో ఒకే నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది.

వ్యవస్థల వైఫల్యాలు కూడా కారణం

హీరా పేరుతో ఒకే నియంత్రణ వ్యవస్థను తీసుకురావడంలో ఇప్పటికే ఉన్న నియంత్రణ వ్యవస్థలు యూజీసీ, ఏఐసీటీఈలు బాధ్యతలు నిర్వర్తించడంలో వైఫల్యం చెందడం కూడా మరో ముఖ్య కారణమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ రెండు సంస్థలు.. యూనివర్సిటీలు, కళాశాలలకు అనుమతులిచ్చేందుకే పరిమితమవుతున్నాయని.. ఆ తర్వాత వాటిపై కన్నెత్తి కూడా చూడటం లేదని, నిరంతర పర్యవేక్షణ సాగించడం లేదని, ఫలితంగా విద్యార్థులు నిపుణులుగా రూపొందలేకపోతున్నారనే వాదనలు కొన్నేళ్లుగా బలంగా వినిపిస్తున్నాయి. ఉదాహరణకు సాంకేతిక సంస్థల ఏర్పాటు, అనుమతులు, ఇతర పర్యవేక్షణాధికారాలున్న ఏఐసీటీఈనే పరిగణనలోకి తీసుకుంటే ఇంజనీరింగ్ కోర్సులు పూర్తిచేస్తున్న విద్యార్థుల్లో దాదాపు 70 శాతం మందిలో ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు ఉండట్లేదు. దీనికి ప్రధాన కారణం అనుమతుల జారీకే పరిమితమవుతున్న ఏఐసీటీఈ, తర్వాత కాలంలో వాటిపై నిరంతర పర్యవేక్షణ సాగించకపోవడమే అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

యూజీసీది కూడా ఇదే తీరు

యూజీసీ.. తన బాధ్యతలను నిర్వర్తించడంలో ఘోరంగా విఫలమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వడం వరకే పరిమితమవుతూ ఆపై వాటిపై నిరంతర పర్యవేక్షణలో వైఫల్యం చెందిందనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా ఆయా యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల లేమి, ఇతర సమస్యల కారణంగా పరిశోధనలు జరగకపోవడం, పర్యవసానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి యూనివర్సిటీలు ఆశించిన రీతిలో నిధులు పొందలేకపోతున్నాయని.. ఫలితంగా కొన్ని మూతపడే స్థితికి చేరుకున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఇటీవల కాలంలో ఇబ్బడిముబ్బడిగా ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీలకు అనుమతులిస్తున్న యూజీసీ.. వాటి ఏర్పాటు తర్వాత కన్నెత్తి చూడకపోవడం, ఫలితంగా ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఉండే ఈ యూనివర్సిటీలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయనే వాదన వినిపిస్తోంది.

ప్రొఫెషనల్ విద్యార్థులకు మేలు

హీరా పేరుతో విద్యాసంస్థలపై ఒకే నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ప్రధానంగా ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు మేలు చేయనుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అన్ని రంగాలకు చెందిన నిపుణులు ఉండే హీరాలో.. ఆయా కోర్సులకు సంబంధించి తీసుకోవాల్సిన ప్రమాణాలు, చేపట్టాల్సిన తాజా చర్యలపై నిరంతరం సమీక్షించే అవకాశం కలుగుతుంది. వాస్తవానికి ఏఐసీటీఈ, యూజీసీలు వైఫల్యం చెందడానికి మరో కారణం.. ఈ రెండు సంస్థల్లోనూ పలు నేపథ్యాలున్న వారు సభ్యులుగా ఉండటం, వారిలో కొందరికి అకడమిక్ సంబంధిత అంశాలపై అవగాహన లేకపోవడమేనని హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పేర్కొన్నారు. యూజీసీ ఏదైనా చర్యను తీసుకోవాలంటే దానికి సంబంధించిన అకడమిక్ ఫ్యాకల్టీ సభ్యులుగా సబ్ కమిటీలను ఏర్పాటు చేసి, వాటి నివేదికలు – సిఫార్సుల ఆధారంగా చర్యలు తీసుకుంటారు. దీనివల్ల అనవసర జాప్యం తలెత్తుతోంది. హీరాతో ఆ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

న్యాక్, ఎన్‌బీఏలు.. నామమాత్రమే

యూజీసీ, ఏఐసీటీఈ.. తమ పరిధిలోని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో అనుసరిస్తున్న ప్రమాణాలు, చేపట్టాల్సిన సంస్కరణలపై సిఫార్సులు చేసేందుకు న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కమిటీ), ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్)లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినప్పటికీ.. వాటి పనితీరు నామమాత్రంగా మిగిలిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ రెండు కమిటీలు.. ఆయా కళాశాలలకు తనిఖీలకు నిపుణులను పంపే క్రమంలో శాశ్వత ప్రాతిపదికన సంబంధిత అకడమీషియన్స్ లేకపోవడం. ఈ కారణంగా వేర్వేరు ప్రాంతాలకు చెందిన విద్యావేత్తలను ఇన్‌స్పెక్షన్ కమిటీల్లో తాత్కాలికంగా నియమించడం, వాటి ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఇన్‌స్టిట్యూట్‌లలో జవాబుదారీతనం తగ్గుతోంది.

ఈ ఏడాది చివరికి ప్రారంభం?

ఇప్పటికే హీరాకు సంబంధించిన విధివిధానాలతో నివేదిక రూపొందిన నేపథ్యంలో ఈ ఏడాది చివరికి ప్రారంభించేలా ఎంహెచ్‌ఆర్‌డీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2018–19 విద్యా సంవత్సరానికి కొత్త ఇన్‌స్టిట్యూట్‌ల అనుమతుల మంజూరు కూడా హీరా నేతృత్వంలోనే జరిగేలా చర్యలు ఊపందుకున్నట్లు సమాచారం.

ఆహ్వానించదగ్గ పరిణామం

ఒకే నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలనుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. దీనివల్ల ఇటు ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలకు, అటు విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. నిరంతర పర్యవేక్షణ, కరిక్యులంలో మార్పులు వంటి వాటికి అవకాశం ఉండి విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అలవడతాయి.

– ప్రొఫెసర్ ఎం.జగదీశ్ కుమార్, వీసీ, జేఎన్‌యూ.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 7-8-2017

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
88 ▲	53 ▲
32,325	10,066

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	6,352	▲ 11
డోజోన్స్	22,093	▲ 67
ఎఫ్‌టీఎస్ఈ 100	7,512	▲ 37
డాక్స్	12,298	▲ 143
షాంఘై	3,261	▽ 12
నికాయ్	19,952	▽ 77


● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	58.92	67.16
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	76.09	88.24
€	యూరో	థామస్‌కుక్	68.78	79.78
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	52.61	61.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	46.12	53.38
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	42.64	50.52
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.76	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.70	10.87

విడిగానే ఫ్యామిలీ హెల్త్!

- వృద్ధాప్య తల్లిదండ్రులను చేరిస్తే అధిక ప్రీమియం
- కవరేజీ కూడా పరిమితంగానే ఉంటుంది
- విడిగా వారికంటూ పాలసీ తీసుకుంటే అధిక కవరేజీ
- ప్రీమియం పెరగకుండా రెండు విధాల ప్రయోజనం
- కొన్ని తప్పనిసరి సందర్భాల్లోనే సింగిల్ పాలసీ



బీమా కంపెనీలిపుడు ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో దంపతులు, వారి ఇద్దరి పిల్లలతోపాటు వృద్ధులైన తల్లిదండ్రులకూ చోటు కల్పిస్తున్నాయి. గతంతో పోలిస్తే ఇటీవలి కాలంలో ఈ తరహా పాలసీలను ఆఫర్ చేయడం పెరిగింది. మరి ఇది లాభమేనా? లేక నష్టపోతామా? ఈ విషయం తేల్చుకోవాలంటే కొన్ని అంశాలను చూడాల్సి ఉంటుంది. వృద్ధులను ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో చేరిస్తే ప్రీమియం అధికంగా ఉంటుంది. విడిగా వారికి ఓ పాలసీ తీసుకుంటే ప్రీమియం తక్కువ కావొచ్చు. అందుకే పాలసీ తీసుకునే ముందు వీటన్నింటినీ ఓసారి జాగ్రత్తగా పరిశీలించాలి.

– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

తల్లిదండ్రులను చేరిస్తే సమస్యలివీ...



తల్లిదండ్రులను సైతం ఒకే పాలసీలో చేర్చే ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ ఎంచుకుంటే, పెద్ద వయసులో ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీమా కంపెనీలు కోరతాయి. ఇందులో వచ్చే ఫలితాల ఆధారంగా దరఖాస్తు తిరస్కరణకు గురయ్యే అవకాశం లేకపోలేదు. లేదా కొన్ని నియంత్రణలనైనా పెడుతుంటాయి. ఏదైనా వ్యాధి అప్పటికే ఉండుంటే కవరేజీ రూపేణా ప్రీమియం పెరిగిపోతుంది. హెల్త్ పాలసీల్లో ఓ ఏడాదిలో క్లెయిమ్ లేకపోతే తదుపరి ఏడాది ప్రీమియంలో నో క్లెయిమ్ బోనస్ రూపేణా తగ్గింపు పొందొచ్చు. కానీ, వృద్ధులైన తల్లిదండ్రులనూ ఒకే పాలసీలో చేర్చడం వల్ల వారి కోసం చికిత్సల పేరుతో ఏటా క్లెయిమ్ చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతుంటాయి. అందుకే వారిని కూడా కలిపి ఒకే పాలసీ తీసుకునేట్టు అయితే నో క్లెయిమ్ బోనస్ ప్రయోజనం కోల్పోవాల్సి ఉంటుంది. రెండు వేర్వేరు పాలసీలను తీసుకుంటే పేరెంట్స్ పాలసీలో తరచూ క్లెయిమ్‌లున్నప్పటికీ మిగిలిన పాలసీలో అయినా నో క్లెయిమ్ బోనస్ పొందడానికి వీలుంటుంది. ఇక తల్లిదండ్రుల కోసం విడిగా పాలసీ తీసుకుంటే దానికి చెల్లించే ప్రీమియానికీ సెక్షన్ 80డీ కింద అదనపు పన్ను మినహాయింపు పొందొచ్చు. తనకు, తన జీవిత భాగస్వామి, పిల్లలకు తీసుకున్న హెల్త్ ప్లాన్‌పై ఓ ఏడాదిలో రూ.25,000 వరకు చెల్లించే ప్రీమియంపై పన్ను మినహాయింపు ఈ సెక్షన్ కింద లభిస్తుంది. అలాగే, 60ఏళ్లు దాటిన తల్లిదండ్రులకు తీసుకునే హెల్త్ పాలసీపై ఏడాదికి రూ.30వేల ప్రీమియానికీ పన్ను ప్రయోజనం లభిస్తుంది. ఇలా రెండు వేర్వేరు పాలసీలు తీసుకున్నప్పటికీ ఆదాయపన్ను రిటర్నుల్లో ఒకే కాలమ్‌లో రెండింటి మొత్తాన్ని కలిపి పేర్కొనాల్సి ఉంటుంది. హెల్త్ చెకప్‌లకు అయ్యే వ్యయాన్నీ కూడా ఇదే కాలమ్‌లో గరిష్ట పన్ను మినహాయింపు పరిధి మేరకు చూపించుకోవచ్చనేది ఆదిత్య బిర్లా హెల్త్ కంపెనీ ప్రతినిధి సూచన.

ఒకే పాలసీ ఏ సందర్భంలో...?

ముందస్తు వ్యాధుల చరిత్ర ఉంటే వృద్ధులైన తల్లిదండ్రులకు పాలసీ ఇచ్చేందుకు కంపెనీలు నిరాకరించినపుడు వారితో కలిపి ఒకే ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ తీసుకోవడం ప్రయోజనకరం. కొన్ని బీమా కంపెనీలు ఇందుకు అవకాశమిస్తున్నాయి. అయితే, వృద్ధాప్యంలో ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, నాణ్యమైన ఆరోగ్య రక్షణ కవరేజీ అందించాల్సిన ప్రాముఖ్యతను గుర్తించి అటువంటి కేసుల్లో తాము సులభంగానే వ్యవహరిస్తున్నట్టు మ్యాక్స్‌బూపా హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ ఆశిష్ మెహరోత్రా తెలిపారు. ''తల్లిదండ్రులకు విడిగా పాలసీ లభించని పక్షంలోనే వారిని వారి పిల్లలు తమ ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో చేర్చుకోవాలి. సీనియర్లు విడిగా పాలసీ కోసం దరఖాస్తు చేసుకుంటే లభించడం కష్టం. ముందస్తు వ్యాధులతో ఉంటే మరింత కష్టమవుతుంది. అదే ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో అయితే కవరేజీ పొందే అవకాశాలు ఎక్కువ''అని బీమా బ్రోకరేజీ సంస్థ జేఎల్టీ డిప్యూటీ సీఈవో అరవింద్ లద్దా వివరించారు. మ్యాక్స్ బూపా హార్ట్‌బీట్ ఫ్యామిలీ ఫస్ట్ ప్లాన్‌లో ఓ వ్యక్తి 20 రకాల బంధుత్వాలు ఉన్నవారిని ఒకే పాలసీలో చేర్చుకునే అవకాశం ఉందని, వయసు పరంగా ఎటువంటి గరిష్ట పరిమితులు కూడా లేవని ఆ సంస్థ ఎండీ ఆశిష్ మెహరోత్రా తెలిపారు.



వయసు ఆధారంగా...



ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీల ప్రీమియం ఆ కుటుంబ సభ్యుల్లో గరిష్ఠ వయసున్న వ్యక్తి ఆధారంగా ఖరారు చేయడం జరుగుతుంది. తల్లిదండ్రులు లేదా అత్త, మామలను అందులో చేరిస్తే సాధారణంగా వారు పెద్ద వయసులో ఉంటారు గనుక తక్కువ బీమాకే అధిక ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. ''దీనికి బదులు రెండు ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలను తీసుకోవడం లాభకరం. ఒకటి తల్లిదండ్రులకు, మరొకటి వారి కుమారుడు లేదా కుమార్తె కుటుంబానికి'' అనేది మార్కెట్ నిపుణుడు రాహుల్ మెహతా సూచన. నలుగురు సభ్యులున్న కుటుంబంలో ఆర్జనపరుడైన వ్యక్తి పాలసీ తీసుకోవాలని అనుకున్న సందర్భంలో ఏం జరుగుతుందో ఉదాహరణతో చూద్దాం.

చరణ్ వయసు 30, జీవిత భాగస్వామి వయసు 28, తండ్రి వయసు 55, తల్లి వయసు 50గా భావిస్తే రూ.5 లక్షల కవరేజీకి ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్ పాలసీ తీసుకోవాలని భావించారు. దీనికి మ్యాక్స్ బూపా ఫ్యామిలీ ఫస్ట్ పాలసీలో ప్రీమియం రూ.59,113. అదే ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ ఎన్హాన్స్‌లో ప్రీమియం రూ.62,289. ఇలా కాకుండా తల్లిదండ్రులకు, మిగిలిన కుటుంబ సభ్యులకు వేర్వేరు పాలసీలు తీసుకుంటే ఇంతే ప్రీమియానికి రెట్టింపు కవరేజీ అందుకోవచ్చు. ఇక్కడ చెప్పుకున్నట్టు చరణ్ తల్లిదండ్రులకు రూ.10లక్షల హెల్త్ ప్లాన్, అతడు, అతడి జీవిత భాగస్వామి కోసం రూ.10 లక్షల కవరేజీతో మరో ప్లాన్‌కు కలిపి చెల్లించాల్సిన ప్రీమియం రూ.50,321. ప్రీమియం రూ.9వేలు తగ్గడంతోపాటు కవరేజీ రెట్టింపైంది. అదే ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్‌లో యాక్టివ్ హెల్త్ ఎన్హాన్స్‌లో రెండు వేర్వేరు పాలసీలకు కలిపి ప్రీమియం రూ.59,201. ఒకే పాలసీ, విడిగా పాలసీల్లో ప్రయోజనాల విషయంలో కొన్ని తేడాలు ఉండొచ్చు.

రీస్టోరేషన్ ప్రయోజనాలు అదనం



ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్ పాలసీల్లో చాలా కంపెనీలు రీస్టోరేషన్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. అంటే రూ.5 లక్షల పాలసీలో ఓ ఏడాదిలో మొత్తం కవరేజీ వినియోగించుకుంటే, తిరిగి మళ్లీ రూ.5 లక్షల కవరేజీ ఆ ఏడాదికి పునరుద్ధరించబడుతుంది. ఉదాహరణకు ఓ కుటుంబ సభ్యుడు అనారోగ్యం పాలై ఆస్పత్రి ఖర్చులు రూ.5 లక్షలు దాటిపోతే కవరేజీ మొత్తం ఖర్చయిపోతుంది. అప్పుడు ఇక ఆ ఏడాదికి వైద్య పరంగా రక్షణ లేకుండా పోతుంది. కానీ, రీస్టోరేషన్‌లో కవరేజీ అయిపోయిన వెంటనే మరొక్కసారి అంతే మొత్తాన్ని పునరుద్ధరించడం జరుగుతుంది. దీనికి అదనంగా చార్జీ వసూలు చేయడం ఉండదు. ఈ బెనిఫిట్‌ను పైన చెప్పుకున్న ఉదాహరణలకు అన్వయించి చూద్దాం. తల్లిదండ్రులను కూడా ఒకే పాలసీ కింద కలిపి తీసుకుంటే రూ.5 లక్షల పాలసీకి రీస్టోరేషన్ బెనిఫిట్ కూడా కలుపుకుంటే దురదృష్టకరమైన పరిస్థితుల్లో రూ.10 లక్షల వరకూ రక్షణ పొందొచ్చు. కానీ, ఇంతే ప్రీమియానికి రెట్టింపు కవరేజీతో వస్తుందని వేర్వేరు పాలసీలు తీసుకుంటే అప్పుడు ఒక్కో పాలసీలో బేసిక్ కవరేజీ రూ.10లక్షలు, రీస్టోరేషన్ కింద అదనంగా రూ.10 లక్షలు. కలిపితే రెండు పాలసీలపై నలుగురు సభ్యులు రూ.40 లక్షల వరకు రక్షణ పొందొచ్చు. ఎంతటి ఉపద్రవం వచ్చి పడినా నిశ్చింతగా ఉంచే కవరేజీ ఇది. పైగా ద్రవ్యోల్బణం ప్రభావంతో నేడు ఓ వ్యాధికి అయ్యే చికిత్సా వ్యయం ఐదేళ్ల తర్వాత ఎంత లేదనుకున్నా కనీసం 50 శాతం అధికమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఈ రకంగా చూస్తే తల్లిదండ్రులకు విడిగా పాలసీ తీసుకోవడం ప్రయోజనకరమే.

లాభాల స్వీకరణ!

వారంలో ఎగసి పడిన పసిడి

న్యూయార్క్‌లోని అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్– నైమెక్స్‌లో ఔన్స్ (31.1గ్రా) పసిడి ధర ఆగస్టు 4వ తేదీతో ముగిసిన వారంలో వారం వారీగా 11 డాలర్లు తగ్గి, 1,258 డాలర్లకు చేరింది. అమెరికా ఆర్థిక బలహీనతలు, రాజకీయ సమస్యలు, తక్షణం ఫెడ్ ఫండ్ రేటు (ప్రస్తుతం 1–1.25%) పెరగబోదన్న అంచనాలతో వారంలో దాదాపు 1,274 గరిష్ట స్థాయికి చేరిన బంగారం ఫ్యూచర్స్ ధర అక్కడి నుంచి క్రమంగా లాభాల స్వీకరణ ప్రారంభమైనా, శుక్రవారం వరకూ 1,270 స్థాయిలోనే పటిష్టంగా ఉంది. ఇదే సమయంలో డాలర్ ఇండెక్స్ కూడా వారం అంతా క్రమంగా బలహీనపడుతూ వచ్చింది. ఒక దశలో 92.58 స్థాయికి ఇండెక్స్ జారిపోయింది. అయితే శుక్రవారం వెలువడిన అమెరికా సానుకూల ఉపాధి కల్పనా గణాంకాలు డాలర్ ఇండెక్స్‌ను ఆ ఒక్క రోజే అనూహ్యంగా పెంచేశాయి. ఆ రోజు ఒక దశలో 93.55 స్థాయికి ఎగసిన డాలర్ ఇండెక్స్– చివరకు 93.37 వద్ద ముగిసింది. ఇదే రోజు పసిడి కూడా భారీగా 1,253 డాలర్లకు పడిపోయి, చివరకు 1,258 డాలర్ల వద్ద ముగిసింది. అయితే పసిడిది బులిష్ ధోరణేననీ, తగ్గినప్పుడల్లా అది కొనుగోళ్లకు అవకాశమనీ నిపుణులు చెబుతున్నారు. పసిడికి 1,240 డాలర్ల వద్ద పటిష్ట మద్దతు ఉందనీ, అటు తర్వాత 1,204 వద్ద మరో మద్దతు లభిస్తుందని వివరిస్తున్నారు. పై దిశగా 1,275 డాలర్లు దాటితే తరువాత నిరోధం 1,300 డాలర్లని వారి విశ్లేషణ.

దేశంలో రూపాయి ఎఫెక్ట్...

అంతర్జాతీయంగా పసిడి 11 డాలర్లు బలహీనపడినప్పటికీ, దేశంలో ఆ ప్రభావం యథాతథంగా కనిపించలేదు. డాలర్ మారకంలో రూపాయి భారీ పెరుగుదల దీనికి కారణం. వారంలో పసిడి 64.13 స్థాయి నుంచి భారీగా 63.75 స్థాయికి లాభపడింది. ఈ నేపథ్యంలో దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి వారంలో కేవలం రూ.174 తగ్గి రూ.28,406 కి చేరింది. ఇక ముంబై ప్రధాన మార్కెట్‌లో మాత్రం వారం వారీగా పసిడి 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర స్వల్పంగా రూ.100 ఎగసి రూ.28,690కి చేరింది.



మార్కెట్ల ర్యాలీ మన ఘనత కాదు!

''సరిగ్గా నెల కిందట 30 వేల పాయింట్లకు అటూ ఇటుగా ఉన్న దేశీ మార్కెట్ల బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్... నెల రోజుల్లో 32 వేలు దాటేసింది. అయితే ఈ స్టాక్ మార్కెట్ల ర్యాలీ కేవలం మన దేశానికే పరిమితం కాలేదు. నిజం చెప్పాలంటే ఇది మన ఘనతేం కాదు. ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లన్నీ ఇదే స్థితిలో ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే మన దేశంతో పోలిస్తే అర్జెంటీనా, చైనా దేశాల మార్కెట్లు 30 శాతం, దక్షిణ కొరియా 21 శాతం వృద్ధిలో ఉన్నాయి. ఇండియా, చైనా, అమెరికా, అర్జెంటీనా, రష్యా వంటి ప్రపంచంలోని 25 ఎమర్జింగ్ మార్కెట్లలో 23 దేశాలు సానుకూల వాతావరణంలోనే ఉన్నాయి. రష్యా, కెనడా మాత్రం ప్రతికూల వాతావరణంలో కొనసాగుతున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వి.కె.విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయన 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివిధ అంశాలపై ఆయనింకా ఏమన్నారంటే..

'సాక్షి'తో జియోజిత్ ఫైనాన్షియల్స్ స్ట్రాటజిస్ట్ విజయ్‌కుమార్

ప్రపంచవ్యాప్తంగా ర్యాలీ నడుస్తోంది!!

- 25 ఎమర్జింగ్ మార్కెట్లలో 23 మన కంటే ముందే
- మనకన్నా అర్జెంటీనా, చైనా 30%, దక్షిణ కొరియా 21% వృద్ధి
- మరో 8 నెలలు ఐటీ, ఫార్మా షేర్లు కుదేలే; బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీలకు ఢోకాలేదు
- ఏడాది తర్వాతే ఆర్థిక సంవత్సరంలో మార్పు; తొలుత కాస్త ఇబ్బందులు



సానుకూల సమయమిది

2007–08లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం, 2010–11లో యూరప్ సంక్షోభం, 2013లో అమెరికాలో రుణ సంక్షోభం, 2016లో బ్రెగ్జిట్.. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఎమర్జింగ్ మార్కెట్లు పలు సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. ఇప్పుడు ప్రతికూలం నుంచి సానుకూలం వైపు అడుగులేస్తున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోంది. గతేడాది మన దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.2 శాతం. ఈ ఏడాది 7.7 శాతానికి చేరుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నివేదిక చెబుతోంది. ఇదే వృద్ధి రేటు ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే గతేడాది 3.1 శాతంగా ఉంది. ఈ ఏడాది 3.4 శాతానికి చేరే సూచనలు కనిపిస్తున్నాయి.

స్టాక్ మార్కెట్లోకి నిధుల వెల్లువ..

సాక్షి ఇంటర్వ్యూ

గతేడాదితో పోలిస్తే స్టాక్ మార్కెట్లోకి నిధుల ప్రవాహం ఎక్కువగా కనిపిస్తోంది. దీనికి పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను వంటి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలే కారణమని చెప్పాలి. ఎందుకంటే పెద్ద నోట్ల రద్దుతో భౌతికంగా డబ్బు దొరకడమే గగనమైంది. పోనీ, బ్యాంకుల్లో వేద్దామన్నా, తీద్దామన్నా సవాలక్ష ఆంక్షలు, ఇక జీఎస్‌టీతో అసంఘటిత రంగం కాస్త సంఘటితంగా మారుతుంది. చాలా మంది పన్ను పరిధిలోకి వచ్చేస్తారు. దీంతో ప్రత్యక్ష, పరోక్ష పన్ను వసూళ్లు పెరుగుతాయి. ఫలితంగా జీడీపీ వృద్ధి చెందే అవకాశముంది. ఈ రెండింటితో భౌతిక పొదుపు కంటే ఆర్థిక పొదుపు వైపు జనాలు మళ్లుతున్నారు. అంటే బంగారం, రియల్ ఎస్టేట్ వంటి వాటి కంటే స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడమే మేలనే నిర్ణయానికొస్తున్నారు. పోనీ, బ్యాంకుల్లో దాచుకుందామంటే.. వడ్డీ రేట్లూ తక్కువే కదా!!.

- దేశీయ మార్కెట్లో ఏడెనిమిదేళ్ల పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా రంగాల హవా కొనసాగింది. కానీ, గత కొంతకాలంగా ఈ విభాగాలు ప్రతికూల వాతావరణంలో ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ 2,300 కంటే తక్కువకు వచ్చేసింది. గతేడాది 2,000లుగా ఉన్న లుపిన్.. ఇప్పుడు వెయ్యి కంటే తక్కువే. వ్యాల్యుయేషన్స్ తక్కువగా ఉంటున్నాయి. కాకపోతే వీటి వృద్ధి రేటు కూడా పడిపోతోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పలు నిర్ణయాలు, ధరల తగ్గింపు వంటివి ఇందుకు కారణం. అయితే ఇలాంటి సమయంలో ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే... కొంత రిస్కు తీసుకోవటం లాంటిదే.
- రిటైల్ మీద ఫోకస్ చేసే బ్యాంకులు, ఎన్‌పీఏ తక్కువగా ఉన్న బ్యాంకుల షేర్లు రానున్న రోజుల్లో మరింత బాగుంటాయి. ఈ రంగంలో విలీనాలు కూడా ఇన్వెస్టర్లకు కలిసొస్తాయి. వాహన, గృహం వంటి రుణాలను అందించే ఎన్‌బీఎఫ్‌సీ స్టాక్స్ కూడా బాగుంటాయి. సిమెంట్, మెటల్, ఎఫ్‌ఎంసీజీ స్టాక్స్ బాగానే ట్రేడ్ అవుతున్నాయి. మరో 8 నెలలపాటు వీటికి ఎలాంటి ఇబ్బందులుండకపోవచ్చు. కొనుగోళ్లు, విలీన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత కంపెనీల షేరు ధర, స్వాప్ రేషియో, వ్యాల్యుయేషన్స్‌ను గమనించాలి. వీటి మీదే ఆయా షేర్ల వృద్ధి ఆధారపడి ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు ఎంఎఫ్‌లో పెట్టుబడులు పెట్టడం ఉత్తమం. చిన్న షేర్ల విషయానికొస్తే వాటి వ్యాల్యుయేషన్స్ చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ఇన్వెస్ట్ చేసే ముందు అవన్నీ గమనించాలి.
- నెలకు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) పథకాల్లో రూ.4,800 కోట్లు చేరుతున్నాయి. యాక్టివ్ ఎస్ఐపీ ఖాతాలు 4.45 కోట్ల వరకూ ఉంటాయి. గతేడాదితో పోలిస్తే మ్యూచువల్ ఫండ్స్ పోర్ట్‌ఫోలియో 20 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఈఎల్ఎస్ఎస్) తాలూకు నిధులు పెద్ద మొత్తంలో స్టాక్ మార్కెట్లోకి వస్తున్నాయి. జూలైలో రూ.12,727 కోట్లు స్టాక్స్‌లో చేరాయి. స్టాక్ మార్కెట్లోని మొత్తం అసెట్స్‌లో ఒక్క ఎంఎఫ్ పరిశ్రమ వాటానే రూ.19.97 లక్షల కోట్లుంటుంది. ఏటా 31.5 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది కూడా.
- ఆర్థిక సంవత్సరం మార్పుతో తొలి దశలో కాసింత గందరగోళం ఏర్పడినా.. తర్వాత తర్వాత సానుకూలమవుతుంది. ప్రపంచంలోని చాలా దేశాల్లో ఆర్థిక సంవత్సరం అంటే జనవరి 1 నుంచి డిసెంబర్ 31, ఇది క్యాలెండర్ ఇయర్. కానీ, మన దేశంలో మాత్రమే ఏప్రిల్ 1 నుంచి మార్చి 31. ప్రపంచ బ్యాంక్ కూడా క్యాలెండర్ ఇయర్‌నే ఫాలో అవుతుంది. దీంతో కొన్ని సమయాల్లో మన దేశానికి ఇబ్బందులొస్తున్నాయి. దీనికి పరిష్కారం చూపించేందుకు కేంద్రం ఆర్థిక సంవత్సరాన్ని క్యాలెండర్ ఇయర్‌కు మార్చే నిర్ణయాన్ని తెర మీదికి తీసుకొచ్చింది. తొలి దశలో ఖాతాల అప్‌లోడింగ్ వంటి వాటిల్లో ఇబ్బందులు రావచ్చు.
- దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా పనిచేస్తున్నాయని చెప్పాలి. పెట్టుబడుల ఆకర్షణలో ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. పలు విధానపరమైన నిర్ణయాలతో విదేశీ కంపెనీలను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. అయితే జీఎస్‌టీ కారణంగా ఈ రెండు రాష్ట్రాల అభివృద్ధికి కాసింత విఘాతం ఏర్పడటం మాత్రం ఖాయం. దాన్ని పూరించేందుకే పన్ను రాబడులను కోల్పోయే రాష్ట్రాలకు కేంద్రం నష్టపరిహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. అందుకే ప్రస్తుతం జీఎస్‌టీ పన్ను శ్లాబుల్లో కొన్నింటికి జీఎస్‌టీతో పాటూ సెస్సును జత చేశారు. ఈ సెస్సును ఆదాయం కోల్పోయే రాష్ట్రాలకు పరిహారంగా అందిస్తారు.

– హైదరాబాద్, బిజినెస్ బ్యూరో




నీకు నచ్చిన రంగాన్ని ఎంచుకో. కష్టపడు. ఉన్నత శిఖరాలకు ఎదుగుతావు.
అంతే కానీ ప్రతి రంగంలోనూ నువ్వే గొప్పవాడివి కావాలని ఎప్పుడూ ఆశించొద్దు.
– ఉర్సులా బర్న్స్, జిరాక్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్

పొదుపు-మదుపు



రిటైరయినా పనిచేస్తారా?



రిటైర్మెంట్ ప్లానింగ్ అనగానే బోలెడన్ని ఆలోచనలొస్తుంటాయి. అన్నింటికన్నా ముందు... అసలు మనం ఎప్పటికీ రిటైరే కాము. ఏదో ఒకటి చేస్తూనే ఉంటామనే ఆలోచన వస్తుంది. నిజానికిది ప్లానింగ్‌ను మరికాస్త వాయిదా వేసుకునేందుకు మనకి మనం సర్ది చెప్పుకోవడం!!. అంతే తప్ప మరొకటి కాదు. సరిగ్గా పదవీ విరమణకు సమయం దగ్గర పడుతున్నప్పుడు... రిటైర్మెంట్ ప్లానింగ్ ఎంత ముఖ్యమో మెల్లగా అర్థం అవుతుంటుంది. సరే... ఏదైతేనేం.. ఎప్పుడైతేనేం.! ముప్ఫైలలో.. నలభయ్యోపడిలో ఉన్నా పర్వాలేదు. అస్సలంటూ చేయకుండా ఉండటం కన్నా ఆలస్యమైనా ఎప్పుడో ఒకప్పుడు ప్లానింగ్ ప్రారంభించడమే మంచిది. సరైన పెట్టుబడి అవకాశాలు గుర్తించి, అమలు చేయగలగడం, లక్ష్యం దిశగా పురోగతిని సమీక్షించుకుంటూ ఉండటం, సరైన నిర్ణయాలు తీసుకోగలగడం.. ఇవే రిటైర్మెంట్ ప్రణాళికలో కీలకం.


అజయ్ సింగ్
వ్యవస్థాపక డైరెక్టర్, 5నాన్స్‌డాట్‌కామ్

ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అవసరం

రిటైర్మెంట్ తర్వాత కూడా జాలీగా ఉండగలిగేందుకు వేసుకునే ప్రణాళిక ఒక్కనాటితో అయిపోదు. మెరుగుపడే మీ జీవన విధానాలు, అత్యవసరాలు, ఆరోగ్య పరిస్థితులు, జీవన ప్రమాణాలు ఇలాంటి వాటి ఆధారంగా దీన్ని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకుంటూ, సమీక్షలు జరుపుకుంటూ ఉండాలి. కేవలం మీ జీవితాంతమే కాకుండా మీపైనే ఆధారపడిన జీవిత భాగస్వామి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

క్రమంగా పెంచితేనే నిశ్చింత

ఈ ప్లానింగ్‌లో సమయం చాలా కీలకం. రిటైర్మెంట్ నిధి కోసం ఎంత కేటాయించగలరనేది ముందుగా నిర్ణయించుకోండి. ఇప్పుడున్నట్లుగానే పొదుపు చేసుకుంటూ వెడితే.. లక్ష్యాన్ని సాధించలేకపోవచ్చు! కాబట్టి.. కేటాయింపులను క్రమక్రమంగా పెంచుకుంటూ వెళ్లండి. ఆదాయం పెరిగే కొద్దీ స్థిరంగా అందులో కొంత శాతాన్ని రిటైర్మెంట్ నిధి కోసం కేటాయిస్తుండండి.

షేర్లవైపూ చూడొచ్చు

రిటైర్మెంట్ కోసం పెట్టుబడులనగానే.. ఫిక్సిడ్ డిపాజిట్లు, పింఛను ఫండ్లు లాంటి సంప్రదాయ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలే గుర్తొస్తుంటాయి. రిస్కులు, రాబడులను బేరీజు వేసుకుని సరైన సాధనాన్ని ఎంచుకోవడమూ కీలకమే. మీరు నలభైలలో ఉన్నా.. పదవీ విరమణకు మరో పదేళ్లు పైగా ఉంటుంది కాబట్టి.. స్టాక్ మార్కెట్లు, షేర్ల వైపు చూడొచ్చు. దశల వారీగా..

తొలి దశలో.. మీ రిస్కు సామర్థ్యానికి తగ్గట్లుగా చక్కని డైవర్సిఫికేషన్ అందించే మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ (సిప్) ద్వారా ఇన్వెస్ట్ చేయండి. మిగతా సంప్రదాయ సాధనాల కన్నా మెరుగైన రాబడులు అందుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. మధ్యమధ్యలో పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకుంటూ.. తగు మార్పులు, చేర్పులూ చేసుకుంటూ ఉండాలి.



ఇక రెండో దశలో.. రిటైర్ అయ్యాక.. కూడా అదే ఫండ్స్‌లో మీ పెట్టుబడులు కొనసాగించవచ్చు. అదే సమయంలో ప్రతి నెలా మీ ఖర్చులకు ఎంత కావాల్సి ఉంటుందనేది చూసుకుని, ఈ పెట్టుబడుల నుంచి సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) కొంత కొంతగా వెనక్కి తీసుకోవచ్చు.

ఇలాంటి కాంబినేషన్‌ను ఎంచుకోవడం ద్వారా మీ పెట్టుబడి వేగంగా వృద్ధి చెందడంతో పాటు మీ అవసరాలకు తగ్గట్లుగా విత్‌డ్రా చేసుకునే వీలు కూడా కలుగుతుంది.

ఆరోగ్యం.. అత్యవసరం..

పదవీ విరమణ తర్వాత కూడా జీవన విధానానికి ఢోకా లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రిటైర్మెంట్ అనంతరం వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్యపరమైన సమస్యలను దీటుగా ఎదుర్కొనేందుకు తగిన హెల్త్ ప్లాన్ కూడా ఒకటి తీసుకోవడం శ్రేయస్కరం. అలాగే, ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినా హడావిడి పడకుండా ఉండేందుకు ప్రత్యేక నిధిని కూడా సమకూర్చుకుని ఉండటం మంచిది.

రిటైర్మెంట్ ప్రణాళిక అమలుకు ఇవ్వాళా.. రేపు అంటూ లేదు. ఎప్పట్నుంచైనా మొదలుపెట్టొచ్చు. ఆ.. ఎప్పట్నుంచనేది.. ఇప్పట్నుంచే ప్రారంభిస్తే.. వీలైనంత సాఫీగా రిటైర్మెంట్ జీవితం గడిపేయొచ్చు.

వ్యవసాయ ఆదాయంపై పన్ను లేదు..

ఇతర సంపాదన ఉంటే మాత్రం కొంత చెల్లించాలి


కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి, కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

వ్యవసాయం చేయాలనుకుంటున్నారా? తద్వారా ఆదాయం పొందాలని భావిస్తున్నారా? అయితే ఇప్పుడు మీకో మంచి విషయం చెబుతున్నా. వ్యవసాయ ఆదాయంపై పన్ను భారం లేదు. అయితే వ్యవసాయంతోపాటు ఇతరత్రా సంపాదన ఉంటే మాత్రం పన్ను కింద కొంత చెల్లించాలి.

పన్ను భారం లేదు..

మీరు కేవలం వ్యవసాయం చేస్తూ, ఇతర ఆదాయం కలిగి ఉండకపోతే మీ ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంది. ఎటువంటి పన్ను భారం లేదు. అయితే ఆదాయపు పన్ను శాఖ పరిశీలించే కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. అవి... వ్యవసాయం చేయాలంటే భూమి కావాలి. భూమి కొనుగోలు ధరకి సంబంధించి మీ వద్ద సోర్స్ ఉండాలి. మీరు కొనే భూమికి ధర రూ.60,00,000 అనుకోండి. ఈ మొత్తానికి మీరు వివరణ ఇవ్వాలి. ఇక అన్ని రికార్డులు చూసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోండి. అన్ని రశీదులనూ దాచుకోండి.

అమ్మినా క్యాపిటల్ గెయిన్స్ పడదు..



ఏదేని కారణంతో వ్యవసాయ భూమి అమ్మినా కూడా క్యాపిటల్ గెయిన్స్ పడదు. అయితే ఫాంహౌస్ అద్దెకిచ్చిన పక్షంలో ఆ ఆదాయం మీద మాత్రం పన్ను పడుతుంది. చాలా మంది విదేశాల నుంచి స్వదేశం వచ్చి కలం మానేసి హలం పట్టారు. అలా కుదరని పక్షంలో ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తూ తీరిక వేళల్లో వ్యవసాయం చేస్తున్నారు కొందరు. ఒక వ్యక్తికి వ్యవసాయ ఆదాయం, పన్నుకి గురయ్యే ఇతర ఆదాయం కూడా ఉంటే... అప్పుడు కొంత మొత్తం పన్ను వ్యవసాయం ఆదాయం మీద పడుతుంది.

ఒక ఉదాహరణ చూద్దాం..

60 ఏళ్లు దాటిన వ్యక్తికి రూ.3,00,000 దాకా పన్ను లేదు. ఈయనకు వ్యవసాయం కాకుండా వచ్చే ఆదాయం రూ.4,00,000 అనుకోండి. ఇక్కడ అదనంగా ఉన్న రూ.1,00,000 మీద 10 శాతం చొప్పున రూ.10,000 పన్ను భారం పడుతుంది. ఇదే వ్యక్తికి వ్యవసాయం మీద రూ.3,00,000 వచ్చిందనుకోండి. అప్పుడు పన్ను భారం పెరుగుతుంది. అదెలా అంటే.. రెండు ఆదాయాలు కలిపితే రూ.7,00,000 అవుతుంది. దీని మీద పన్ను భారం రూ.60,000. రిబేటు (బేసిక్ లిమిట్+వ్యవసాయ ఆదాయం) రూ.40,000. చెల్లించాల్సింది రూ.20,000. అంటే రూ.10,000 అధికం. ఈ విధంగా రెండు ఆదాయాలు ఉన్నవారు కొంత అధికంగా చెల్లించాలి.



యాప్‌కీ కహానీ...

ఎస్‌బీఐ కార్డు

ప్రభుత్వ రంగ దిగ్గజ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఎస్‌బీఐ) క్రెడిట్ కార్డు అకౌంట్ ఆన్‌లైన్ యాక్సెస్ కోసం 'ఎస్‌బీఐ కార్డు' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆన్‌లైన్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో యాప్‌లోకి లాగిన్ అయ్యి అకౌంట్‌ను మేనేజ్ చేసుకోవచ్చు. తర్వాత కావాలనుకుంటే ఎం-పిన్ సెట్ చేసుకొని సులభంగా లాగిన్ అవ్వొచ్చు.

SBI Card



ప్రత్యేకతలు

- కార్డు స్టేట్‌మెంట్లను, అన్‌బిల్ ట్రాన్సాక్షన్లను, పేమెంట్స్ వివరాలను తెలుసుకోవచ్చు. ఏదైనా సర్వీస్ కోసం రిక్వెస్ట్ పెట్టుకోవచ్చు.
- రివార్డు పాయింట్లు ఎన్నున్నాయో చూసుకోవచ్చు. వాటిని రెడీమ్ చేసుకోవచ్చు.
- హాట్‌డీల్స్‌లో ఎస్‌బీఐ కార్డుపై ఏమైనా ఆఫర్లు ఉన్నాయేమో చూడొచ్చు.
- స్టోర్ సాయంతో ట్రావెల్ బుకింగ్స్ చేసుకోవచ్చు.
- ఫ్లెక్సీపే, ఎన్‌క్యాష్, ఈజీమనీ వంటి పలు ప్రత్యేకతలున్నాయి.

స్టాక్స్ వ్యూ

పంజాబ్ నేషనల్ బ్యాంక్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.151 టార్గెట్ ధర: రూ.184

ఎందుకంటే: ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఇది మూడో అతి పెద్ద బ్యాంక్. దేశవ్యాప్తంగా 6,946 బ్రాంచ్‌లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వీటిల్లో సగానికి పైగా గ్రామాలు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఇతర ఆదాయం 23 శాతం పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 4 శాతం వృద్ధితో రూ.3,855 కోట్లకు పెరిగింది. రుణ నాణ్యత నిలకడగానే ఉందని చెప్పవచ్చు. స్థూల మొండి బకాయిలు 13.6 శాతంగా, నికర మొండి బకాయిలు 8.67 శాతంగా ఉన్నాయి. మొత్తం రుణాల్లో 19 శాతానికి సమానమైన రూ.77,500 కోట్ల రుణాలు ఒత్తిడి రుణాలని చెప్పవచ్చు. నికర వడ్డీ మార్జిన్‌లు క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన 6 బేసిస్ పాయింట్లు పెరిగాయి. రిటైల్ రుణాలు 16 శాతం పెరిగాయి. కాసా డిపాజిట్లు 24 శాతం పెరిగాయి. ఫీజు ఆదాయం 18 శాతం పెరిగింది. భారత దివాలా చట్టం (ఐబీసీ) కారణంగా ఉక్కు, విద్యుత్తు, నిర్మాణ రంగాలకు సంబంధించిన సమస్యాత్మక రుణాలు రికవరీ అయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ రంగాలు పుంజుకుంటే ఈ బ్యాంక్ కూడా బాగానే ప్రయోజనం పొందగలదు. వడ్డీరేట్లు తగ్గుతున్న నేపథ్యంలో నగదు నిల్వలు సంతృప్తికరమైన స్థాయిలోనే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3,000 కోట్లు సమీకరించాలని బ్యాంక్ యోచిస్తోంది. వివిధ వెంచర్లలో ఈ బ్యాంక్ పెట్టిన పెట్టుబడులు చెప్పుకోదగిన స్థాయిలోనే ఉన్నాయి. పీఎన్‌బీ హౌసింగ్, మెట్ లైఫ్, ఇక్రా, యూటీఐ మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో ఈ బ్యాంక్‌కు ఉన్న పెట్టుబడుల విలువ రూ.1,30,00 కోట్లుగా ఉండొచ్చని అంచనా. ఒక్కో షేర్ పరంగా చూస్తే ఇది రూ.62గా ఉంటుంది. రుణ నాణ్యతపై మరింత స్పష్టత వచ్చేదాకా బ్యాంక్ ఆర్థిక సంబంధిత గణాంకాల్లో ఒడిదుడుకులు చోటు చేసుకోవచ్చు.

అవంతి ఫీడ్స్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: ఈక్విరస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్
ప్రస్తుత ధర: రూ.1,782 టార్గెట్ ధర: రూ.2,270

ఎందుకంటే: అవంతి ఫీడ్స్ కంపెనీ రొయ్యల మేత, రొయ్యల ప్రాసెసింగ్ వ్యాపారాలను నిర్వహిస్తోంది. ఈ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. రొయ్యల మేత తయారీకి కీలక ముడిపదార్థాలైన ఫిష్‌మీల్, సోయామీల్ ధరలు గత ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగం నుంచి తగ్గుతూనే ఉన్నాయి. ఫిష్‌మీల్ ధరలు మరింతగా తగ్గుతాయని అంచనా. ముడిపదార్థాల ధరలు తగ్గినా, రొయ్యల మేత తయారీదారులు రొయ్యల మేత ధరలను తగ్గించలేదు. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో ఈ కంపెనీ స్థూల మార్జిన్‌లు 31 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా సీఫుడ్ వినియోగం పెరుగుతోంది. విశాలమైన తీరరేఖ ఉన్నందున ఇదే ట్రెండ్ భారత్‌లోనూ కొనసాగనున్నది. గత ఆర్థిక సంవత్సరంలో సీఫుడ్ ఎగుమతులు 20 శాతం పెరిగాయి. వీటిల్లో రొయ్యల వాటా 38 శాతంగా ఉంది. భారత్‌లో రొయ్యల పెంపకం గత ఆరేళ్లలో 19 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధించింది. ఆక్వాకల్చర్ రంగాన్ని వ్యవసాయ రంగంతో సమానంగా గుర్తిస్తే, బీమా తదితర ప్రయోజనాలు లభిస్తాయి. గత ఆర్థిక సంవత్సరంలో అవంతీ ఫీడ్స్ కంపెనీ రొయ్యల మేత అమ్మకాలు 35 శాతం, రొయ్యల ఎగుమతులు 18 శాతం చొప్పున వృద్ధి చెందాయి. ఇదే జోరు రానున్న సంవత్సరాల్లో కూడా కొనసాగనున్నది. రొయ్యల ప్రాసెసింగ్ వ్యాపారాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన అనుబంధ కంపెనీ, అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్‌కు బదిలీ చేసింది. ఈ కంపెనీలో 40 శాతం వరకూ వాటాను థాయ్ యూనియన్‌గ్రూప్ కొనుగోలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఈపీఎస్ 28 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. నికర నగదు మిగులు మెరుగుపడింది. రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్ఓఈ) 40 శాతంగా ఉంది. ఏడాది కాలంలో ఈ షేర్ రూ.2,270కు చేరుతుందని అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

గ్లాండ్ ఫార్మా డీల్‌కు బ్రేక్!



గ్లాండ్ ఫార్మాలో మెజారిటీ వాటా కొనుగోలుకు ముందుకొచ్చిన చైనా ఫార్మా దిగ్గజం షాంఘై ఫోసన్ ఫార్మాస్యూటికల్ గ్రూప్‌నకు చుక్కెదురైంది. గ్లాండ్ ఫార్మాలో 86 శాతం వాటాను రూ.8,800 కోట్లకు దక్కించుకునేందుకు షాంఘై ఫోసన్ ఆఫర్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల సమావేశమైన కేబినెట్ ఎకనమిక్ అఫైర్స్ కమిటీ ఈ డీల్‌పై పలు అభ్యంతరాలను లేవనెత్తింది.

జూలై కారు రయ్..

దేశీ ప్యాసెంజర్ వాహన విక్రయాల్లో జూలై నెలలో బలమైన వృద్ధి నమోదయ్యింది. దీనికి జీఎస్‌టీ అమలు, ధరల తగ్గింపు, సానుకూల రుతుపవనాలు వంటి పలు అంశాలు కారణంగా నిలిచాయి. మారుతీ సుజుకీ ఇండియా, టాటా మోటార్స్, మహీంద్రా, ఫోర్డ్ ఇండియా, హోండా కార్స్ ఇండియా వంటి కంపెనీల వాహన అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదయ్యింది. మారుతీ అమ్మకాలు ఏకంగా 22 శాతం ఎగశాయి. వాణిజ్య, టూవీలర్ విభాగాల్లోనూ ఇదే జోరు కనిపించింది.

నీతి ఆయోగ్‌కు పనగడియా బై.. బై!!

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగనున్నట్లు అరవింద్ పనగడియా ప్రకటించారు. ఆగస్ట్ 31న బాధ్యతల నుంచి తప్పుకొని తిరిగి కొలంబియా యూనివర్సిటీకి వెళ్లనున్నట్లు తెలిపారు. అరవింద్ పనగడియా 2015 జనవరిలో నీతి ఆయోగ్ తొలి వైస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

మ్యాక్స్ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ విలీనం రద్దు

హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మ్యాక్స్ లైఫ్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విలీన ప్రతిపాదనను ఉపసంహరిస్తున్నట్లు మ్యాక్స్ ఇండియా వెల్లడించింది. నెల రోజులుగా ఇరు వర్గాలు ప్రత్యామ్నాయ విధానాలను పరిశీలించాయని, అయితే వీటిని ఖరారు చేయడంలో తీవ్ర జాప్యం జరిగిన నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

రెపో పావు శాతం తగ్గింపు

ఆర్‌బీఐ రెపో రేటు పావుశాతం తగ్గించింది. దీంతో ఇది 6%కి తగ్గింది. ఇది ఆరేళ్లకు పైగా కనిష్ట స్థాయి. అలాగే రివర్స్ రెపో కూడా పావుశాతం తగ్గించింది. దీంతో ఇది 5.75%కి తగ్గింది.

ఫ్లిప్‌కార్ట్ ఆఫర్‌కు స్నాప్‌డీల్ నో!!

ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ కథ కంచికి చేరింది. వ్యాల్యుయేషన్, ఫ్లిప్‌కార్ట్ విధిస్తున్న షరతులపై విభేదాల కారణంగా విలీన చర్చలు నిలిపివేస్తున్నట్లు స్నాప్‌డీల్ తెలిపింది. ఇకపై సొంతంగానే కొనసాగాలని, ఆర్థిక పరిపుష్టత సాధించాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం 'స్నాప్‌డీల్ 2.0' వ్యూహంతో ముందుకెళ్లనుంది.

పొదుపు ఖాతాలకు ఎస్‌బీఐ షాక్



ఎస్‌బీఐ కొన్ని సేవింగ్స్ ఖాతాల డిపాజిట్లపై వడ్డీ రేటును తగ్గించింది. రూ.కోటి పైబడి నగదు నిల్వలపై 4% వడ్డీ రేటును కొనసాగించింది. కానీ, ఆలోపు ఉన్న నిల్వలపై 3.5% రేటును ఆఫర్ చేస్తోంది.

కేంద్రం నుంచి కొత్త ఈటీఎఫ్ 'భారత్-22'

'భారత్-22' పేరుతో కొత్త ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)ను ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇంధనం, ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్స్, బేస్ మెటల్స్, ఇండస్ట్రియల్, యుటిలిటీస్ రంగాల నుంచి ఎంపిక చేసిన 22 షేర్లు ఇందులో ఉంటాయి.

ఆటోకార్నర్



- ఫియట్ తాజాగా తొలి మేడిన్ ఇండియా 'జీప్ కంపాస్' ఎస్‌యూవీని మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.14.95 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ) ఉంది.
- 'బీఎండబ్ల్యూ' తన '3సిరీస్' పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఇది తాజాగా కొత్త 'బీఎండబ్ల్యూ 320డీ ఎడిషన్ స్పోర్ట్'ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.38.6 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్‌ల) ఉంది.
- 'డుకాటీ' తాజాగా' స్క్రాంబ్లర్ కేఫ్ రేసర్' మోడల్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.9.32 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) ఉంది.

డీల్స్..



- వీడియోఆన్‌డిమాండ్ ప్లాట్‌ఫామ్ నిర్వహిస్తున్న ఎన్‌ఫ్యూజన్‌ను కొనుగోలు చేసినట్లు బుక్‌మైషో వెల్లడించింది.
- ఫ్లిప్‌కార్ట్‌లో ఈబే ఇండియా కార్యకలాపాల విలీనం పూర్తయ్యింది. 'ఈబే డాట్ ఇన్' ఫ్లిప్‌కార్టు గ్రూపు కంపెనీగా స్వతంత్రంగా కొనసాగుతుంది.
- ఇన్ఫోసిస్ తాజాగా లండన్‌కు చెందిన బ్రిలియంట్ బేసిక్స్‌ను కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. డీల్ విలువ తెలియలేదు.
- విదేశీ ఇన్వెస్టర్ 'ఎల్‌టీఎస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్' తాజాగా 'ఇన్ఫీబీమ్ ఇన్‌కార్పొరేషన్'లో 3.63 లక్షల షేర్లను (0.66 శాతం వాటా) విక్రయించింది. ఈ వాటా విక్రయం విలువ రూ.51 కోట్లుగా ఉంది.
- బజాజ్ ఫైనాన్స్.. మొబిక్విక్‌లో దాదాపు 11 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. డీల్ విలువ రూ.225 కోట్లుగా ఉండనుంది.
- కేంద్ర ప్రభుత్వం హిందుస్తాన్ కాపర్‌లో 6.83 శాతం వాటా విక్రయించడం ద్వారా రూ. 400 కోట్లు సమీకరించింది.
- కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో గుజరాత్ రాష్ట్ర పెట్రోలియం కార్పొరేషన్‌కు (జీఎస్‌పీసీ) ఉన్న 80% వాటాలను ఓఎన్‌జీసీ కొనుగోలు చేసింది. ఇందుకు రూ.7,738 కోట్లు చెల్లించింది.

2017-18 క్యూ1 ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం(కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017-18	2016-17	వృద్ధి(%)	2017-18	2016-17	వృద్ధి(%)
శ్రీ సిమెంట్	440	508	-13	2,995	2,566	17
బలరాంపూర్ చిని	120	111	8	1,136	827	37
టొరెంట్ ఫార్మా	188	292	-36	1,348	1,513	-11
వి-గార్డ్	23	43	-46	569	561	1
శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్	449	374	20	--	--	--
ఎస్సార్ షిప్పింగ్	-58	-50	--	188	186	1
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	-412	-397	--	3,210	3,444	-7
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	624	1,120	-44	15,977	--	24
ఇండిగో	811	592	37	5,955	4,741	25
టెక్ మహీంద్రా	798	--	7	7,336	--	6
రిలయన్స్ ఇన్‌ఫ్రా	334	439	-24	7,848	7,538	4
వోల్టాస్	188	159	18	1,962	1,844	6
పీఎన్‌బి	343	306	12	14,468	13,475	7
వీఐపీ ఇండస్ట్రీస్	41	31.43	30	407	374	9
తేజాస్ నెట్‌వర్క్స్	20	-2	--	224	150	49
కమ్మిన్స్ ఇండియా	222	181	23	1,388	1,317	5
టైటాన్	238	121	97	4,050	2,841	43
జ్యోతి ల్యాబ్స్	24	45	-46	385	452	-15
బజాజ్ ఎలక్ట్రికల్స్	20.5	22.87	-10	1,029	959	7
ఆంధ్రాబ్యాంకు	40	--	29	5,155	4,855	6
బీఎస్ఈ	523	43	12 రెట్లు	158	142	11
ఐవోసీ	4,548	8,269	-45	1,29,418	1,07,671	20
హెచ్‌పీసీఎల్	925	2,098	-56	59,891	51,600	16
మహీంద్రా	766	955	-20	12,335	11,942	3



బొమ్మ-బొరుసు

"సుదీర్ఘ లక్ష్య ఛేదనలో ఉన్నప్పుడు...
మధ్య మధ్యలో వచ్చే ఆటంకాల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు"
– అరుణా జయంతి, క్యాప్‌జెమిని ఇండియా సీఈవో



దిగ్గజ కంపెనీల ఫలితాలపై చూపు

- టాటా మోటార్స్, టాటా స్టీల్, ఎస్‌బీఐ ఫలితాలు ఈ వారంలోనే
- 11న పారిశ్రామికోత్పత్తి గణాంకాల రాక
- మార్కెట్ సెంటిమెంట్‌ను నిర్ణయించేవి ఇవే

న్యూఢిల్లీ: ఈ వారం దేశీయంగా వెలువడే పారిశ్రామికోత్పత్తి, బ్లూచిప్ కంపెనీలైన టాటా స్టీల్, టాటామోటార్స్, ఎస్‌బీఐ, అరబిందో ఫార్మా, బీహెచ్ఈఎల్, గెయిల్ ఫలితాలపై మార్కెట్లు ప్రధానంగా దృష్టి సారించనున్నాయి. వీటితోపాటు రుతుపవనాల విస్తరణ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం.. తదితర అంశాలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపేవేనని విశ్లేషకులంటున్నారు. అయితే, అమెరికా బలమైన ఉద్యోగ గణాంకాలు గత శుక్రవారం వెలువడగా సోమవారం మార్కెట్లు వీటికి స్పందించే అవకాశం ఉందని భావిస్తున్నారు. కంపెనీల ఆర్థిక ఫలితాలను మార్కెట్లు గమనించనున్నాయని, స్టాక్ వారీగా కదలికలు ఉంటాయని కోటక్ సెక్యూరిటీస్ పీసీజీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ టీనా విర్మాని పేర్కొన్నారు. ఆద్య ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్‌హెడ్ అభీష్ కుమార్ సుదాన్షు కూడా ఇదే విధమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వారం మార్కెట్ల గమనం ప్రధానంగా కంపెనీల ఫలితాలు, ఐఐపీ డేటా ఆధారంగానే ఉంటుందన్నారు. అయితే, మార్కెట్లు అధిక వ్యాల్యేషన్ల కారణంగా స్వల్ప కాలానికి తాము అప్రమత్త ధోరణితోనే కొనసాగుతామని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. గత వారం బీఎస్ఈ కేవలం 15 పాయింట్ల లాభపడగా, నిఫ్టీ 52 పాయింట్ల పెరుగుదలతో సూచీలు వరుసగా ఐదో వారం లాభాల్లో కొనసాగినట్టయింది.



టాటా స్టీల్ ఫలితాలు నేడే: సోమవారం టాటా స్టీల్, బ్రిటానియా ఇండస్ట్రీస్ కంపెనీలు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను వెల్లడించనున్నాయి. మంగళవారం (ఈ నెల 8న) థెర్మాక్స్ కంపెనీ, ఈ నెల 9న(బుధవారం) టాటా మోటార్స్, అరబిందో ఫార్మా, ఐషర్ మోటార్స్, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎండీసీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా కంపెనీలు, గురువారం (ఈ నెల 10న) భారత్ హెవీ ఎలక్ట్రికల్స్, గెయిల్ ఇండియా, ఎంఆఐఎల్ కంపెనీలు, శుక్రవారం (11న) బీపీసీఎల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, సిప్లా, హిందాల్కో కంపెనీలు తమ క్యూ1 ఫలితాలను వెల్లడించనున్నాయి. ఆర్థిక గణాంకాల విషయానికొస్తే, జూన్ నెలకు సంబంధించి పారిశ్రామికోత్పత్తి గణాంకాలు ఈ నెల 11న (శుక్రవారం) మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడతాయి. అంతర్జాతీయ అంశాల పరంగా చూస్తే... సోమవారం జపాన్ వాణిజ్య గణాంకాలు, మంగళవారం (ఈ నెల 8న) చైనా జూలై ట్రేడ్ బ్యాలెన్స్ డేటా, శుక్రవారం (ఈ నెల 11న) చైనా ఎఫ్‌డీఐ గణాంకాలు వెల్లడవుతాయి.

రాబడుల్లో వ్యాల్యూ ఫండ్స్ వెనుకంజ: వ్యాల్యూ ఫండ్స్ గత ఏడాది కాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువను పెంచడంలో వెనుకపడ్డాయి. వీటికంటే సూచీలే మెరుగైన రాబడులు ఇచ్చాయి. ప్రభుత్వ నిబంధనలు, పన్నుల్లో మార్పులు ఇలా ఎన్నో రకాల అంశాలతో పెరగాల్సినంత పెరగని షేర్లలో, మార్కెట్లు పట్టించుకోని సరసమైన విలువలతో ఉన్న స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం వ్యాల్యూ ఫండ్స్ చేసే పని. ఈ విధానమే తక్కువ రాబడులు ఇవ్వడానికి కారణం. ఎందుకంటే ఈ ఫండ్స్ ఐటీ, ఫార్మా స్టాక్స్‌లో ఎక్కువ పెట్టుబడులు పెట్టాయి. గత ఏడాదిగా ఈ రంగాలకు చెందిన షేర్లు పెద్దగా పెరగకపోగా, కొన్ని ఇంకా తగ్గాయి.



నాలుగు రోజుల్లో రూ.5,000 కోట్లు

- డెట్ మార్కెట్లోకి ఎఫ్‌పీఐల పెట్టుబడుల వరద
- అధిక రాబడులే ఆకర్షణీయం

న్యూఢిల్లీ: భారతీయ డెట్ మార్కెట్లు విదేశీ పోర్ట్‌ఫోలియో (ఎఫ్‌పీఐ) ఇన్వెస్టర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. కేవలం గత నాలుగు పని దినాల్లో రూ.5,000 కోట్లు ఇన్వెస్ట్ చేయడం దీన్నే సూచిస్తోంది. స్టాక్ విలువలు గరిష్ట స్థాయిల్లో ఉండడంతో ఎఫ్‌పీఐలు ఇదే సమయలో ఈక్విటీల నుంచి రూ.1,500 కోట్లు వెనక్కి తీసేసుకున్నారు. తాజా గణాంకాల ప్రకారం ఎఫ్‌పీఐలు మన డెట్ మార్కెట్లో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు 811 మిలియన్ డాలర్లు (రూ.5,181 కోట్లు) ఇన్వెస్ట్ చేశారు. అంతకు ముందు ఆరు నెలల కాలంలో (ఫిబ్రవరి నుంచి జూలై వరకు) ఎఫ్‌పీఐలు డెట్ మార్కెట్లో రూ.1.16 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. దీంతో మొత్తం మీద వీరి పెట్టుబడులు డెట్ మార్కెట్లో రూ.1.2 లక్షల కోట్లను దాటేశాయి. దీనికంటే ముందు ఎఫ్‌పీఐలు డెట్ మార్కెట్లో రూ.2,300 కోట్లు ఉపసంహరించుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడుల పరిమితిని సెబీ జూలై నెల మొదట్లో పెంచడం కూడా ఇందుకు కలిసొచ్చింది.

వినూత్న ఫీచర్లతో ఐఫోన్ 7ఎస్!



శాన్‌ఫ్రాన్సిస్కో: త్వరలో యాపిల్ అభిమానులను పలకరించనున్న ఐఫోన్ 7ఎస్, 7ఎస్ ప్లస్‌తోపాటు ఐఫోన్8 మోడళ్లలో వినూత్న ఫీచర్లు దర్శనమివ్వనున్నాయి. వీటికి సంబంధించి ఇవే ఫొటోలు అంటూ ఆన్‌లైన్‌లో కొన్ని దర్శనమిస్తున్నాయి. ఫోన్ల వెనుక భాగం గ్లాస్‌తోపాటు వీటిలో వైర్‌లెస్ చార్జింగ్ ఫీచర్ కూడా ఉండనుందని తెలుస్తోంది. ఈ 3 మోడళ్లను యాపిల్ వచ్చే నెలలో విడుదల చేయనుందన్న వార్తలు రాగా, 2018 ప్రారంభం వరకు రాకపోవచ్చన్న విరుద్ధ వార్తలు కూడా వచ్చాయి. ఏది ఏమైనప్పటికీ వీటి విడుదలకు సంబంధించి సెప్టెంబర్ నాటికి స్పష్టత వస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

కరిగిపోతున్న పసిడి 'పెట్టుబడులు'

ఏప్రిల్ – జూలై మధ్య గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.256 కోట్లు బయటకు...

న్యూఢిల్లీ: పెట్టుబడుల రూపంలో పసిడి ఈ ఏడాది ఏప్రిల్–జూన్ మధ్య వెలవెలబోయింది. ఈ కాలంలో 14 గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) నుంచి రూ. 256 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. అంటే ఈ ఏడాది మార్చి ముగిసే నాటికి 14 ఈటీఎఫ్ హౌస్ వద్ద నిర్వహణలో ఉన్న మొత్తం పసిడి పెట్టుబడుల విలువ మార్చిలో దాదాపు 5,354 కోట్ల వద్ద ఉంటే, ఈ మొత్తం జూలై ముగిసే నాటికి రూ.5,098 కోట్లకు పడిపోయింది. దీనికన్నా ఈక్విటీలే మంచిదని ఈ కాలంలో ఇన్వెస్టర్లు భావించడమే దీనికి కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరిన్ని ముఖ్యాంశాలు...

- నెలవారీగా విత్‌డ్రాయెల్స్ చూస్తే... ఏప్రిల్‌లో రూ.66 కోట్లు, మేలో రూ.71 కోట్లు, జూన్‌లో రూ.81 కోట్లు, జూలైలో 38 కోట్లుగా నమోదయ్యాయి.
- గత ఏడాది చిట్టచివరిసారి రూ.20 కోట్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చాయి. అటు తర్వాత నుంచీ నికరంగా విత్‌డ్రాయెల్స్ కొనసాగుతున్నాయి.
- ఇక ఈక్విటీ, ఈక్విటీ సంబంధ పొదుపు పథకాల్లో (ఈఎల్ఎస్ఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల కాలంలో (ఏప్రిల్–జూలై) రూ.41,000 కోట్లకుపైగా వచ్చి చేరాయి. ఈ కాలంలో స్టాక్ మార్కెట్ మంచి ఊపుమీద ఉండడం గమనార్హం.



- అమెరికా వడ్డీరేట్ల పెంపు, 2018 నాటికి యూరోప్‌లో కూడా ఉద్దీపనలు వెనక్కు తీసుకునే అవకాశాలు పసిడిపై పెట్టుబడులకు సంబంధించి కొంత ప్రతికూల ప్రభావం చూపే అంశాలని ఫండ్స్ ఇండియా. కామ్‌లో పనిచేస్తున్న ఎంఎఫ్ రీసెర్చ్ హెడ్ విద్యా బాల పేర్కొన్నారు.

ఆశలూ ఉన్నాయ్..!

భారత మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) నుంచి అందుతున్న సమాచారం ప్రకారం– వార్షికంగా చూస్తే... గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడుల విషయంలో కొంత ఆశాజనకంగా ఉంది. ఇక్కడ నుంచి బయటకు వెళుతున్న డబ్బు క్రమంగా తగ్గుతూ వస్తుండడమే దీనికి కారణం. 2013–14లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి భారీగా రూ.2,293 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. 2014–15లో ఈ మొత్తం రూ.1,475 కోట్లకు తగ్గగా, అటు తరువాత సంవత్సరాల్లో ఈ మొత్తాలు తగ్గుతూ రూ.903 కోట్లు (2015–16), రూ.775 (2016–17)కోట్లకు దిగివచ్చాయి. ఇక ఈ ఏడాది ఏప్రిల్–జూన్ మధ్య ఈటీఎఫ్ నుంచి రూ. 256 కోట్లు బయటకు వెళ్లిపోతే, గత ఏడాది ఇదే కాలంలో ఈ పరిమాణం ఏకంగా భారీ మొత్తంలో రూ.411 కోట్లుగా ఉంది.

- బాల అభిప్రాయం ప్రకారం– యల్లో మెటల్ దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, డీమోనిటైజేషన్, డాలర్ మారకంలో రూపాయి బలోపేతం వంటి అంశాలు పసిడి ధరను పెరక్కుండా అడ్డుకుంటున్నాయి. ఈ ఏడాది జూన్ వరకూ పసిడి దిగుమతుల పరిమాణాన్ని చూస్తే, ఇది 2016లో మొత్తం దిగుమతుల పరిమాణాన్ని అధిగమించింది.

బ్యాంకింగ్ నుంచి పావుశాతం రేటు కోత

బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా



న్యూఢిల్లీ: భారత్ బ్యాంకింగ్ తానిచ్చే రుణాలపై వడ్డీరేటును పావుశాతం వరకూ తగ్గించే వీలుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా–మెరిలించ్ (బీవోఏఎంఎల్) అంచనా వేసింది. ఇండస్ట్రియల్ బిజీ సీజన్– అక్టోబర్ నెల ప్రారంభం అయ్యేనాటికే ఈ నిర్ణయం తీసుకునే వీలుందని వివరించింది. రుణ వృద్ధికి ఇది దోహదపడుతుందని అంచనావేసింది. ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణ రేటు– రెపోను ఆగస్టు 2వ తేదీన 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన నేపథ్యంలో అంతర్జాతీయ బ్యాంకింగ్ సేవల దిగ్గజం– ఈ అంశంపై తాజా నివేదికను ఆవిష్కరించింది. బ్యాంకింగ్ తనకు రెపో ద్వారా అందిన రేటు ప్రయోజనాన్ని ఆటో, గృహ నిర్మాణ రంగాలకే కాకుండా మిగిలిన రంగాలకూ అందించాల్సిన అవసరం ఉందని పాలసీ సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ చేసిన వ్యాఖ్యలను సైతం నివేదిక ఈ సందర్భంగా ప్రస్తావించింది. అదే విధంగా డీమోనిటైజేషన్ నేపథ్యంలో బ్యాంకింగ్ వద్ద భారీ నగదు లభ్యత (లిక్విడిటీ) ఉండడాన్నీ ఉటంకించింది. మరికొంతకాలం ద్రవ్యోల్బణం దిగువస్థాయిలోనే కొనసాగే వీలుందని పేర్కొంది. జూలై రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 2 శాతంగా అంచనా వేసింది. ఇక డిసెంబర్ పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ రెపోను మరోశాతం తగ్గించే వీలుందని పేర్కొంది.

నేటి బోర్డు మీటింగ్స్

- టాటా స్టీల్
- బ్రిటానియా ఇండస్ట్రీస్
- నాట్కో ఫార్మా
- వర్ల్‌పూల్ ఇండియా
- అమర రాజా బ్యాటరీస్
- మెర్క్
- డాక్టర్ లాల్ పాథ్‌ల్యాబ్స్
- నీల్ కమల్
- క్యాప్లిన్ ల్యాబ్
- లక్ష్మీ మెషీన్ వర్క్స్
- ఎవరెడీ ఇండస్ట్రీస్
- వెల్‌స్పన్

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 7-8-2017

విశాఖ	330-00
చిత్తూరు	365-00
వరంగల్	320-00
ముంబై	363-00
చెన్నై	372-00
విజయవాడ	323-00
గోదావరి	323-00
నమక్కల్	360-00
06-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	318-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.80
బెంగళూరు	360-00
ఢిల్లీ	320-00
కోల్‌కతా	348-00

నిధుల సేకరణలో పీఎస్‌యూ బ్యాంకులు



12 బ్యాంకుల ప్రణాళిక • వీటికి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ (పీఎస్‌యూ) బ్యాంకులు నిధుల వేటలో పడ్డాయి. 12 బ్యాంకులు మార్కెట్ల నుంచి నిధులు సమీకరించనున్నాయి. వీటిలో పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు కూడా ఉన్నాయి. బాసెల్–3 మూలధన అవసరాలను చేరుకునేందుకు బ్యాంకులకు నిధుల అవసరం ఉంది. ఆంధ్రా బ్యాంకు సహా మొత్తం మీద ఆరు నుంచి ఏడు పీఎస్‌యూ బ్యాంకులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే నిధుల సమీకరణను పూర్తి చేయనున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మిగిలిన బ్యాంకులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో), అర్హత గల సంస్థాగత మదుపరులకు షేర్ల కేటాయింపు (క్యూఐపీ) ద్వారా నిధులు సమీకరించనున్నట్టు వెల్లడించాయి.

> ఇంద్రధనుష్ రోడ్‌మ్యాప్ ప్రకారం బాసెల్–3 నిబంధనల మేరకు 2019 మార్చి నాటికి ప్రభుత్వరంగ బ్యాంకులు మార్కెట్ల నుంచి వివిధ రూపాల్లో రూ.1.10 లక్షల కోట్లను సమీకరించాల్సి ఉంటుంది. అదే సమయంలో పీఎస్‌యూ బ్యాంకులకు ప్రభుత్వం నుంచి రూ.70,000 కోట్ల సాయం అందనుంది. ఇందులో రూ.50,000 కోట్లను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం.

పలు అవకాశాలు...

అలహాబాద్ బ్యాంకు,ఆంధ్రా బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, దేనా బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకులు క్యూఐపీ లేదా ఎఫ్‌పీవో లేదా ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ విధానంలో నిధులు సేకరించేందుకు ఇప్పటికే ప్రభుత్వ ఆమోదం కూడా పొందాయి. సిండికేట్ బ్యాంకు, యూకో బ్యాంకు, యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, విజయా బ్యాంకులకు సైతం ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇక అలహాబాద్ బ్యాంకు రూ.2,000 కోట్ల నిధుల సమీకరణకు వాటాదారులు కూడా ఆమోదం తెలిపారు. పీఎన్‌బీ బోర్డు రూ.3,000 కోట్ల నిధుల సమీకరణకు అంగీకారం తెలిపింది. దేనా బ్యాంకు రూ.1,800 కోట్ల సమీకరణకూ వాటాదారులు ఆమోదం తెలియజేశారు. ఎస్‌బీఐ క్యూఐపీ ద్వారా రూ.15,000 కోట్ల సమీకరణను ఇటీవలే పూర్తి చేసిన విషయం తెలిసిందే.

గత వారం హీరోలు

స్టాక్స్	4 ముగింపు	28 ముగింపు	మార్పు(%)
హెచ్‌పీసీఎల్	432	374	15
టైటాన్	610	533	15
ఐఓసీ	418	367	14
హీరో మోటొకార్ప్	3,959	3,632	9
బీపీసీఎల్	517	475	9
ఎన్‌టీపీసీ	177	164	8
ఐషర్ మోటార్స్	31,725	29,333	8

ఎందుకు పెరిగాయంటే...

క్యూ1 ఫలితాల్లో స్థూల రిఫైనింగ్ మార్జిన్‌లు అంచనాలను మించడం తదితర కారణాల వల్ల ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ షేర్లు 9–15 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి. నికర లాభం దాదాపు రెట్టింపు కావడంతో టైటాన్ షేర్ 15 శాతం పెరిగింది. జూలైలో వాహన విక్రయాలు బాగా ఉండటంతో హీరో మోటొకార్ప్, ఐషర్ మోటార్స్ షేర్లు 8–9 శాతం రేంజ్‌లో పెరిగాయి.

గత వారం జీరోలు

స్టాక్స్	4 ముగింపు	28 ముగింపు	మార్పు(%)
గోద్రేజ్ కన్సూమర్ ప్రొడక్ట్స్	961	1,056	-9
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,244	2,462	-9
సన్ ఫార్మా	507	551	-8
లుపిన్	992	1,063	-7
సీమెన్స్	1,363	1,446	-6
కమ్మిన్స్ ఇండియా	935	991	-6
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	57	61	-5

ఎందుకు తగ్గాయంటే...

నిరుత్సాహ ఫలితాలతో గోద్రేజ్ కన్సూమర్, సీమెన్స్, కమ్మిన్స్ ఇండియా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు పడ్డాయి. యూఎస్ ఎఫ్‌డీఏ కఠిన నియమ నిబంధనల వల్ల ఫార్మా షేర్లు తగ్గాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, లుపిన్ షేర్లు 7–9% రేంజ్‌లో నష్టపోయాయి.

ఎన్‌పీఎస్ టైర్–2 ఖాతా అంటే ఏమిటి ?

నేను కొన్నేళ్ళుగా హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 200 ఫండ్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇప్పుడు ఈ సిప్ ముగిసింది. మళ్లీ కొత్తగా దీన్లోనే సిప్ మొదలు పెట్టాలనుకుంటున్నాను. నాది సరైన నిర్ణయమేనా ? లేకుంటే సిప్ కోసం వేరే మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకోమంటారా?


– భవానీ, విజయవాడ

హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 200 ఫండ్‌లో కొన్నేళ్లుగా మీరు సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. అంటే దీర్ఘకాలంలో ఈ ఫండ్ మంచి రాబడులే ఇచ్చి ఉంటుందనే విషయాన్ని మీరు గమనించి ఉంటారు. ఇతర పోటీ ఫండ్స్‌తో పోల్చితే కొన్ని సంవత్సరాల్లో ఈ ఫండ్ పనితీరు బాగాలేకపోయినా, మొత్తం మీద ఈ ఫండ్ సంతృప్తికరమైన పనితీరునే కనబరిచింది. అయితే ఇటీవల కాలంలో ఈ ఫండ్ పనితీరులో మరింత మెరుగుదల కనిపిస్తోంది. ఎలాంటి సంశయాలు పెట్టుకోకుండా ఈ ఫండ్‌లో మీ సిప్‌ను కొనసాగించండి. మార్కెట్ గరిష్ట స్థాయిలో ఉన్నా, పతన బాటలో ఉన్నా సిప్‌ను కొనసాగించడానికి వెనకాడవద్దు. స్వల్పకాలంలో ఈ ఫండ్ పనితీరు ఒడిదుడుకులమయంగా ఉన్నప్పటికీ, సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా కాంపౌండింగ్ ప్రయోజనాలు పొందవచ్చు. అందుకని నిరభ్యంతరంగా ఈ ఫండ్‌లో సిప్ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొత్తగా మొదలు పెట్టవచ్చు.

ఎన్‌పీఎస్ టైర్–2 ఖాతా అంటే ఏమిటి ? దీంట్లో ఇన్వెస్ట్ చేస్తే మంచి ప్రయోజనాలు లభిస్తాయని మిత్రులంటున్నారు. ఇది నిజమేనా?

– శ్రీనివాస్, విశాఖపట్టణం

ఎన్‌పీఎస్ (నేషనల్ పెన్షన్ సిస్టమ్) టైర్ వన్ అకౌంట్ ఉన్నవాళ్లే, ఎన్‌పీఎస్ టైర్–2 అకౌంట్‌ను ప్రారంభించడానికి అర్హులు. ఎన్‌పీఎస్ టైర్–2 ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఎలాంటి లాక్–ఇన్ పీరియడ్ ఉండదు. కాబట్టి ఈ అకౌంట్ నుంచి ఎప్పుడైనా డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ కన్నా కూడా ఇది మెరుగైన ప్రత్యామ్నాయం. అయితే బ్యాంక్ ఎఫ్‌డీ అయితే తక్షణం ఉపసంహరించుకోవచ్చు. ఎన్‌పీఎస్ టైర్–2 ఖాతాలో మాత్రం డబ్బుల ఉపసంహరణకు మూడు రోజులు పడుతుంది. ఇదొక్కటే దీనికి ఉన్న ప్రతికూలాంశం. మూడేళ్ల కాలానికి గాను ఎన్‌పీఎస్ టైర్–2 ఖాతా నుంచి 11.5 శాతం నుంచి 14 శాతం రేంజ్‌లో రాబడులు పొందవచ్చు. అయితే ఎన్‌పీఎస్ టైర్–వన్ ఖాతాకు లభించినట్లుగా ఈ ఎన్‌పీఎస్–టైర్–2 ఖాతా రాబడులపై ఎలాంటి పన్ను రాయితీలు లభించవు. దీంట్లో ఏడాదికి కనీసం రూ.6,000 ఇన్వెస్ట్ చేయాలి. స్వల్పకాల అవసరాలకు డెట్ ఫండ్స్‌లో కన్నా టైర్ -2 ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. దీంట్లో వ్యయాలు తక్కువగా ఉంటాయి. పైగా, రాబడులు కూడా మెరుగ్గానే ఉంటాయి. అయితే ఎన్‌పీఎస్ టైర్–2లో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మూడేళ్లకు మించి కొనసాగిస్తే, ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఉపసంహరించుకున్నప్పుడు కొంత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ పన్ను భారం స్వల్పంగానే ఉంటుంది.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

డెట్ ఫండ్స్‌లో ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టవచ్చా?

– జగన్, ఈ మెయిల్ ద్వారా

ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్‌లో ఒకేసారి పెట్టుబడులు పెట్టడం సరికాదు. కానీ డెట్ ఫండ్స్‌లో ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టవచ్చు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల మాదిరి డెట్ ఫండ్స్ భారీ ఒడిదుడుకులకు గురికావు. అందుకని డెట్ ఫండ్స్‌లో ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టినా, ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే ఇలా ఒకేసారి డెట్ ఫండ్స్‌లో పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కంటే కూడా ఈక్విటీ, లేదా బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు పొందవచ్చు. డెట్ ఫండ్స్‌తో పోల్చితే ఈక్విటీ ఫండ్స్‌లో పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

నేను గడువులోపల ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయలేకపోయాను. ఈ అసెస్‌మెంట్ ఇయర్(2017–18)కు ఐటీఆర్ దాఖలు చేసే అవకాశం లేదా?

– నిహారిక, హైదరాబాద్


ఈ అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి ఐటీఆర్ దాఖలును ఈ ఏడాది జూలై 31లోపు దాఖలు చేయాల్సి ఉంది. అయితే ఈ గడువును కేంద్ర ప్రభుత్వం ఈ నెల 5 వరకూ పొడిగించింది. ఈ గడువులోగా కూడా ఐటీఆర్‌ను దాఖలు చేయలేని వాళ్లు బిలేటెడ్ రిటర్న్‌లను దాఖలు చేయవచ్చు. ఈ అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి ఈ బిలేటెడ్ రిటర్న్‌లను వచ్చే ఏడాది మార్చి 31లోపు దాఖలు చేసుకోవచ్చు. అయితే గడువు తేదీ తర్వాత ఐటీఆర్‌లు దాఖలు చేయని వాళ్లు.. అంటే ఈ నెల 5 లోపు ఐటీఆర్‌లను దాఖలు చేయలేనివాళ్లు కొన్ని ప్రయోజనాలు కోల్పోతారు. కొంత జరిమానా చెల్లించాల్సి రావచ్చు. గడువులోపు ఐటీఆర్‌లు దాఖలు చేస్తే లభించే ప్రయోజనాలు గడువు తీరిన తర్వాత దాఖలు చేసే ఐటీఆర్‌లకు లభించవు. అంతకు ముందు సంవత్సరాల్లో పొందిన నష్టాలను క్యారీ ఫార్వార్డ్ చేసుకొని తర్వాతి సంవత్సరాల్లో వచ్చే లాభాలతో రద్దు చేసుకునే అవకాశం కోల్పోతారు. మరోవైపు ఏమైనా పన్నులు చెల్లించాల్సి ఉంటే, వాటిపై వడ్డీకూడా చెల్లించాల్సి ఉంటుంది. అంతే కాకుండా ఒకవేళ ట్యాక్స్ రిఫండ్ వచ్చే అవకాశాలున్నట్లయితే, ట్యాక్స్ రిఫండ్‌ల్లో సాధారణం కంటే అధిక కాలం జాప్యం జరగవచ్చు.

సెన్సెక్స్ తక్షణ మద్దతు 32,100

మార్కెట్ పంచాంగం


భారత్‌తో పాటే పలు ప్రపంచ సూచీలు ఇంకా కొత్త రికార్డుస్థాయిల్ని నమోదుచేస్తున్నప్పటికీ, హెచ్చుతగ్గుల తీవ్రత పెరిగింది. గత మూడు వారాల్లోనూ భారత్ సూచీలు రెండు దఫాలు 1.5–2 శాతం నష్టాల్ని కేవలం రెండు–మూడు రోజుల్లో చవిచూసాయి. ఇదేతరహా ట్రెండ్ అమెరికా, యూరప్‌ల్లోనూ, జపాన్ మినహా మిగతా ఆసియా సూచీల్లోనూ కన్పిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో పెరిగిన రిస్క్‌ను ఈ ట్రెండ్ సూచిస్తున్నది. అలాగే పలు షేర్లు కొత్త గరిష్టస్థాయిల్ని చూస్తుండగా, మరికొన్ని షేర్లు నూతన కనిష్ట స్థాయిల్ని సైతం తాకుతున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు, దేశీయ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలను చురుగ్గా మారుస్తూ వుండటమే ఇందుకు కారణం కావొచ్చు. ఇక సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే..,

సెన్సెక్స్ సాంకేతికాలు




ఆగస్టు 4తో ముగిసినవారంలో బీఎస్ఈ సెన్సెక్స్ సరికొత్త రికార్డుస్థాయి 32,686 పాయింట్ల వద్దకు చేరిన తర్వాత..గత శుక్రవారం 32,108 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమయ్యింది. అటుపైన వేగంగా కోలుకుని, 32,325 పాయింట్ల వద్ద ముగిసింది. అంతక్రితంవారంతో పోలిస్తే 15 పాయింట్ల స్వల్పలాభాన్ని ఆర్జించింది. ఆల్‌టైమ్ రికార్డుస్థాయి నుంచి 500 పాయింట్లకుపైగా క్షీణించడం వరుసగా ఇది రెండోవారం. అలాగే క్షీణించిన ఈ రెండు సందర్భాల్లోనూ 32,100 సమీపంలో మద్దతు పొందడం విశేషం. అందుచేత ఈ వారం 31,100 పాయింట్ల స్థాయే సెన్సెక్స్‌కు తక్షణ మద్దతుస్థాయి. ఈ లోపు ముగిస్తే 31,800 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ మద్దతును కూడా కోల్పోతే...31,620 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ వారం మార్కెట్ పెరిగితే 32,500 పాయింట్ల సమీపంలో తొలి అవరోధం కలగవచ్చు. ఆపైన ముగిస్తే తిరిగి గతవారపు గరిష్టస్థాయి 32,680 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తే 33,000 శిఖరంపై పాగా వేసేచాన్స్ వుంటుంది.

నిఫ్టీ తక్షణ మద్దతు 9,990



నిఫ్టీ గతవారం ద్వితీయార్థంలో 10,138 పాయింట్ల కొత్త రికార్డు గరిష్టస్థాయి వరకూ ర్యాలీ జరిపి, ఆ తర్వాత 9,990 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. తర్వాత వేగంగా కోలుకుని చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 52 పాయింట్ల లాభంతో 10,066 పాయింట్ల వద్ద ముగిసింది. క్రితంవారంలానే మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనైతే గతవారం వరుసగా రెండురోజులపాటు మద్దతుగా నిల్చిన 9,990 పాయింట్ల సమీపంలో తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయి దిగువన ముగిస్తే 9,840 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఈ దిగువన 9,790 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ వారం మార్కెట్ పెరిగితే 10,100 పాయింట్ల వద్ద తక్షణ అవరోధం. ఆపైన మరోదఫా 10,140 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన ముగిస్తే 10,250 పాయింట్ల వరకూ ర్యాలీ జరిపే ఛాన్స్ వుంటుంది.

– పి. సత్యప్రసాద్



సెమీఫైనల్స్‌కు నిర్మల అర్హత

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల 400 మీటర్ల విభాగంలో భారత అథ్లెట్ నిర్మలా షెరోన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఆదివారం జరిగిన 400 మీటర్ల హీట్స్‌లో 22 ఏళ్ల నిర్మల 52.01 సెకన్లలో గమ్యానికి చేరి నాలుగో స్థానంలో నిలిచింది. సోమవారం మూడు సెమీఫైనల్స్ జరుగుతాయి. పురుషుల మారథాన్ రేసులో టి. గోపీ 28వ స్థానంలో నిలువగా... 110 మీటర్ల హార్డిల్స్‌లో సిద్ధాంత్ హార్డిల్స్‌లోనే నిష్క్రమించాడు.

చిరుత చిన్నబోయింది!

- తన కెరీర్ చివరి 100 మీటర్ల రేసులో బోల్ట్‌కు కాంస్య పతకం
- ఫైనల్లో 9.95 సెకన్లతో మూడో స్థానం
- 9.92 సెకన్లతో గాట్లిన్ సంచలన విజయం
- 9.94 సెకన్లతో కోల్మన్‌కు రజతం
- శనివారం 4×100 మీటర్ల రిలేలో పోటీపడనున్న జమైకా స్టార్

కలయా... నిజమా! పదేళ్లుగా 100 మీటర్ల ట్రాక్‌పై తన విశ్వరూపం ప్రదర్శించిన 'జమైకా చిరుత' ఉసేన్ బోల్ట్ కెరీర్ చివరి రేసులో మాత్రం చిన్నబోయాడు. ఎవ్వరూ ఊహించని విధంగా మూడో స్థానంలో నిలిచాడు. విశ్వవ్యాప్తంగా తన అభిమానులందరినీ నిరాశపరిచాడు. సెమీస్‌లో నెమ్మదిగా పరుగెత్తి రెండో స్థానంలో నిలిస్తే... ఫైనల్ రేసు కోసం వ్యూహాత్మకంగా బోల్ట్ తన శక్తినంతా దాచుకున్నాడని అందరూ భావించారు. కానీ అసలు రేసులోనూ ఈ జమైకా దిగ్గజం తడబడ్డాడు. ఈ క్రమంలో విశ్వవేదికపై తన కెరీర్‌లో చివరి 100 మీటర్ల రేసులో తొలిసారి మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు.


బోల్ట్

లండన్: అందరి అంచనాలు తలకిందులయ్యాయి. ట్రాక్‌పై అడుగు పెడితే స్వర్ణం తప్ప మరో పతకం ఊహించని ఉసేన్ బోల్ట్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. చివరిసారి 100 మీటర్ల రేసులో బరిలోకి దిగి పసిడి పతకంతో కెరీర్‌కు చిరస్మరణీయ ముగింపు పలకాలని బోల్ట్ ఆశించగా... అమెరికా వెటరన్ స్టార్ జస్టిన్ గాట్లిన్ నమ్మశక్యంకాని రీతిలో బోల్ట్‌కు షాక్ ఇచ్చి జమైకా దిగ్గజం ఆశలను అడియాసలు చేశాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 2 గంటల 15 నిమిషాలకు విఖ్యాత లండన్ ఒలింపిక్ స్టేడియంలో 60 వేల మంది ప్రేక్షకుల నడుమ పురుషుల 100 మీటర్ల ఫైనల్ రేసు జరిగింది.

గమ్యం చేరారిలా...

1.	గాట్లిన్	అమెరికా	9.92 సెకన్లు
2.	కోల్మన్	అమెరికా	9.94 సెకన్లు
3.	బోల్ట్	జమైకా	9.95 సెకన్లు
4.	బ్లేక్	జమైకా	9.99 సెకన్లు
5.	సింబిని	దక్షిణాఫ్రికా	10.01 సెకన్లు
6.	జిమ్మీ వికాట్	ఫ్రాన్స్	10.08 సెకన్లు
7.	ప్రెస్కోడ్	బ్రిటన్	10.17 సెకన్లు
8.	బింగ్తియాన్ సు	చైనా	10.27 సెకన్లు

ఎనిమిది మంది బరిలోకి దిగిన ఈ ఫైనల్లో గాట్లిన్ 9.92 సెకన్లలో గమ్యానికి చేరుకొని విజేతగా నిలిచాడు. క్రిస్టియన్ కోల్మన్ (అమెరికా) 9.94 సెకన్లతో రెండో స్థానం, ఉసేన్ బోల్ట్ 9.95 సెకన్లతో మూడో స్థానం సంపాదించారు.

ఆరంభం నుంచే వెనుకంజ...

సాధారణంగా రేసు ఆరంభంలో నెమ్మదిగా పరుగెత్తి... ఆ తర్వాత ఒక్కసారిగా వేగం పెంచి... చివర్లో తన ప్రత్యర్థులను వెనక్కి నెడుతూ లక్ష్యం వైపు దూసుకుపోవడం బోల్ట్ శైలి. కానీ ఈ రేసులో మాత్రం అలా జరగలేదు. రేసు మొదలైన క్షణం నుంచే బోల్ట్ వెనుకబడ్డాడు. రేసు ప్రారంభించడానికి ఎనిమిది మంది అథ్లెట్స్ తీసుకున్న స్పందన సమయంలో బోల్ట్ ఏడో స్థానంలో ఉన్నాడు. అందరికంటే వేగంగా స్పందించిన కోల్మన్, గాట్లిన్, యోహాన్ బ్లేక్, అకాని సింబని, ప్రెస్కోడ్, జిమ్మీ వికాట్ ముందుకు దూసుకుపోతుండగా వీరిని అందుకోవడానికి బోల్ట్ తీవ్రంగా ప్రయత్నించాడు. చివరకు 90 మీటర్ల వద్ద కోల్మన్‌ను బోల్ట్ అందుకున్నట్లే అనిపించినా... మరోవైపు ఎవ్వరూ అంతగా పట్టించుకోని జస్టిన్ గాట్లిన్ తన అనుభవాన్నంతా రంగరించి బుల్లెట్ వేగంతో దూసుకుపోయి అందరికంటే వేగంగా గమ్యానికి చేరుకున్నాడు. 0.2 సెకన్ల తేడాతో కోల్మన్‌కు రెండో స్థానం, 0.1 సెకన్ల తేడాతో బోల్ట్‌కు మూడో స్థానం లభించాయి.

వెక్కిరింతల నడుమ విజయం...



గతంలో రెండుసార్లు (2001లో, 2006లో) డోపింగ్‌లో దొరికిపోయి ఆరేళ్ల పాటు నిషేధం ఎదుర్కొన్న 35 ఏళ్ల జస్టిన్ గాట్లిన్ తాజా ఫలితంతో సంబరాలు చేసుకున్నాడు. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ వేదికపై బోల్ట్‌ను ఓడించాలని ఐదుసార్లు ప్రయత్నించి నాలుగుసార్లు రెండో స్థానంతో, మరోసారి మూడో స్థానంతో సరిపెట్టుకున్న గాట్లిన్ ఈసారి మాత్రం తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడు. డోపింగ్ నేపథ్యం ఉండటంతో... లండన్ ఒలింపిక్స్, రియో ఒలింపిక్స్‌లో మాదిరిగా ఈసారీ గాట్లిన్‌కు ప్రేక్షకుల నుంచి వెక్కిరింతలు ఎదురయ్యాయి. హీట్స్‌లో, సెమీఫైనల్లో, ఫైనల్లో అతను ట్రాక్‌పై వచ్చినపుడు, అతడిని పరిచయం చేసినపుడు ప్రేక్షకులు గోల చేశారు. అయినా ఇవేమీ పట్టించుకోని గాట్లిన్ ఆఖరికి విజేతగా నిలిచి అందరి నోళ్లు మూయించాడు. రేసు పూర్తయ్యాక ఫలితం వచ్చిన వెంటనే గాట్లిన్... బోల్ట్‌కు ఎదురువెళ్లి మోకాళ్లపై కూర్చొని అభివాదం చేసి తన క్రీడాస్ఫూర్తిని చాటుకున్నాడు. మరోవైపు గాట్లిన్ విజయానికి అర్హుడని, అతనికి వెక్కిరింతలు అవసరంలేదని బోల్ట్ వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ పోటీల్లో 100 మీటర్ల ఫైనల్ రేసులో బోల్ట్‌కు ఎదురైన రెండో ఓటమి ఇదే కావడం గమనార్హం. చివరిసారి 2013 జూన్‌లో రోమ్‌లో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో బోల్ట్‌కు గాట్లిన్ చేతిలోనే ఓటమి ఎదురైంది.

కొత్త స్టార్ వచ్చాడు...




రియో ఒలింపిక్స్ తర్వాత అంతగా ఫామ్‌లో లేని బోల్ట్‌కు గాట్లిన్ నుంచి గట్టిపోటీ ఎదురవుతుందని... అయితే గతంలో మాదిరిగానే ఈసారీ గాట్లిన్‌ను బోల్ట్ ఓడిస్తాడని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా బోల్ట్‌కు గాట్లిన్ నుంచి కాకుండా అమెరికాకే చెందిన 21 ఏళ్ల రైజింగ్ స్టార్ క్రిస్టియన్ కోల్మన్ నుంచి పోటీ ఎదురైంది. రెండు గంటల వ్యవధిలో బోల్ట్‌ను (సెమీఫైనల్, ఫైనల్) రెండుసార్లు ఓడించిన కోల్మన్ 100 మీటర్ల విభాగంలో భవిష్యత్ తారగా తెరపైకి వచ్చాడు. బోల్ట్, గాట్లిన్ రిటైర్మెంట్ తర్వాత 100 మీటర్ల ఈవెంట్‌కు ఆదరణ తగ్గకుండా తాను ఉన్నానని తాజా ప్రదర్శనతో కోల్మన్ నిరూపించుకున్నాడు.

ఆనంద్‌కు మరో 'డ్రా'

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్వీఫీల్డ్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ వరుసగా నాలుగో 'డ్రా' నమోదు చేశాడు. లెవాన్ అరోనియన్ (అర్మేనియా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను ఆనంద్ 27 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్ తర్వాత ఆనంద్ రెండు పాయింట్లతో మరో నలుగురితో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు. మూడు పాయింట్లతో మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్) అగ్రస్థానంలో ఉన్నాడు.

థ్యాంక్యూ... బోల్ట్!



క్రికెట్‌లో డాన్ బ్రాడ్‌మన్ తన ఆఖరి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయ్యాడు... అయితే అతని గొప్పతనంలో ఒక్క పరుగంత తేడా కూడా రాలేదు!

బాక్సింగ్ దిగ్గజం మొహమ్మద్ అలీ తన చివరి రెండు బౌట్‌లలో చిత్తయ్యాడు... కానీ అది అతని పంచ్‌ల పవర్‌ను తక్కువ చేయలేదు!

ఎనిమిది ఒలింపిక్ స్వర్ణాలు... 11 ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణాలు... 100 మీటర్ల పరుగులో టాప్–3 టైమింగ్స్... దశాబ్దకాలం పాటు స్ప్రింట్స్‌లో ఏకఛత్రాధిపత్యం... డోపింగ్‌లాంటి ఒక్క మరక కూడా అంటకుండా, వివాదమే లేకుండా సాధించిన విజయాలు... ఇలాంటి ఘనతలన్నీ ఉసేన్ బోల్ట్‌కు మాత్రమే సాధ్యమయ్యాయి. చివరి రేసులో స్వర్ణం దక్కనంత మాత్రాన ఈ 'ఆల్‌టైమ్ గ్రేట్' ఆకాశమంత ఇమేజ్‌కు కించిత్ కూడా భంగం వాటిల్లదు. అద్భుతం అనే మాటను ఎప్పుడో తనకు పర్యాయపదంగా మార్చుకున్న ఈ జమైకా స్టార్ క్రీడా ప్రపంచంపై వేసిన ముద్ర చెరిగిపోనిది. ప్రపంచ అథ్లెటిక్స్‌ను శాసించిన అతని 'టు ద వరల్డ్' సిగ్నేచర్ స్టయిల్ రాబోయే తరాల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది. గొప్ప ఆటగాళ్ల కెరీర్‌లకు గొప్ప ముగింపు లభించకపోవచ్చు. కానీ ఆటలో మాత్రం వారు ఎప్పటికీ చిరంజీవిగానే మిగిలిపోతారు. ఇంత కాలం మమ్మల్ని అలరించినందుకు థ్యాంక్యూ బోల్ట్...!

సాక్షి క్రీడా విభాగం

100 మీటర్ల పరుగులో నమోదైన అత్యుత్తమ టాప్–30 జాబితా (9.8 సెకన్ల లోపు) తీస్తే అందులో 9 చోట్ల ఉసేన్ బోల్ట్ పేరుంది. అయితే ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. కానీ మిగతా 23 టైమింగ్‌లను నెలకొల్పిన వారి పేర్లను చూస్తే వారంతా ఏదో ఒకసారి డోపింగ్‌లో పట్టుబడినవారే! అంటే 30లో బోల్ట్ మినహా మరే ఇతర పేరు అక్కడ కనిపించదు. ఇందులో గాట్లిన్, టైసన్ గే, యోహాన్ బ్లేక్, అసఫా పావెల్... ఇలా అంతా బోల్ట్ తరంలోని వారు, అగ్రస్థానం కోసం అతనితో పోటీ పడినవారే. ఇది చాలు బోల్ట్ గొప్పతనాన్ని చెప్పేందుకు. ఒకదశలో డోపింగ్ అనేది అథ్లెటిక్స్‌లో భాగంగా మారిపోయేంత ప్రమాదకర స్థితికి చేరిన సమయంలో కూడా ఈ సూపర్ స్టార్ తన గౌరవాన్ని నిలబెట్టుకున్నాడు. వరుసగా మూడు ఒలింపిక్స్‌లలో అతని ఆధిపత్యం ముందు మరే పేరు వినిపించలేదు. 100 మీటర్లు, 200 మీటర్లు, 4×100 మీటర్ల రిలేలలో బోల్ట్ సాధించిన స్వర్ణాలు అతని అసాధారణ ప్రతిభకు నిదర్శనం. ఇక మూడు ప్రపంచ రికార్డులు అతని పేరిటే ఉన్నాయి.

తప్పనిసరి పరిస్థితుల్లోనే...

వాస్తవానికి గత ఏడాది రియో ఒలింపిక్స్ తర్వాతే బోల్ట్ రిటైర్ కావాలని నిర్ణయించుకున్నాడు. అయితే తన కాంట్రాక్ట్ కారణంగా మరో ఏడాది ట్రాక్‌లో కొనసాగాల్సి వస్తోందని అతను ముందే చెప్పాడు. తను ఆట ముగించే సమయం వచ్చిందని బోల్ట్‌కు ముందే తెలుసు! అందుకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అతను కావాలనే 200 మీటర్ల పరుగు నుంచి తప్పుకున్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఈవెంట్‌లో ఆంద్రీ డీ గ్రేస్‌ను గానీ వేడ్ నికెర్క్‌ను గానీ ఓడించలేనని తనకు తెలుసంటూ బోల్ట్ సన్నిహితుల వద్ద చెప్పుకున్నాడు. ఈ సీజన్‌లో సొంతగడ్డ కింగ్‌స్టన్‌లో జరిగిన రేసర్స్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచినా...10.03 సెకన్ల టైమింగ్‌తో అతను తీవ్ర నిరాశ చెందాడు. ఆ తర్వాత చెక్ రిపబ్లిక్‌లో గోల్డెన్ స్పైక్ రేసులో కూడా బోల్ట్ రేస్ పూర్తి చేసేందుకు 10.06 సెకన్లు తీసుకున్నాడు. 2004లో ప్రొఫెషనల్‌గా మారిన తర్వాత వరుసగా రెండు ఈవెంట్లలో అతనికి 10 సెకన్లకు పైగా పట్టడం ఎప్పుడూ జరగలేదు! ఆ తర్వాత మొనాకో డైమండ్ లీగ్‌లో 9.95 సెకన్లతో విజయం సాధించడం బోల్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్ ప్రదర్శనపై ఆశలు రేపింది. శనివారం అతను మూడో స్థానంలో నిలిచిన రేస్‌ను చూస్తే బోల్ట్ సత్తా తగ్గినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కొన్నాళ్ల క్రితమే తన ఆత్మీయ మిత్రుడు జర్మైన్ మాసన్ ఒక దుర్ఘటనలో చనిపోవడం కూడా అతనిపై ఇటీవల మానసికంగా తీవ్ర ప్రభావం చూపించింది.

ఆ వేడుకలు ముగిశాయి...

15 ఏళ్ల వయసులో 2002లో తొలిసారి వరల్డ్ జూనియర్ చాంపియన్‌గా నిలిచిన క్షణం బోల్ట్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు బోల్ట్ క్రీడా ప్రపంచాన్ని, అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. సెకనులో వందో వంతు వ్యవధిలో జీవితాలు మారిపోయే ఆటలో అతను తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే వచ్చాడు. బోల్ట్ తనకుతాను కొత్త లక్ష్యాలు విధించుకుంటూ పరుగు కొనసాగించాడు. వాటిని అంతే అలవోకగా తానే అధిగమిస్తూ పోయాడు. పరుగు పూర్తి కాగానే తన గుండెలపై బలంగా బాది సింహనాదం చేయడం... తనదైన స్పెషల్ 'పోజు'తో కెమెరా కళ్లకు కనువిందు చేయడం... మైదానమంతా కలియదిరిగి అభిమానులకు ఆనందం పంచడం బోల్ట్‌కే చెల్లింది. అప్పటి వరకు నిస్సారంగా కనిపించిన అథ్లెటిక్స్ స్టేడియంలో మెరుపులా వచ్చి జీవం నింపడం అతనికే సాధ్యం. ఇకపై ఇలాంటివన్నీ కనిపించవు.

ఒక్కసారి పరుగు ప్రారంభమైందంటే పది సెకన్ల పాటు కన్నార్పకుండా చూసే అభిమానులు కూడా కొన్నాళ్ల పాటు వంద మీటర్లకు విరామం ఇవ్వక తప్పదేమో! ప్రతీ కథకు ఎక్కడో ఒక చోట ముగింపు ఉంటుంది. అయితే ఆరంభం అద్భుతమైనప్పుడు అంతం కూడా అంతే ఆసక్తిని రేకెత్తించడం సహజం. ఆఖరి రేస్‌లో ఓడినా... ఇక ముందు కూడా రాబోయే ప్రపంచం అతడిని అందుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది.

> పబ్‌లో కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకునే సమయంలో ప్రపంచంలో అత్యుత్తమ ఫుట్‌బాలర్ ఎవరు అనే చర్చ వస్తే అందరూ ఒక్కో పేరు చెబుతారు. గోల్ఫ్‌లో అయినా, టెన్నిస్‌లో అయినా వారి అభిప్రాయాల్లో కచ్చితంగా తేడాలు ఉంటాయి. కానీ స్ప్రింట్ విషయానికి వస్తే గుడ్డిగా, మరో మాటకు తావు లేకుండా అంతా బోల్ట్‌కే ఓటు వేస్తారు.
>
> –సెబాస్టియన్ కో, ఐఏఏఎఫ్ అధ్యక్షుడు

మరో అవకాశం ఉంది...

తనకెంతో ప్రత్యేకమైన 100 మీటర్ల ఈవెంట్‌ను స్వర్ణంతో ముగించాలని ఆశించిన బోల్ట్‌కు నిరాశ ఎదురైనా... తన ఓవరాల్ కెరీర్‌కు పసిడితో వీడ్కోలు పలికేందుకు జమైకా స్టార్‌కు మరో అవకాశం మిగిలి ఉంది. తన సహచరులతో కలిసి బోల్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనే ఈనెల 12న జరిగే 4×100 మీటర్ల రిలేలో పాల్గొననున్నాడు. గత నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో బోల్ట్ సభ్యుడిగా ఉన్న జమైకా జట్టు 4×100 మీటర్ల రిలేలో స్వర్ణాలు గెలిచింది. మరీ ఈసారి ఫలితం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

> ఎలాంటి బాధా లేదు. ఇక్కడికి వచ్చి నా శాయశక్తులా ప్రయత్నించాను. ఇక్కడ గెలిచినా, ఓడినా ఫలితంతో సంబంధం లేకుండా ఆట ముగించాలని ముందే నిర్ణయించుకున్నాను. నా కెరీర్‌పై దీని ప్రభావం ఏమాత్రం ఉండదు. నా కోసం ఈ ఆట కోసం నేనేం చేయాలో అంతా చేశాను. ఇక నిష్క్రమించాల్సిన సమయం వచ్చింది. ఒక పోరాట యోధుడి (గాట్లిన్) చేతిలో, మంచి భవిష్యత్తు ఉన్న మరో ప్రతిభావంతుడి (కోల్మన్) చేతిలో ఇక్కడ ఓడిపోయాను. ఈ సీజన్‌లో ఎలాంటి ఫలితాలు వస్తాయనేది ఆలోచించకుండా అభిమానుల కోసమే బరిలోకి దిగాను. నేను చాలా కష్టపడ్డాను కాబట్టి కొంత నిరాశ ఉండటం సహజం. ఓడిపోతే ఎవరూ సంతోషించరు కదా. కానీ నా అత్యుత్తమ ఆట కనబర్చానని నాకు బాగా తెలుసు. మంచి ఆరంభం లభించకపోవడంతో నేను గెలవడం కష్టమని అర్థమైపోయింది. గాట్లిన్ ఎన్నో సంవత్సరాలుగా కఠినంగా శ్రమించాడు. అతనికి గెలిచే అర్హత ఉంది. ఒక వ్యక్తిగా, పోటీదారుడిగా కూడా నేను అతడిని ఎంతో గౌరవిస్తాను.
>
> –ఉసేన్ బోల్ట్

రికార్డుల రారాజు

ఒలింపిక్స్ (2008, 2012, 2016): 8 స్వర్ణాలు	
ప్రపంచ చాంపియన్‌షిప్ (2007, 2009, 2011, 2013, 2015, 2017): 11 స్వర్ణాలు, 2 రజతాలు, 1 కాంస్యం (వచ్చే వారం మరో పతకం చేరే అవకాశం ఉంది)	
ఇతర అంతర్జాతీయ పతకాలు: 4 స్వర్ణాలు, 3 రజతాలు	
బోల్ట్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డులు	
100 మీ. పరుగు: 9.58 సెకన్లు	
200 మీ. పరుగు: 19.19 సెకన్లు	
4×100 మీ. రిలే: 36.84 సెకన్లు (జమైకా జట్టులో సభ్యుడు)	

● ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు పొందిన వారికి బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు.

చెక్కు కావాలంటే డబ్బులివ్వాలి

- రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం సాయం కోరిన రైతు
- పార్టీ నేత ద్వారా చెక్కు పంపిన ప్రభుత్వం.. సీఎం సహాయ నిధిలో వాటా అడిగిన టీడీపీ నేత
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితుడు కె.వెంకటరాజు

సుండుపల్లి: అతను ఓ సాధారణ రైతు. భార్య ఇద్దరు కుమార్తెలతో కలసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో అప్పు చేసి కాలుకు ఆపరేషన్ చేయించుకున్నాడు. సాయం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేశాడు. పార్టీ ప్రచారం కోసం, ఓటు బ్యాంకు తయారీ కోసం ప్రభుత్వం పరిహారానికి సంబంధించిన చెక్కును పోస్టు ద్వారా పంపకుండా అధికార పార్టీ నాయకుల చేతిలో పెట్టింది. ఇదే అవకాశంగా సదరు నాయకుడు ఆ సొమ్ములో వాటా కోరాడు. తాను ఇచ్చుకోలేనని బాధిత రైతు చెప్పడంతో రెండు నెలలుగా చెక్కు ఇవ్వలేదు. తుదకు దిక్కుతోచని బాధితుడు పోలీసులను ఆశ్రయించిన వైనమిది. బాధితుడు వెల్లడించిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా రాజంపేట నియోజకవర్గం సుండుపల్లి మండలం వెంగంరాజుగారిపల్లికి చెందిన కె.వెంకటరాజు జనవరి 1న పొలంకు వెళుతుండగా వాహనం ఢీ కొనడంతో కాలికి గాయమైంది. అదే నెల 19న తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. తనను ఆదుకోవాలని ఏప్రిల్ 26న ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. తనకు ఆర్థిక సహాయం మంజూరైనట్లు, ఆ మేరకు చెక్కు పంపుతున్నట్లు మే 17న సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. జూన్ మొదటి వారంలో టీడీపీ నేత శివరామనాయుడు మరో వ్యక్తి ప్రసాద్‌తో కలసి వెంకటరాజు ఇంటి వద్దకు వెళ్లారు. 'నీకు రూ.1.02 లక్షల చెక్కు వచ్చింది. ఇందులో రూ.80 వేలు మీరు తీసుకోండి. మిగతా రూ.22 వేలు మాకు ఇవ్వాలి' అని అడిగారు. ఇందుకు బాధితుడు ఒప్పుకోకపోవడంతో చెక్కును ఇవ్వకుండా వెళ్లిపోయారు. కాగా, తనకు రూ.1.12 లక్షలు సాయం మంజూరైనట్లు మెసేజ్ వచ్చిందని, టీడీపీ నాయకులు మాత్రం రూ.1.02 లక్షలే అంటున్నారని వెంకటరాజు వాపోతున్నాడు. ఈ విషయమై ఇతను టీడీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డిని కలసి గోడు వెల్లబోసుకున్నాడు. న్యాయం చేస్తానని చెప్పి మూడు వారాలైనా పట్టించుకోక పోవడంతో 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చాడు. ఆదివారం సుండుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

518 మంది ఏఈఈలకు నేడు నియామక పత్రాలు

అందజేయనున్న సీఎం

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన 518 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లలకు(ఏఈఈ) సీఎం చంద్రబాబు సోమవారం నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ ఏఈఈలు సోమవారం ఉదయం 10 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకోవాలని జలవనరుల శాఖ ఈఎన్‌సీ(పరిపాలన) గిరిధర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

చండీయాగానికి రండి

శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీకి ఆహ్వానం



స్వామీజీకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

పెందుర్తి: నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ లోకకల్యాణార్థం నాగోల్‌లో తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగానికి రావలసిందిగా శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీని ప్రముఖ విద్యావేత్త అరిమండ వరప్రసాద్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆదివారం ఆయన రుషికేష్‌లోని శారదాపీఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ముందుగా ఇరువురు పవిత్ర గంగానదిలో స్నానమాచరించి పీఠంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామీజీ మాట్లాడుతూ వేదపండితులు.. బ్రాహ్మణ సమాజానికి చేయూతనందిస్తే మేలు జరుగుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో దేవాలయాలు ధూపదీప నైవేద్యాలతో విరాజిల్లాయని గుర్తు చేసుకున్నారు.

గోరటి, సుద్దాలకు జాలాది పురస్కారం

9న విశాఖలో ప్రదానం

ద్వారకానగర్(విశాఖ దక్షిణం): సినీ కవి డాక్టర్ జాలాది పేరిట ఏటా ప్రదానం చేస్తున్న జాతీయ ప్రతిభా పురస్కారాలకు.. ఈ ఏడాది సుప్రసిద్ధ ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్న, ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజను ఎంపిక చేసినట్లు మంత్రి గంటా తెలిపారు. ఆదివారం విశాఖలో జరిగిన మీడియా సమావేశంలో జాలాది జయంతి ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంత్రి గంటా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాలాది కళాపరిషత్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ జాలాది విజయ మాట్లాడుతూ.. ఈ నెల 9న విశాఖలోని 'వుడా చిల్డ్రన్ ఎరీనా'లో నిర్వహించే జాలాది జయంతి ఉత్సవాల్లో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.





Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్!! నేను ఒక అబ్బాయిని లవ్ చేశాను. చెప్పకుండా ఉండటం సరికాదని ధైర్యం చేసి చెప్పేశాను. త్రీఇయర్స్‌గా తన మాట కోసం వెయిట్ చేస్తున్నా. నాతో క్లోజ్‌గానే ఉంటాడు, బాగా మాట్లాడతాడు.. కానీ నేనంటే ఇష్టమని చెప్పడ్డంలేదు. నేను వెయిట్ చేస్తానని కూడా చెప్పాను తనకి. అయినా ఇంత వరకూ ఎలాంటి రిప్లై లేదు. అలా అని వేరే వాళ్లని పెళ్లి చేసుకోలేను. తన స్థానంలో ఎవరినీ ఊహించుకోలేను. మనసులో ఒకరిని పెట్టుకుని రేపు వచ్చే వ్యక్తిని మోసం చెయ్యలేను. ఎందుకంటే ప్రేమ అనేది మానసికమైన సంబంధమని నేను నమ్ముతాను. గతాన్ని మరచిపోలేక, భవిష్యత్‌ను ఆహ్వానించలేక.. అనుక్షణం చస్తూ బతుకుతున్నాను. ఇప్పటికీ మేం మంచి స్నేహితుల గానే ఉన్నాం. నేను ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి అన్నయ్యా.. మరోసారి ధైర్యం చేసి అడగనా?

– ఉష

ఏం చెయ్యగలుగుతాం బంగారం..?

'ఏంటి సార్ క్వశ్చన్‌కి క్వశ్చన్ ఆన్సర్‌గా చెబుతున్నారు?'

అంటే..?

'అంటే గింటే కాదు అక్కడ మీ చెల్లెలు లైఫ్‌లో టెన్షన్ భరించలేక రాస్తే క్వశ్చన్‌కి క్వశ్చన్ ఆన్సర్‌గా చెబుతారా?'

అంటే..?

'అంటే ఏంటి సార్.. అంటే... అంటే... అని నసుగుతున్నారు?'

సరే నువ్వు చెప్పు!!

'ఫొటో మీది పెడుతున్నారు సార్ ఆన్సర్ నేనెందుకు ఇవ్వాలి...? యూ ఓన్లీ టెల్..'

నువ్వూ నేనూ చెప్పగలిగింది ఏమీ లేదు.. ఆ అబ్బాయే చెప్పాలి. ధైర్యంగా అడిగెయ్యాలి. ఇప్పటికే ఒకసారి అడిగా, మరో సారి అడిగితే మనం చీప్ అయిపోతాం అని అనుకోవడం కంటే... అడిగి ఆ వలయంలో నుంచి బయటపడటం ఎంతో బెటర్! బీ కాన్ఫిడెంట్ అండ్ బీ షూర్ ఆల్వేస్!

'అరటిపండు లాంటి ఆన్సర్ సార్.. క్వశ్చన్‌కి క్వశ్చన్ అన్సర్‌గా చెప్పేముందు... ముందే ఈ ఆన్సర్ చెప్పుంటే..!?'

మేడమ్! నీకో దండం పెడతా చెబుదామనే లోపలే రియాక్ట్ అవుతున్నావు... ఒక అరటిపండు ఇస్తే నేను తింటా... నువ్వు బ్రెయిన్ తిను..!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సెల్ఫ్ చెక్

రాఖీ అందమైన బ్యాండ్ మాత్రమేనా?



పిల్లలకు రాఖీ అంటే మణికట్టుకు కట్టుకునే అందమైన బ్యాండ్ అనే తెలుసు. పురాణ కాలం నుంచి శ్రావణ పౌర్ణమి నాడు దేశం మొత్తం స్థానిక సంప్రదాయాలను అనుసరిస్తోంది. పిల్లలకు చెప్పే ముందు మనం గుర్తు చేసుకుందాం.

1. యమున తన సోదరుడు యముడు క్షేమంగా ఉండాలని రక్షాబంధనాన్ని కట్టిందని, రక్షాబంధనం కట్టే ఆనవాయితీకి ఇదే మొదలు అని విశ్వాసం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. బలి చక్రవర్తికి లక్ష్మీదేవి రాఖీ కట్టినట్లు పురాణ కథనం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. శచీదేవి రాఖీని ఇంద్రునిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసం కలిగించడానికి సాధనంగా ఉపయోగించింది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. శిశుపాల వధలో కృష్ణుని మణికట్టుకు గాయమై రక్తం కారితే ద్రౌపది తన చీర చెంగును చించి గాయానికి కడుతుంది. అప్పుడు కృష్ణుడు ఆమెకు అండగా ఉంటానని మాట ఇచ్చినట్లు ఒక కథనం వాడుకలో ఉంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. అరేబియా తీరంలోని వాళ్లు ఈ రోజు సముద్రంలో కొబ్బరికాయలను వదిలి నారియల్ పూర్ణిమగా పండగ చేసుకుని చేపల వేట ప్రారంభిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పర్వదినాన్ని రుషి తర్పణ్, అవని అవిట్టమ్ పేరుతో సంప్రదాయబద్ధంగా చేసుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. ఉత్తరాది రైతులు ఈ రోజును కజారి పూర్ణిమగా పండగ చేసుకుంటారు. గోధుమ, బార్లీ పంటలు నాటే రోజులివి. భగవతీదేవికి పూజ చేసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. గుజరాత్‌లో ఈ రోజు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి మణికట్టుకు పంచకవ్యంలో(ఆవు పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడలతో చేసిన మిశ్రమం) ముంచిన నూలుదారాలను కట్టుకుంటారు. ఇది విషాన్ని హరిస్తుందని, పాపనాశకంగా పని చేస్తుందని వారి విశ్వాసం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

మీ సమాధానాల్లో 'ఎ'లు ఆరు అంతకంటే ఎక్కువగా వస్తే ఈ పండగ పుట్టు పూర్వోత్తరాల గురించి మీకు ఆసక్తి ఎక్కువ. పిల్లలకు దీని మూలాలను చెప్పడానికి తగిన సమాచారం ఉంది.

ఈ వారం YouTube హిట్స్

అబ్బాయి నాట్ సో.. స్ట్రాంగ్

శుభ్ మంగళ్ సావ్‌ధాన్ : ట్రైలర్

నిడివి : 2 ని. 52 సె., హిట్స్ : 61,15,868

''ఎస్.. మిస్టర్ శర్మ.. మీ ప్రాబ్లం ఏంటి?'' – డాక్టర్ గారి ప్రశ్న. ఆయన ఎదురుగా శర్మ, శర్మకు కాబోయే మామగారు కూర్చొని ఉన్నారు. శర్మ చెప్పడం మొదలు పెట్టాడు. మామగారు మధ్య మధ్యలో ముఖం చిట్లించి శర్మపై విరుచుకు పడుతున్నారు. ''రెండ్రోజుల్లో మా పెళ్లి డాక్టర్. ఈయన కూతుర్నే చేసుకోబోతున్నాను. ఒకరోజు ఏమైందంటే.. ఈయన, ఈయన భార్య ఇంట్లో లేనప్పుడు.. ఈయన కూతురు, నేను.. దగ్గర కాబోయాం. నేను తనను టచ్ చేశాను'' అని శర్మ చెబుతుంటే, కాబోయే మామగారు ఇంతెత్తున లేచి, ''సిగ్గుండాలి. పెళ్లి కాకుండా పిల్లను తాకడానికి'' అని గయ్ మంటాడు. శర్మ కూడా పెద్దగా అరుస్తాడు.. ''నేనే కాదు, మీ కూతురు కూడా నన్ను తాకింది'' అంటాడు. ఇక్కడ ఈ సీన్ కట్ కాగానే అక్కడ ఫ్లాష్‌బ్యాక్‌లో.. శర్మ చెయ్యి వెయ్యడం, ఆ తర్వాత ఇంకేమీ చెయ్యలేకపోవడం, అమ్మాయి కంగారుగా.. 'ఏమైందీ' అని అడగడం, 'అది జెంట్స్ ప్రాబ్లం' అని శర్మ చెప్పడం ట్రైలర్‌లో రెండో సీన్. ఇదిగో ఆ ప్రాబ్లంతోనే అల్లుడు గారిని కాబోయే మామగారు డాక్టర్ దగ్గరికి తీసుకొస్తాడు. 'ఎరక్టైల్ డిస్‌ఫంక్షన్' (అంగస్తంభన సమస్య) అనే ఒక దుస్సాహస థీమ్‌తో తయారైన 'శుభ్ మంగళ్ సావ్‌ధాన్' అనే బాలీవుడ్ మూవీ ట్రైలర్ ఇది. సినిమా సెప్టెంబర్ 1న విడుదల అవుతోంది. శర్మగా ఆయుష్మాన్ ఖురానా, శర్మకు కాబోయే భార్య సుగంధగా భూమి పెడ్నెకర్ ఇందులో యాక్ట్ చేస్తున్నారు. పైకి చెప్పుకోడానికి మగవాళ్లు బిడియపడే ఒక గంభీరమైన సమస్యకు కామెడీ ప్రజెంటేషన్ ఈ చిత్రం. ట్రైలర్‌లోని బిట్స్ చూస్తుంటే.. మూవీ హిట్టయ్యేలానే ఉంది!


శుభ్ మంగళ్ సావ్‌ధాన్ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా, భూమి పెడ్నెకర్

నువ్వొక నికార్సైన దుష్టశక్తివి

మేజర్ లేజర్-సువా కారా: మ్యూజిక్ వీడియో

నిడివి : 2 ని. 46 సె., హిట్స్ : 5,06,76,064



గుర్రాలు డాన్స్ చెయ్యవు. ముందుకాళ్లు పైకెత్తి సకిలిస్తాయి. అయితే.. ఇరవై నాలుగేళ్ల బ్రెజీలియన్ ఫిమేల్ సింగర్ 'అనిట్టా', అదే దేశపు పాప్ గాయని పాబ్లో విట్టార్‌ల ఎడారి యుగళ నృత్యాన్ని ఈ వీడియోలో చూస్తున్నప్పుడు అచ్చంగా రెండు అందమైన గుర్రాలు డాన్స్ చేస్తున్నట్లే ఉంటుంది. ఇదొక పోర్చుగీసు దృశ్యగీతం. 'మేజర్ లేజర్' అనే ముగ్గురు అమెరికన్ కుర్రాళ్ల ఎలక్ట్రానిక్ మ్యూజిక్ బృందం దీనిని చిత్రీకరించి 'సువా కారా' అనే పేరుతో యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసింది. సావా కారా అంటే పోర్చుగీసు భాషలో 'యువర్ ఫేస్' అని అర్థం. ఫస్ట్ అనిట్టా స్టార్ట్ చేస్తుంది. 'సిద్ధమవ్వు. బట్, యుద్ధం చెయ్యకు. చూడు, కానీ తలపడకు. నువ్వు మగాడిననుకుంటున్నావ్ కదా, బట్ నన్నాపలేవ్. నువ్వొక నికార్సైన దుష్టశక్తివి. కానీ నన్నెదుర్కోలేవు..' అని! తర్వాత పాబ్లో విట్టార్ అందుకుంటుంది. '.. నేనిక్కడ ఉన్నాను, ఎటాక్ చెయ్యడానికి సిద్ధంగా. నీ ముఖం మీద గుద్దేస్తాను. సరిగ్గా ముఖం మీద..' అని! ధైర్యవంతులైన అబ్బాయిలు మాత్రమే అందమైన అమ్మాయి ఇలా మాట్లాడితే తట్టుకోగలరు. మ్యూజిక్ హైలైట్. అంతకంటే హైట్ ఈ ఇద్దరు అమ్మాయిలు! బహుశా అందుకేనేమో ఈ వీడియో హిట్స్ కూడా త్వరత్వరగా కోట్లు దాటేస్తున్నాయి!

చందమామల బృందగానం

గర్ల్స్ జనరేషన్: హాలిడే మ్యూజిక్ వీడియో

నిడివి : 3 ని. 23 సె., హిట్స్ : 71,30,903

దక్షిణ కొరియా అమ్మాయిల ఫేమస్ మ్యూజిక్ బ్యాండ్ 'గర్ల్స్ జనరేషన్' కొత్తగా విడుదల చేసిన 6వ ఫుల్ లెంగ్త్ ఆల్బమ్ 'హాలీడే నైట్'లోని ఒక ట్రాక్ ఇది. పేరు 'హాలీడే'. ఎనిమిది మంది (మొదట్లో తొమ్మిది మంది ఉండేవారు) బాలికల్లాంటి యువతులు ఫ్రెష్‌గా, ఎంతో ఎనర్జిటిక్‌గా సెలబ్రేట్ చేసుకున్న సమ్మర్ హాలీడే అనుభూతులు మిక్స్ అయి ఉన్న ఈ డాన్స్ వీడియో యూట్యూబ్‌లో వాయువేగంతో ఉల్లాసాన్ని వెదజల్లుతోంది. బ్యాండ్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అమ్మాయిలంతా 'హో.. హో.. హో..' అని డ్యాన్స్ చేసి, అర్థవంతంగా పాడి రెండు మూడు రోజుల్లోనే.. లాట్స్ ఆఫ్ 'లవ్ అండ్ సపోర్ట్'ని హిట్‌ల రూపంలో కొట్టేశారు. 'నాకెంతో బాగుంది. ఈ రోజు కోసం నేను ఎదురు చూశాను. మనం మొదటిసారి కలుసుకున్నప్పటి లానే మళ్లీ ఒక సారిప్పుడు కలుసుకున్నాం' అంటూ ప్రారంభమయ్యే ఈ ఆహ్లాదగీతం.. 'హే.. ఈరోజు మన హాలీడే. మన అలసట దినాల నుంచి ఇక్కడికి పారిపోయి వచ్చాం. విద్యుల్లతలమై మెరిసి మురిసిపోదాం' అని ఎండ్ అవుతుంది. మిస్ కాకుండా చూడండి.





మణికట్టుకు కడుతున్న రాఖీ
ఎందుకివాళ బాధపడుతోంది?
పువ్వులా వికసించే రాఖీ
ఎందుకు వడలిపోయినట్టుగా అనిపిస్తోంది?

అసలు రాఖీకొచ్చిన బాధ ఏంటి?
కలుగుతున్న కష్టమేంటి?
సోదరులు కరువయ్యారా?
రక్షణ బరువయ్యిందా?
ఆగండాగండి!
ఇవాళ రాఖీ పండగ.
రాఖీ స్వగతం వింటే
సోదరులకే కాదు...
అక్కాచెల్లెళ్లకు కూడా కళ్లు చెమరుస్తాయి.
ఆ అందమైన బంధాన్ని
మళ్లీ బలపరచాలన్న స్ఫూర్తి కలుగుతుంది..

రాఖీ సాక్షిగా

రాఖీ... అంటే భారతీయుల పరిభాషలో రక్షణ. అంటే నేనే! అన్న, తమ్ముడు, కొన్నిచోట్ల నాన్నకు కూడా అక్క, చెల్లి, కూతురు నన్ను మణికట్టుకు కడతారు.. జీవితాంతం తమకు అండగా, రక్షగా ఉండమని! అందుకే ఈ వేడుక రక్షాబంధన్ అయింది. ఒకరకంగా ఇది నా పుట్టినరోజు. నాది నిన్నమొన్నటి జన్మ కాదు. పురాణకాలంలోనే పురుడు పోసుకున్నాను. ఎప్పుడు పుట్టానో చెప్పలేను కాని నాటి నుంచయితే ఉనికిలో ఉన్నా! నాకు గుర్తున్నంత వరకు నా పుట్టిన రోజులు.. మీలో చాలామందికి తెలిసినవి.. నెమరు వేసుకునేవి మరోమారు గుర్తు చేస్తా! ఇది ద్వాపర యుగం నాటిది.. ఓ రోజు... శ్రీకృష్ణుడు చెరుకుగడను విరుచుకుంటుంటే దాని పేడు తగిలి వేలు కోసుకుపోయింది. జలజల రక్తం కారడం మొదలైంది. పక్కనే ఉన్న రుక్మిణి కంగారు పడి ఆ పక్కనే ఉన్న చెలికత్తెలను పురమాయించింది కట్టుకట్టడానికి గుడ్డ తెమ్మని. ఈ పక్కనే ఉన్న ద్రౌపది క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన కొంగు చించి శ్రీకృష్ణుడి వేలుకు గట్టిగా చుట్టి రక్తప్రవాహానికి అడ్డుకట్టవేసింది. కృష్ణుడు ఆప్యాయంగా ద్రౌపది తల నిమిరి.. "చెల్లెమ్మా.. ఆపదకాలంలో నీకు రక్షణగా నిలిచి నీ రుణం తీర్చుకుంటాను" అని మాట ఇచ్చాడు. దుశ్శాసనుడు నిండుసభలో ద్రౌపదిని అవమానించినప్పుడు ఆమె అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడి ఇచ్చిన మాటను నెరవేర్చుకున్నాడు. ఇదీ రక్షాబంధనమే! ఇంకో జ్ఞాపకం కూడా చెప్తా.. ఒకసారి యమునా నది యమధర్మరాజు ముంజేతికి నన్ను కట్టింది. సంతోషపడిన యమధర్మరాజు "నీకు మరణం అనేది ఉండదు. నిత్యం పరవళ్లు తొక్కుతూ ఉంటావ్' అని ఆశీర్వదించాడు. "నువ్వే కాదు రాఖీ కట్టిన ఏ సోదరైనా సోదరుల రక్షణలో చిరంజీవులుగా వర్ధిల్లుతారు" అనే వరమూ ఇచ్చారు. అప్పుడు తెలిసింది నాకు నా శక్తేంటో!



చరిత్ర

సరే... "పైనవన్నీ యుగాలనాటివి.. పైగా పురాణాలంటున్నావు.. వాటిల్లో నిజమెంతో.. అబద్ధమెంతో?" అని ఫేస్ క్వశ్చన్‌మార్క్‌లా పెట్టారు? ఒకే అయితే చరిత్రలోని సంఘటనలే చెప్తాను. అలెగ్జాండర్ ది గ్రేట్ తెలుసు కదా? దండయాత్రలతో ప్రపంచాన్ని చుడుతూ మన దేశానికీ వచ్చాడు. ఇక్కడ పురుషోత్తముడు అనే చక్రవర్తి గొప్ప వీరుడు, మహా శూరుడు అని అలెగ్జాండర్‌తోపాటు అతని భార్య రుక్సానా కూడా విన్నది. అలాంటి పరాక్రమవంతుడు యుద్ధంలో తన భర్తను మట్టుపెట్టేస్తాడేమోనని భయపడింది. అప్పుడు నా గురించి తెలుసుకొని.. సేవకుడి ద్వారా పురుషోత్తముడి దగ్గరకు పంపింది. నన్ను తన మణికట్టుకు ముడివేసుకొని తనను సోదరిగా స్వీకరించమని.. యుద్ధంలో అలెగ్జాండర్‌ను వధించకుండా వదిలేయమని విన్నవించుకుంది. అన్నట్టుగానే పురుషోత్తముడు యుద్ధంలో అలెగ్జాండర్‌ను వధించే అవకాశం వచ్చినా.. ములేసి రుక్సానాకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. దీనినే ఇంకోలా కూడా చెప్పుకుంటారు. పురుషోత్తముడి భార్య సంయుక్త అలెగ్జాండర్‌కు రాఖీ కట్టిందని, ఆమెను చెల్లిగా భావించిన అలెగ్జాండర్, పురుషోత్తముడికి ప్రాణభిక్ష పెట్టాడనీ కూడా చెబుతారు. కథ ఏదైతేనేం... నాకున్న పవర్ అదీ! నన్ను కట్టిన అక్క, చెల్లి ధనమాన, ప్రాణాలే కాదు సౌభాగ్యాన్నీ కాపాడతా. జీవితాంతం రక్షగా నిలుస్తా!

పరువుకోసం..

హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో అట... తమ కులం కాని వాళ్లను ప్రేమించారని.. వాళ్లనే పెళ్లి చేసుకుంటామని పట్టుబట్టారని కడుపున పుట్టిన బిడ్డలని కూడా చూడకుండా నరికి పోగులు పెట్టారు. పదిమందిలో పరువు కోసం కన్నపిల్లల ప్రాణాలనే బలిపెట్టారు. వాళ్లనుకునే పేరుప్రతిష్టలను నిలుపుకోవడం కోసం ఆ ఇళ్లల్లో ఆడపిల్లలను చంపడానికి ఇంటి పెద్ద సహా అన్నాతమ్ముళ్లు కూడా సిద్ధపడుతున్నారు. భద్రతకు భావమే లేకుండా చేస్తున్నారు.

భ్రూణ హత్యలు

పుట్టాక అమ్మాయి మీద కక్షగట్టి చేస్తున్న నీచాలు ఒకెత్తయితే.. పుట్టకుండా చూసే పాతకం ఒకెత్తు. గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలిసిందంటే చాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనే కాదు పక్కరాష్ట్రమైన మహారాష్ట్రలాంటి చోట్ల కూడా అబార్షన్‌తో ఆ పిల్లకు పుట్టుకలేకుండా చేస్తున్నారు. ఒకవేళ పుట్టినా పురిట్లోనే గొంతునొక్కేస్తున్నారు.
ఇవన్నీ కాక.. ప్రతి అన్న, తమ్ముడు, మామయ్య, బాబాయ్, చివరకు తాతయ్య వయసు వృద్ధులు కూడా ఇంట్లోంచి బయటకు వెళితే చాలు.. పరాయి ఆడపిల్ల కనపడితే చాలు ఈవ్‌టీజింగ్, వెకిలి నవ్వులు, అసభ్యప్రవర్తనలు, అవాకులు, చవాకులతో అమ్మాయిలు గడపదాటకుండా కట్టడి చేస్తున్నారు. దినదినగండం.. నూరేళ్ల ఆయుష్షును తలపిస్తున్నారు! వీళ్లంతా అన్నదమ్ములు, తాతతండ్రులే అయినప్పుడు.. నా సాక్షిగా ప్రతి ఇంటి ఆడపిల్లకు భద్రతనివ్వాలి కదా.. రక్షణగా నిలవాలి కదా! మరెందుకు ఇలా కాల్చుకు తింటున్నారు?
అర్థమైంది.. అంటే నా అస్తిత్వంతో అమ్మాయిలంతా భద్రంగా ఉంటున్నారని అనుకున్నాను. ప్రతి యేటా నా పుట్టిన రోజుకి నన్ను వాళ్ల సోదరుల చేతులకు కట్టి రక్షణను కానుకగా స్వీకరిస్తున్నారనే భ్రమలో ఉన్నాను. అసలు రక్షాబంధన్‌కు విలువే ఇవ్వట్లేదు ఇన్ని వాస్తవాలు సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. నన్ను ఒక పండుగలా సంవత్సరానికి ఒక్కరోజుకు పరిమితం చేశారు. దాని స్ఫూర్తిని అవగతం చేసుకోలేదు. ఏడుపొస్తుంది నాకు.. ఇన్నాళ్లు ఎంత విర్రవీగాను.. ఈ మగాళ్లలాగే. నాదేదో అద్భుతమైన జన్మ అని.. లోకంలోని అమ్మాయి సంక్షేమం, శ్రేయస్సు కోసం కారణజన్మురాలిగా అవతరించానని గర్వపడ్డాను. ఇప్పుడు సిగ్గుపడుతున్నాను. అయినా నా ధర్మం మరచిపోను. రక్షణ.. భద్రత స్వీయ బాధ్యత అని తెలిసొచ్చింది. అందుకే ఇప్పటి నుంచి నన్ను మీకు మీరే కట్టుకోండి అమ్మాయిలూ.. మీ భద్రత, మీ రక్షణను మీ చేతుల్లోనే పెట్టుకోండి. నాకు పవిత్రత కన్నా ప్రాక్టికాలిటీని ఆపాదించండి. సంవత్సరానికి ఒక్కసారి కాదు... ప్రతిరోజును రాఖీపౌర్ణమిని చేసుకోండి. నేను మీ ముంజేతి కున్న శక్తిని, యుక్తిని, ఆత్మవిశ్వాసాన్ని అని మరచిపోకండి.

నిజమా? మరి ఇవేంటి?

''పురాణాలను, చరిత్రను చూపించి నిన్ను నువ్వు భలే రొమాంటిసైజ్ చేసుకుంటున్నావ్.. బాగానే ఉంది. నీ ఉనికికి అది అవసరం కూడా! కాని వర్తమాన భారతం చూడు.. అక్క, చెల్లి, తల్లి, బిడ్డ పడుతున్న యాతన చూడు..'' అంటారా? .. విశాఖపట్టణం జిల్లాలోని వాకపల్లిలో రక్షణనివ్వాల్సిన పోలీసులే ఆదివాసి ఆడబిడ్డల మీద లైంగిక దాడి చేశారు. వాళ్ల ఆత్మగౌరవాన్ని కించపరిచారు. దేశాన్ని కంటికిరెప్పలా కాపుకాయాల్సిన జవాన్లు కశ్మీరు ఆడపిల్లల మానాభిమానాల్ని మంటగలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని నోరెత్తి ఎక్కడా చెప్పుకోనివ్వకుండా చేశారు. పోలీసుల, జవాన్ల అహంకారం వాకపల్లికో.. కశ్మీర్‌కో పరిమితం కాలేదు.. దేశంలోని ఎనిమిది దిక్కులకూ వ్యాపించింది.

అన్న.. తండ్రి..

జన్మనిచ్చిన తండ్రే కూతుళ్ల పాలిట భక్షకుడిగా మారుతుంటే జవాన్లను, పోలీస్‌లను అని ఏం లాభం? ఇదేదో పల్లెటూరులో జరిగిన దారుణం కాదు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాజధాని.. హైదరాబాద్ నగరంలో బయటపడ్డ విషాదం! పన్నెండేళ్ల కూతురికి ఆత్మస్థయిర్యమై.. ఆమె వెనకాల నిలబడాల్సిన తండ్రి.. కన్న బిడ్డ అనే ఇంగితం కూడా మరచి ఆ పిల్లపట్ల పైశాచికంగా ప్రవర్తించాడు. మూడేళ్లపాటు ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇంట్లో కూడా అమ్మాయిలకు రక్షణ లేదని నిరూపించాడు. ఇంకెక్కడో బిహార్‌లో.. అన్న తన చెల్లి పట్ల ఇలాంటి నిర్వాకమే వెలగబెట్టాడట. బయటి వాళ్ల నుంచి చెల్లికి అపాయం కలగకుండా చూడాల్సిన అన్నే చెల్లెలిని చెరిచాడు. ఆ తప్పును పెద్దవాళ్ల ముందు బయటపెడుతుందని చెల్లి గొంతు కోసేశాడు. భగవంతుడా.. ఇంకా ఏమేమి చూడాలి? ఎన్ని ఘోరాల గురించి వినాలి?

అమ్మేస్తున్నారు...

ఆడపిల్లను లక్ష్మీదేవిగా కొలవడం.. రాతలకు, మాటలకే పరిమితం. ఇప్పుడైతే అమ్మాయి పుడితే భారంగానే భావిస్తున్నారు. అందుకే వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండుల్లో, వీధుల్లో, చివరకు చెత్త కుప్పల దగ్గరా ఉట్టిగానే వదిలేసి వెళితే.. కొంతమంది అమ్మేసి కాసులు తీసుకుంటున్నారు. ఇది కన్నవాళ్లు మూటగట్టుకుంటున్న పాపమైతే.. ఇంకొంతమంది తమకూ కూతుళ్లు, అక్కాచెల్లెళ్లు ఉంటారు అని మరచి తమ ఇంటి ఆడపిల్ల కాకపోతే చాలు అనుకొని ఇంకే ఇంటి ఆడపిల్ల అమాయకంగా కనిపించినా మాయచేసి.. మోసంచేసి చేతులు మారుస్తున్నారు, ట్రాఫికింగ్‌తో క్యాష్ చేసుకుంటున్నారు. క్షమించలేని తప్పుకు పాల్పడుతున్నారు.

కదిలే కార్లల్లో.. బస్సుల్లో..

నాలుగు గోడల కప్పు కింద.. కన్నవాళ్ల సంరక్షణలోనే భద్రత లేనప్పుడు వీధుల్లో.. నడి బజారుల్లో.. కదిలే కార్లల్లో.. బస్సుల్లో ఎక్కడిది? నిర్భయను కదిలే బస్సులోనే కబళించారట. భారత దేశం నా మాతృభూమి, భారతీయులంతా నా సహోదరులు.. అన్న ప్రతిజ్ఞను మరచి మరీ నిర్భయ జీవితాన్ని చెరిచారు. భవిష్యత్తు గురించి బంగారు కలలు కన్నది, ఏదో సాధించాలనే తపనతో ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీ వచ్చింది. తండ్రి ఉన్న ఆస్తి అంతా అమ్మి కూతురును ఫిజియోథెరపీలో చేర్పించాడు. మంచి ఫిజియోథెరపిస్ట్‌గా పేరు తెచ్చుకుంటుందని తల్లిదండ్రులు ఆశపడ్డారు. వాళ్ల కోరికను నెరవేర్చాలనే పట్టుదలతో చదువుతోంది. ఈ లోపే బస్సులో దుర్మార్గులు ఆమె కలలను కుళ్లబొడిచారు. బతుకును బుగ్గిపాలు చేశారు. ఇది జరిగిన కొద్దిరోజులకే అయిదేళ్ల గుడియా.. ఇంటి పక్క అన్నయ్య కోరికకు బలైంది దారుణంగా! ఇలాంటివి ప్రపంచానికి తెలిసినవి వందల్లో.. తెలియనివి వేలల్లో ఉన్నాయ్!

డైరెక్టర్ అవ్వాలని...


'అల్లరి' నరేశ్

పెద్ద హీరోను డైరెక్ట్ చేసి లైఫ్‌లో సెటిల్ అయిపోదామనుకున్న అబ్బాయి ఓ అమ్మాయితో లవ్‌లో పడతాడు. అలా డైరెక్షన్ దారి తప్పుతుంది. కానీ, మేడ మీద అబ్బాయి దారిలోకి అమ్మాయి వస్తుంది. డైరెక్టర్ కావాలనుకున్న ఆ అబ్బాయి లవ్‌ను ఎలా డైరెక్షన్ చేసుకున్నాడు? అన్న అంశాలతో రూపొందిన చిత్రం 'మేడ మీద అబ్బాయి'. 'అల్లరి' నరేశ్ హీరోగా జి. ప్రజిత్ దర్శకత్వంలో శ్రీమతి నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. రెండు రోజుల్లో పది లక్షలు వ్యూస్ సాధించింది. 'ఈ మేడ మీద అబ్బాయిని అందరూ మీ ఇంటి అబ్బాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు నరేశ్. ''రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. నరేశ్ కేరీర్‌లో మరపురాని చిత్రంగా నిలిచిపోతుంది. ఈ నెలలో ఆడియోను, సెప్టెంబర్‌లో చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు చంద్రశేఖర్. అవసరాల శ్రీనివాస్, జయప్రకాశ్, తులసి, సుధ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: షాన్ రెహమాన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎమ్.ఎస్ కుమార్.

నాని హస్తవాసి మంచిది - విజయ్


విజయ్ దేవరకొండ, షాలిని

''ట్రైలర్ చూసి సినిమా చూడాలా? వద్దా అనే నిర్ణయానికొస్తున్నాం. సినిమాకు వెళ్లాక కథలో లీనం కావడానికి కొంత సమయం పడుతుంది. కానీ 'అర్జున్ రెడ్డి' ట్రైలర్ చూడగానే సినిమాకు వెళ్లాలనుకుంటాం. ఇలాంటి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు మేకర్స్‌కు థ్యాంక్స్'' అని హీరో నాని అన్నారు. విజయ్ దేవరకొండ, షాలిని జంటగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో ప్రణయ్ రెడ్డి నిర్మించిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. ఈ సినిమా ట్రైలర్‌ను నాని రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''విజయ్ నా 'ఎవడే సుబ్రమణ్యం'తో పరిచయం అయ్యాడు. అతడి 'పెళ్లిచూపులు' టీజర్‌ను, ఇప్పుడు 'అర్జున్ రెడ్డి' ట్రైలర్‌ను నేను ఆవిష్కరించడం సంతోషంగా ఉంది. 'అర్జున్ రెడ్డి' ట్రైలర్ చాలా బాగుంది. ఈ చిత్రం తెలుగు సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లేది అవ్వాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''ఎమోషన్స్‌తో కూడుకున్న చిత్రమిది. లొకేషన్ల ఎంపికకు చాలా టైమ్ పట్టింది. ఈ నెల 25న సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు సందీప్ రెడ్డి. ''నాని హస్తవాసి మంచిది. ఆయన మా సినిమా ట్రైలర్ రిలీజ్ చేయడంతో పాటు చాలా బాగుందని మెచ్చుకోవడంతో మా సినిమా హిట్ అనే భరోసా వచ్చింది'' అన్నారు విజయ్ దేవరకొండ. ప్రణయ్ రెడ్డి, షాలిని, తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు పి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లోకరక్షకుడు

ఏసుక్రీస్తు జీవిత చరిత్ర ఆధారంగా బ్రహ్మం సి. హెచ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'లోకరక్షకుడు'. చంద్ర పర్వతమ్మ సమర్పణలో చంద్రశేఖర్ చంద్ర నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాటలను రికార్డ్ చేస్తున్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ– ''కొత్త అంశాలతో ఏసుక్రీస్తు జీవిత చరిత్రను అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ ఏకే రిసాల్ సాయి మంచి ట్యూన్స్ కంపోజ్ చేశారు. సింగర్ మధుబాల కృష్ణన్, గీతామాధురి, హేమాంబిక చక్కగా పాడారు. అభినవ్ శ్రీనివాస్ రాసిన పాట ఈ చిత్రానికి హైలెట్. ఈ చిత్రం మూడో షెడ్యూల్‌ను ఫారిన్ ఆర్టిస్టులతో కర్ణాటకలో జరుపుతున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: క్రిష్.

'లోకరక్షకుడు'లో ఓ దృశ్యం


సూపర్ ఫాస్ట్

సప్తగిరి హీరోగా హర్షవర్ధన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సప్తగిరి సూపర్ ఫాస్ట్' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. జొన్నాడ రమణ మూర్తి సమర్పణలో నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నట్టి క్రాంతి, నట్టి కరుణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి తెలుగు చలన చిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు పి. కిరణ్ క్లాప్ ఇవ్వగా, సీనియర్ రచయిత విజయేంద్రప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకులు బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ –''నా చిరకాల మిత్రుడు హర్షవర్ధన్ నాతో కలిసి చాలా సినిమాలకు వర్క్ చేశాడు. ఈ సినిమా కథను రెడీ చేసి, నాకు వినిపించి నా అనుమతి


నట్టికుమార్, సప్తగిరి, హర్షవర్ధన్

తీసుకున్నాడు. సప్తగిరికి సూట్ అయ్యే మంచి కథ ఇది. హీరోగా మరో మెట్టు పైకి ఎదుగుతాడు'' అన్నారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ– ''కొత్త నిర్మాతలిద్దరూ సినిమాపై మంచి ప్యాషన్‌తో ఉన్నారు'' అన్నారు. ''మా టీమ్‌ని నమ్మి సప్తగిరిగారు సినిమా చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాతలు. ''ఈ సినిమా అందరికీ మంచి పేరు తీసుకురావాలి'' అన్నారు సప్తగిరి.


రామ్

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం
7-8-2017

ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు

...ఈ మాట అంటున్నది హీరో రామ్. అనడమే కాదు... 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు..' అని ఓ పాట పాడుతున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం పది గంటలకు ఈ పాట విడుదల చేశారు. 'నేను శైలజ' తర్వాత కిశోర్ తిరుమల దర్శకత్వంలో రామ్ హీరోగా నటిస్తున్న సినిమాలోనిదీ పాట. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. అలాగే, స్నేహితుల దినోత్సవం కానుకగా టైటిల్‌నూ ప్రకటించారు. 'స్రవంతి' రవికిశోర్, పీఆర్ సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై కృష్ణచైతన్య నిర్మిస్తున్న ఈ సినిమాకు 'ఉన్నది ఒకటే జిందగీ' టైటిల్‌ను ఖరారు చేశారు. చిత్రసమర్పకులు 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''ఇప్పటివరకు జరిగిన చిత్రీకరణతో 50 శాతానికి పైగా సినిమా పూర్తయింది. సోమవారం ఊటీలో కొత్త షెడ్యూల్ మొదలవుతోంది. దాంతో ఓ పాట మినహా చిత్రీకరణ పూర్తవుతుంది. వచ్చే నెల్లో ఇటలీలో ఆ పాటను చిత్రీకరించి, దసరాకు సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు. అనుపమా పరమేశ్వరన్, లావణ్యా త్రిపాఠి హీరోయిన్లుగా, శ్రీవిష్ణు, 'పెళ్లి చూపులు' ఫేమ్ ప్రియదర్శి కీలక పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కళ: ఏఎస్ ప్రకాశ్, కూర్పు: శ్రీకర్ ప్రసాద్, కెమెరా: సమీర్‌రెడ్డి.

ఎవరూ వెనక్కి వెళ్లలేని పరిస్థితి!

– డి.సురేశ్ బాబు


భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి, సురేశ్ బాబు

''సినిమా ఇండస్ట్రీలోకి నిర్మాతగా, డైరెక్టర్‌గా, రైటర్‌గా, యాక్టర్‌గా రావాలని చాలామంది అనుకుంటారు. కానీ అందరి కలలు నిజం కావు. తక్కువమంది సక్సెస్ అవుతారు. నాకు మా ఫాదర్ (డి. రామానాయుడు) ఒక కంపెనీ తయారు చేసి పెట్టారు. నా తమ్ముడు (వెంకటేశ్) యాక్టర్. తనతో సినిమాలు తీస్తున్నాను. ఇప్పుడు నా కొడుకు (రానా) కూడా ఉన్నాడు. ఎక్కడో నేను బ్లెస్డ్ అనుకుంటున్నాను'' అన్నారు నిర్మాత డి. సురేశ్‌బాబు. రానా, కాజల్ అగర్వాల్ జంటగా తేజ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. డి.సురేశ్ బాబు, సీహెచ్. భరత్‌చౌదరి, వి.కిరణ్‌రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో సురేశ్‌బాబు మాట్లాడుతూ– ''ఇది రాధ, జోగేంద్ర స్టోరీ. రాధ, జోగేంద్ర చిన్నప్పటి నుంచి ఫ్రెండ్స్.. తర్వాత లవర్స్.. ఆ తర్వాత భార్యాభర్తలు. అనుకోని కారణాల వల్ల రాధకు దూరమవుతాడు జోగేంద్ర. చివరికి రాధ దగ్గరకు వెళ్లి ఫైనల్‌గా ఎలా సెట్ అయ్యాడన్నదే చిత్రకథ. మూడో అమ్మాయి క్యాథరిన్ క్యారెక్టర్ ఈ సినిమాలో ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది'' అన్నారు. ఈ నెల 11న మరో రెండు సినిమాలు విడుదలవుతున్న విషయం గురించి సురేశ్‌బాబు ప్రస్తావిస్తూ – ''ఒక్కొక్కసారి పండగకు మూడు నాలుగు సినిమాలు రిలీజ్ అవుతాయి. అన్నీ బాగానే ఆడతాయి. అలాగే ఈ నెల 11ని ప్రేక్షకులు పండగలా, అన్ని సినిమాలను ఆదరిస్తారనుకుంటున్నాను. మిగతా సినిమాల నిర్మాతలతో సంప్రదించడం జరిగింది. కానీ, ఎవరూ వెనక్కు వెళ్లలేని పరిస్థితి. ఎవరైనా వెనక్కు వెళితే భయపడ్డారనే పుకార్లు వస్తాయి. అందుకే వెళ్లలేదు. మా సినిమాపై నమ్మకం ఉంది'' అన్నారు.

''సినిమాల గురించి సురేశ్‌బాబుగారి దగ్గర ఏడాది పాటు ఒక పీజీ డిప్లొమా కోర్స్ చేసినట్లు ఉంది. ప్రీ-ప్రొడక్షన్ వర్క్ బాగా చేస్తే ప్రొడక్షన్‌లో అన్ని బాధలు తగ్గుతాయని ఆయన దగ్గర నేర్చుకున్నాను. తేజగారు బాగా డైరెక్ట్ చేశారు. రానా సూపర్‌గా యాక్ట్ చేశారు'' అని కిరణ్‌రెడ్డి అన్నారు. ''గ్రేట్ ప్రొడ్యూసర్ సురేష్‌బాబుగారితో అసోసియేట్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది. కథను నమ్మి ఈ సినిమా తీశాం. రానాగారిని ఈ సినిమా నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళుతుందన్న నమ్మకం ఉంది. తేజగారి లాంటి డైరెక్టర్‌తో సినిమా తీయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు భరత్ చౌదరి.